ఐరాస ఏఐ కమిటీలో ఐఐటీ ప్రొఫెసర్ 2



# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

గుంటూరు - శనివారం 7 ఫిబ్రవరి 2026 | సంపుటి: 10 | సంచిక: 35 | పేజీలు: 8+4 | వెల: రూ.5

ఛాంపియన్ కుర్రోళ్లు

అండర్ 19 వరల్డ్ కప్ సాధించిండ్రు ● సూర్యవంశీ పరుగుల సునామీ 12



GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA | HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM

## దేశ పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకే

### బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలి

### విశాఖ ఉక్కును లాభాల్లోకి తెచ్చింది కూటమే

### మంత్రి నారా లోకేశ్



**విజయవాడ, మనం ప్రత్యేక ప్రతినిధి:** దేవుడిని అడ్డం పెట్టుకుని రూ.250 కోట్లు దోచుకుని, ఇప్పుడు కల్తీ నెయ్యి కేసులో క్లీన్చిట్ వచ్చిందంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని మంత్రి నారా లోకేశ్ మండిపడ్డారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన బూత్ మేనేజ్మెంట్ వర్క్షాప్లో లోకేశ్ పాల్గొన్నారు. టీం 11' బృందం కల్తీ మద్యం, కల్తీ నెయ్యి, బాబాయి హత్యకు బ్రాండ్ అంబాసిడర్లుగా మారిందని విమర్శించారు.ఈ దుష్ప్రచారాన్ని సమర్థంగా తిప్పికొట్టాలని ఆయన పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా

...మిగతా 2లో



## లా అండ్ ఆర్డర్కు సమస్య తెస్తే తాట తీస్తా

### గత పాలకులు ఆచాకాలు చేశారు



- ప్రైవేట్ భూములను ప్రభుత్వ భూముల జాబితాలో పెట్టారు
- పార్టీ ఆఫీసుకు వందల సంఖ్యలో భూముల సమస్యలున్నాయి
- ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు చేసి క్యూ ఆర్ కోడ్ పెట్టాం
- బ్లాక్ చైన్ టెక్నాలజీ తీసుకొచ్చాం
- ట్యాంపరింగ్ చేయడానికి ప్రయత్నిస్తే వాళ్ళు జైలుకి వెళ్లాల్సిందే

ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు

**కర్నూల్/విజయవాడ, మనంప్రత్యేకప్రతినిధి:** రౌడీలు మీ భూమిని 22ఎ కింద పెట్టేస్తున్నారు.. ప్రైవేట్ భూములను ప్రభుత్వ భూముల జాబితాలో పెట్టారు.. తాడేపల్లి ప్యాలెస్ కట్టుకున్నారు..హెలిపాడ్ కోసం ఆ పక్కన 10 ఎకరాల భూమి అడిగారు.. భూమి ఇవ్వమని చెబితే.. బలవంతంగా హెలిపాడ్ చేశారు.. 22ఎ కింద ఆ భూమిని ప్రభుత్వ భూమిని చేశారని ఆరోపించారు. 1956 నుంచి అన్ని రికార్డులు ఉన్నాయని ఆయన ఆధారాలు చూపుతున్నారు.. బలవంతంగా ప్రభుత్వ భూమిగా మార్చి అనుభవించారు.. వ్యక్తిగత స్వార్థం కోసం చేశారు.. పార్టీ ఆఫీసుకు వందల సంఖ్యలో భూముల సమస్యలు వస్తున్నాయని చంద్రబాబు అన్నారు. శుక్రవారం సీఎం చంద్రబాబు నాయుడు కర్నూలు జిల్లాలో పర్యటించారు. ఎమ్మిగనూరు మండలంలోని కలుగొట్లలో జరిగిన మీ భూమి - మీ హక్కు కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తిరుమల లడ్డూ విషయాన్ని మరోసారి ప్రస్తావించిన సీఎం చంద్రబాబు.. ఈ క్రమంలోనే మరోసారి

...మిగతా 2లో

## తిరుమల ప్రసాదంలో కల్తీ జరిగిందని 4 నివేదికలు తేల్చాయి

### హోం మంత్రి అనిత

**అమరావతి:** రాష్ట్రంలో కల్తీ రిక్రూట్మెంట్ బోర్డును జగన్ స్థాపించారని హోం మంత్రి వంగలపూడి అనిత ఎద్దేవా చేశారు. కల్తీ పాలనతో మహాపాపం చేసి ఎదురుదాడి చేయడానికి సిగ్గనిపించట్లేదా అని ప్రశ్నించారు. తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ జరిగిందని ఒకటి కాదు రెండు కాదు నాలుగు నివేదికలు స్పష్టం చేస్తున్నాయన్నారు. అందులో సీఎఫ్టీఆర్ఐ నివేదిక 2022లో వైకాపా హయాంలో వచ్చిందే అన్నారు. సీఎఫ్టీఆర్ఐతో పాటు ఎన్డీడీబీ, ఎన్డీఆర్ఐ, సిట్ నివేదికలు అన్నీ కల్తీని ధ్రువీకరించాయని స్పష్టం చేశారు. జంతు కొవ్వు అవశేషాలు నిర్ధారించే సామర్థ్యం తమ వద్ద లేదని మాత్రమే ఎన్డీఆర్ఐ చెబితే.. దానిని పట్టుకుని జంతుకొవ్వు లేదని ప్రచారం చేసుకుంటారా అని మండిపడ్డారు. లడ్డూలో కల్తీ జరగలేదనటానికి తాడేపల్లి ప్యాలెస్లో

...మిగతా 2లో



## ఎట్టకేలకు పులి దొరికింది

### ఆరు రోజులుగా భయపెడుతున్న పెద్ద పులికి చెక్

### తూర్పుగోదావరి జిల్లాలో విజయవంతమైన రెస్క్యూ ఆపరేషన్

### పగలు గోడ దూకి తప్పించుకున్నా బంధించిన బృందాలు

**విజయవాడ, మనంప్రత్యేక ప్రతినిధి:** తూర్పుగోదావరి జిల్లా ప్రజలను గత ఆరు రోజులుగా తీవ్ర భయాందోళనలకు గురిచేసిన పెద్ద పులి ఎట్టకేలకు చిక్కింది. శుక్రవారం సాయంత్రం అటవీ శాఖ అధికారులు చేపట్టిన భారీ ఆపరేషన్ విజయవంతం కావడంతో మండపేట,

...మిగతా 2లో

## భక్తుల సేవే మహద్భాగ్యం

### టీటీడీ నూతన ఈవోగా బాధ్యతలు చేపట్టిన ముద్దాడ రవిచంద్ర



3

## మౌనం వీడి రండి

### ప్రతి భక్తుడికి ధార్మిక బాధ్యత ఉండాలి

### హిందూ దేవుళ్లను అవమానించినా, మన ధర్మాన్నిఎగతాళి చేసినా

### మనం లోపలే బాధపడి, కర్మకు వదిలేసి, ముందుకు వెళ్లిపోతున్నాం

### ఇది మారాల్సిందే-పవన్ కల్యాణ్



**విజయవాడ, మనంప్రత్యేక ప్రతినిధి:** ప్రతి భక్తుడికి ధార్మిక బాధ్యత ఉండాలని ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు దేవుడిపై భయం, ధర్మంపై గౌరవం ఉన్న సాధారణ హిందూ మనస్తత్వంలోని నిద్రావస్థ నుంచి, సౌకర్య భావన నుంచి మనం బయటకు రావాలి అని చేశారు. కానీ, ఎవరు మన హిందూ దేవుళ్లను అవమానించినా, మన ధర్మాన్ని ఎగతాళి చేసినా, మనం లోపలే బాధపడి, కర్మకు వదిలేసి, ముందుకు వెళ్లిపోతున్నాం అన్నారు. అయితే, ఇది మారాల్సిందే అని పిలుపునిచ్చారు పవన్ కల్యాణ్.. కులం, మతం, ప్రాంతం, భాషలతో మనం విభజించబడి ఉన్నా, మన ధర్మం ఒక్కటే.. దేవుళ్లు కూడా ఒక్కటే.. మన ధర్మాన్ని, విశ్వాసాన్ని ఉద్దేశపూర్వకంగా అవమానించినప్పుడు, మన బాధను గొంతెత్తి చెప్పడం మన బాధ్యత అన్నారు పవన్.. అలాంటి సందర్భాల్లో మౌనం సమిష్టి మనస్సాక్షిని బలహీనపరుస్తుంది అన్నారు..భక్తులుగా మాత్రమే కాకుండా, మన విశ్వాసానికి జాగ్రత్తగా కాపలాదారులుగా కూడా మనం వ్యవహరించాలి అని పిలుపునిచ్చారు.

## రౌడీషీట్పై పోలీసుల కాల్పులు

### సీఐ, కానిస్టేబుల్పై కత్తితో దాడి చేసి పారిపోయేందుకు యత్నం

### రౌడీషీటర్ నాగేంద్ర కాలిలోకి దూసుకెళ్లిన బుల్లెట్

### నిందితుడిపై ఏపీ, కర్ణాటకలో 90 కేసులు నమోదు

### గతంలో గ్యాంగ్రేప్ కేసులోనూ నాగేంద్ర నిందితుడు

**విజయవాడ, మనంప్రత్యేక ప్రతినిధి:** శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం నియోజకవర్గంలో కాల్పుల ఘటన కలకలం సృష్టించింది. చిలమత్తూరు మండలం ఎర్రకొండ అటవీ ప్రాంతంలో నాగేంద్ర అనే రౌడీషీట్పై పోలీసులు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో బుల్లెట్ నాగేంద్ర కాలిలోకి దూసుకెళ్లి, అతను తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల వివరాల ప్రకారం, నాగేంద్రను అరెస్ట్ చేసేందుకు సీఐ ఆంజనేయులు, కానిస్టేబుల్ రవి వెళ్లగా, అతను వారిపై కత్తితో దాడి చేశాడు. అనంతరం అక్కడి నుంచి

...మిగతా 2లో

## ట్రంప్ నోబెల్కు అనర్హుడు



### ఆయన బలవంతంగా అంతర్జాతీయ సంస్థలను అస్థిరపరుసున్నరు

### డొనాల్డ్ను నోబెల్ బహుమతికి నామినేట్ చేయాలన్న ప్రతిపాదనను తిరస్కరిస్తూ పోలండ్

**వాషింగ్టన్, ఫిబ్రవరి 6:** అమెరికాకు మరో మిత్ర దేశం షాకిచ్చింది. అగ్రరాజ్య సూచనలను పట్టించుకోలేదు సరికదా.. తమకు పాఠాలు చెప్పాల్సిన అవసరం లేదంటూ చురకలంటించింది. అధ్యక్షుడు డొనాల్ ట్రంపును నోబెల్ బహుమతికి నామినేట్ చేయడానికి పోలండ్ నిరాకరించడం ఇరుదేశాల మధ్య దౌత్య వివాదానికి దారితీసింది. ఈ పరిణామాలను అగ్రరాజ్య దౌత్యవేత్త తీవ్రంగా ఖండించగా.. పోలండ్ ప్రధాని ఘాటుగా బదులిచ్చారు. అసలేం జరిగిందంటే.. మధ్యప్రాచ్యంలో శాంతియుత పరిస్థితులు నెలకొల్పేలా చేసినందుకు గానూ.. వచ్చే ఏడాది నోబెల్ శాంతి బహుమతికి ట్రంప్ పేరును నామినేట్ చేయాలని అమెరికా, ఇజ్రాయెల్ నుంచి పోలండ్

...మిగతా 2లో

## పాక్లో పెరుగుతున్న మ్యాన్హోల్ చోరీలు

## డ్రైనేజీ మూతలమ్మి ఆకలి తీర్చుకుంటున్న పౌరులు



### విస్మయకర విషయం వెల్లడించిన పంజాబ్ సీఎం మరియం నవాజ్



**ఇస్లామాబాద్, ఫిబ్రవరి 6:** ఆర్థిక అనిశ్చితులతో కొట్టుమిట్టాడుతున్న పాకిస్తాన్ను 'మ్యాన్ హోల్' సమస్య వేధిస్తోంది. మ్యాన్హోల్ మూతలు ఇలా అమర్చగానే.. అలా మాయమవుతున్నాయి. దాంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఈ సమస్యకు చెక్ పెట్టేలా అక్కడి పంజాబ్ ప్రభుత్వం కొత్త చర్యలు చేపట్టింది. ఈ మేరకు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మరియం నవాజ్ మాట్లాడిన వీడియో వైరల్ అవుతోంది. పాక్లో నెలకొన్న ఆర్థిక పరిస్థితుల కారణంగా ఈ మ్యాన్హోల్ మూతలు దొంగతనానికి గురవుతున్నాయి. ఆ ఇనుపమూతలు

...మిగతా 2లో

## ఐరాస కంట్రిబ్యూషన్ రూ.317 కోట్లు చెల్లించిన భారత్

**న్యూయార్క్, ఫిబ్రవరి 6:** ఐక్యరాజ్యసమితి (ఐరాస) సాధారణ బడ్జెట్కు భారత్ తన వంతుగా రూ.317 కోట్లను చెల్లించింది. ఈ చెల్లింపును ఈ నెల 3వ తేదీ నాటికి పూర్తి చేయడంతో సకాలంలో నిధులు అందించిన 47 సభ్య దేశాల గౌరవ జాబితాలో భారత్ చోటు సంపాదించుకుంది. సాధారణ బడ్జెట్ కాంట్రిబ్యూషన్ను సమయానికి చెల్లించే దేశాల్లో భారత్ ముందు వరుసలో ఉంటోందని ఐరాస సెక్రెటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్ ప్రశంసించారు.

## భారతీయులు నగరాన్ని ఆక్రమించారు

### టెక్సాస్ రాష్ట్రంలోని ఫ్రిస్కో నగర కౌన్సిల్ సమావేశంలో స్థానిక నేతలు

### భారతీయుల పట్ల వివక్షాపూరిత వ్యాఖ్యలు




**టెక్సాస్, ఫిబ్రవరి 6:** అమెరికాలో టెక్సాస్ రాష్ట్రంలో జరిగిన ఓ సమావేశంలో అక్కడి భారతీయులు వివక్షకు గురవడం చర్చనీయాంశమైంది. హెచ్-1బీ వీసా దారులు తమ నగరాన్ని ఆక్రమించారంటూ ఫ్రిస్కో నగరంలోని కౌన్సిల్ సమావేశంలో అక్కడి సంప్రదాయ నేతలు జాతి వివక్ష వ్యాఖ్యలు చేసినట్లు సమాచారం. అయితే, దీనికి హాజరైన భారతీయులు ఈ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించినట్లు తెలుస్తోంది. ఫిబ్రవరి 3న జరిగిన ఈ ఘటనకు సంబంధించి స్థానిక పత్రికల్లో కథనాలు వెలువడ్డాయి. వాటి ప్రకారం.. ఫ్రిస్కో నగరంలో భారతీయుల సంఖ్య పెరిగిపోవడంపై కౌన్సిల్ సమావేశంలో

...మిగతా 2లో

# లా అండ్ ఆర్డర్కు సమస్య తెస్తే తాట తీస్తా

(మొదటి పేజీ తరువాయి)

సంచలన వ్యాఖ్యలు చేశారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు చేసి క్యూ ఆర్ కోడ్ పెట్టాం.. ఎన్నిసార్లు అయినా చూసుకోవచ్చు.. బ్లాక్ చైన్ టెక్నాలజీ తీసుకొచ్చాం.. ట్యాంపరింగ్ చేయడానికి ప్రయత్నిస్తే అప్పటికప్పుడే తెలుస్తుంది.. బ్లాక్ చైన్ టెక్నాలజీ తీసుకొచ్చాముట్యాంపరింగ్ చేయడానికి ప్రయత్నిస్తే అప్పటికప్పుడే తెలుస్తుందివాళ్ళు జైలుకి వెళ్లాల్సిందేనని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు.అయితే, ప్రతి నెల 9వ తేదీన భూ సమస్యలు పరిష్కారం అయ్యే వరకు నేను వస్తాను అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఎలాంటి తప్పులు లేకుండా పట్టాదారు పాసు పుస్తకం ఇవ్వడమే నా ధ్యేయం.. పట్టాదారు పుస్తకాల తో పారదర్శకత వస్తుంది.. కర్నూలు జిల్లాలో 8,745 మందికి కొత్త పట్టాదారు పుస్తకాలు పంపిణీ చేస్తున్నాం.. 37 లక్షల 40 వేలు పట్టాదారు పాసు పుస్తకాలు రెడీ అయ్యాయి.. నూటికి నూరు శాతం పట్టాదారు పాసు పుస్తకాలు ఇస్తామన్నారు. జనవరిలో ప్రారంభించి డిసెంబర్ వరకు భూమికి భద్రత ఇచ్చే పనిలో ఉంటా.. భూముల విషయంలో కొట్టుకోవద్దు.. అర సెంటు కోసం అన్నదమ్ములు, తల్లికొడుకులు కొట్టుకుంటున్నారు.. వారసత్వంగా వచ్చే భూమికి కొత్తగా మ్యూటేషన్ చేసుకోవాలంటే 100 రూపాయలు చెల్లిస్తే చాలు అని చంద్రబాబు నాయుడు తెలియజేశారు.

**శ్రీవారి ప్రసాదంలో నెయ్యిని కల్తీ చేశారు...**

తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదానికి ఉపయోగించే నెయ్యిని కల్తీ చేశారన్న చంద్రబాబు.. సీబీఐ, ప్రత్యేక దర్యాప్తు బృందం (సెట్) ఏమీ లేదని చెప్పారంటూ బుకాయిస్తున్నారని అన్నారు. తిరుమల నెయ్యిలో జంతువుల కొవ్వు ఉందని ఎన్డీడీబీ నివేదిక ఇచ్చిందని చంద్రబాబు ప్రస్తావించారు. బాత్రూములు



శుభ్రం చేసే రసాయనాలతో కల్తీ నెయ్యి చేశారంటూ చంద్రబాబు ఆరోపణలు చేశారు. ఐదేళ్ల పాటు తిరుమలలో లడ్డూలకు ఉపయోగించే నెయ్యిలో కల్తీ జరిగిందని చంద్రబాబు ఆరోపించారు. బాత్రూమ్లు శుభ్రం చేసే రసాయనాలు, కూరగాయల్లో వాడే రసాయనాలతో నెయ్యి కల్తీ చేశారని చెప్పారు.

**శ్రీశైలంలో కూడా ఇదే పరిస్థితి**

శ్రీశైలం ప్రసాదం తయారీకి ఉపయోగించిన నెయ్యిని కూడా కల్తీ చేశారంటూ ఆరోపించారు. వైసీపీ హయాంలో రాష్ట్రంలోని ప్రధాన ఆలయాలకు కల్తీ నెయ్యి సరఫరా చేశారంటూ సంచలన ఆరోపణలు చేశారు. తాను ముఖ్యమంత్రిని అయ్యాక ప్రిన్సిపల్ సెక్రటరీని నియమించామని.. తిరుమల తిరుపతి దేవస్థానం ఈవోను మార్చామని చంద్రబాబు వెల్లడించారు. తిరుమల లడ్డూకు సంబంధించి గతానికి, ఇప్పటికీ వ్యత్యాసం ఉందని చంద్రబాబు వివరించారు. రిపోర్ట్లో ఎనిమల్ ఫ్యాట్ ఉందని తేలితే అదే నిజాన్ని చెప్పానని స్పష్టం చేశారు. గతంలో లడ్డూ రుచి, ఇప్పటి లడ్డూ రుచి ఒకటేనా కాదా ప్రజలే చెప్పాలని ప్రశ్నించారు.

**నేను 1995 సీబీఎన్ తప్ప 2014 కాదు..**

తాను 1995లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నాయుడుని తప్ప, 2014 నాటి చంద్రబాబు కాదని వ్యాఖ్యానించారు సీఎం చంద్రబాబు. చేసిన తప్పులను సరిదిద్దడం ఒక సమస్య అయితే, వాటిని చేసిన వారిని ఎదుర్కోవడం మరో సమస్య అని పేర్కొన్నారు.. కర్నూలు పర్యటనలో బహిరంగసభలో ఆయన మాట్లాడుతూ.. మామిడి కాయలు తెచ్చి రోడ్లపై పడేస్తూ గందరగోళం సృష్టిస్తున్నారని విమర్శించారు. ఎన్నికల సమయంలో బలప్రదర్శన చేయాలని, కానీ ప్రజల ప్రాణాలు, ఆస్తులకు భద్రత ఉండాలా లేదా అన్నది ఆలోచించాలని హెచ్చరించారు. రాయలసీమను ప్రపంచానికి హార్టికల్చర్ హబ్గా తీర్చిదిద్దుతామని చంద్రబాబు ప్రకటించారు. ముచ్చుమర్రి, పోతురెడ్డిపాడు ఉన్నప్పటికీ డబ్బుల కక్కుర్తితో రాయలసీమ లిఫ్ట్ ప్రాజెక్ట్ తెచ్చే ప్రయత్నం చేశారని ఆరోపించారు. అనుమతులు లేకపోవడంతో ఎన్జీటీ పనులు నిలిపివేస్తే తనపై నిందలు వేస్తున్నారని మండిపడ్డారు.

**పశ్చిమ ప్రాంతాలకు నీళ్లు రావాలంటే వేదవతి ప్రాజెక్టు పూర్తి కావాలి..**

పశ్చిమ ప్రాంతాలకు నీళ్లు రావాలంటే వేదవతి ప్రాజెక్టు పూర్తి కావాలని, తుంగభద్ర నీటిని కర్నూలు జిల్లా ఎక్కువగా వినియోగిస్తే కరువు సమస్య తీరుతుందని తెలిపారు చంద్రబాబు.. ఆర్డీఎస్ కుడి కాలువపై వర్కౌట్ చేస్తామని, గుండ్రేవుల అంతర్రాష్ట్ర సమస్యపై తెలంగాణ, కర్ణాటక, ఏపీతో చర్చించి త్వరగా పరిష్కరిస్తామని చెప్పారు. వేదవతి ప్రాజెక్టుకు రూ.1942 కోట్లు ఖర్చవుతాయని, ఇప్పటివరకు 16 శాతం పనులు పూర్తయ్యాయని తెలిపారు. తీవ్రవాదులతో పోరాడిన సందర్భంలో తనపై 24 క్లైమోర్ మైన్స్ పేల్చారని చంద్రబాబు వెల్లడించారు. అయినా వెంకటేశ్వర స్వామి తనను కాపాడారని చెప్పారు. ఇక, వివేకానంద రెడ్డి హత్య కేసులో తనపై అనవసరంగా నరాసుర రక్త చరిత్ర అంటూ రాశారని, ఇప్పుడు తనను అపాలజీ చెప్పమంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

**పేదరికం నిర్మూలన లక్ష్యంగా పని చేస్తా...**

పేదరికం నిర్మూలన లక్ష్యంగా పని చేస్తామని, రాయలసీమలో ఏరోస్పేస్ పరిశ్రమలు, డ్రోన్ సిటీ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు.

గుంటూరు నుంచి విజయవాడకు వెళ్లడానికి 6 గంటలు పడుతోందని, ఆ రోడ్డుపై ఇంకెవరూ వెళ్లకూడదా అని ప్రశ్నించారు. రౌడీయిజం, గుండాయిజం చేస్తూ బలప్రదర్శన చేస్తున్నారని తీవ్రంగా విమర్శించారు చంద్రబాబు.. ఇక, టెక్నాలజీ ఇప్పుడు గేమ్చేంజర్గా మారిందన్నారు. పింఛన్లకు ఏటా రూ.34 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. అన్ని ప్రభుత్వ పథకాలపై ప్రజలకు నేరుగా ఫోన్లు చేసి ఫీడ్బ్యాక్ తీసుకుంటున్నామని చెప్పారు. కర్నూలు జిల్లాలో 65 శాతం మంది పరిస్థితి బాగుందని చెప్పారని వెల్లడించారు. అధికారులు సమర్థత పెంచుకుంటే వారితో ఉంటానని స్పష్టం చేశారు.

# డ్రైనేజీ మూతలమ్మి ఆకలి తీర్చుకుంటున్న పౌరులు

(మొదటి పేజీ తరువాయి)

కనీసం 30కేజీల వరకు బరువు ఉంటాయి. వాటిని స్క్రాప్ మార్కెట్లో అమ్ముకొని అవసరాలు తీర్చుకుంటున్నారని స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ మూత లేకపోవడం వల్ల పంజాబ్ రాజధాని లాహోర్లో ఒక మ్యాన్హోల్లో పడి.. ఓ తల్లీకుమార్తె ప్రాణాలు కోల్పోయారు. మరో ఘటనలో ఒక చిన్నారిగా అందులో పడిపోయారు. అయితే ఆ చిన్నారిని సహాయసిబ్బంది కాపాడారు. వీటితో ప్రభుత్వంపై విమర్శలు వ్యక్తమవడంతో.. సీరియస్గా స్పందించింది. మరియం నవాజ్ మాట్లాడుతూ.. ''ఉదయం మేం మ్యాన్ హోల్స్ మూతలు వేస్తున్నాం. రాత్రికల్లా అవి మాయమవుతున్నాయి. వాటిని దొంగలించకండి. అలా దొంగలించిన వాటిని అమ్మడం కానీ.. కొనడం కానీ చేసేవారికి ఏడాది నుంచి 10 ఏళ్ల జైలు శిక్షపడుతుంది. వాటిల్లో పడి ఎవరైనా మరణిస్తే.. బాధ్యులకు పదేళ్ల జైలు శిక్ష, 50 లక్షల పాకిస్థానీ రూపాయల జరిమానా విధించేలా చట్టంలో మార్పులు తెచ్చాం' అని ఆమె వెల్లడించారు. ఇదిలా ఉంటే.. వరల్డ్ బ్యాంక్ రిపోర్ట్ ప్రకారం.. 45 శాతం మంది పాక్ పౌరులు పేదరికంలో జీవిస్తున్నారు. 16.5 శాతం మంది దుర్భర పేదరికంలో మగ్గుతున్నారని ఆ నివేదిక వెల్లడించింది.

# భారతీయులు నగరాన్ని ఆక్రమించారు

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడేందుకు రావాలని సోషల్ మీడియా కన్జర్వేటివ్ ఇన్ఫ్లూయెన్సర్లు కైలీ కాంబెల్, మార్క్ పలాసియానోలు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కొందరు వ్యక్తులు యూఎస్కు మద్దతుగా ఉండే టోపీలు, మాస్కులతో పాల్గొన్నారు. వారు హెచ్-1బీ వీసాకు, ఇక్కడి భారతీయులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మార్క్ పలాసియానో మాట్లాడుతూ.. ఇక్కడ భారతీయుల జనాభా పెరగడం యాదృచ్ఛికం కాదన్నారు. ఇక్కడ వీసాల జారీలో మోసాలు జరుగుతున్నాయని ఆరోపించారు. త్వరలో ఈ ప్రాంతం మొత్తం భారతీయులతో నిండిపోతుం దని.. ఇప్పటికైనా అమెరికన్లు మేలుకోవాలని పిలుపునిచ్చారు. అర్హులైన అమెరికన్ల ఉద్యోగాలను లాక్కొనే వీసా విధానానికి తాను, తన మద్దతుదారులు ఎప్పటికీ వ్యతిరేకమేనని ఆయన ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.

**ఇరాన్తో చర్చలు విఫలమైతే.. బలప్రయోగానికి కూడా వెనుకాడం: అమెరికా**

ఈ వివక్షపూరిత వ్యాఖ్యలను సమావేశంలో పాల్గొన్న అనేకమంది ఇండో- అమెరికన్లు (ఖఛీఙ్మీఛ్చి-అర్ఖ్మటఙీఛ్చిుట) తీవ్రంగా ఖండించారు. హెచ్-1బీ వీసాల జారీలో జరుగుతున్న మోసాలను తాము వ్యతిరేకిస్తామని.. అయితే, ఇందుకు ఇక్కడి భారతీయులపై ఆరోపణలు చేయడాన్ని తప్పుబట్టారు. తాము ఇక్కడ జీవించడం వల్ల ఈ ప్రాంతానికి కూడా ప్రయోజనకరమని స్పష్టంచేశారు. నగరంలో నివసించే భారతీయులకు ఫ్రిస్కో మేయర్ జెఫ్ చెనీ మద్దతుగా నిలిచారు.

# ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

**9 మంది మావోయిస్టులు మృతి**

**మృతులలో ఇద్దరు మహిళలు**

**తెలంగాణకు చెందిన ప్రముఖ మావో మృతి**

**ఇద్దరు జవాన్లకు గాయాలు...ఒకరి మృతి**

హైదరాబాద్,ఫిబ్రవరి 6(మనం,ప్రత్యేక ప్రతినిధి): ఛత్తీస్‌గఢ్-మహారాష్ట్ర సరిహద్దులోని అత్యంత దట్టమైన అబూజ్‌మడ్ అటవీ ప్రాంతంలో భద్రతా దళాలకు,మావోలకు మధ్య జరిగిన కాల్పులో 9మంది మావోయిస్టులు మృతి చెందినట్లు బలగాలు పేర్కొంటున్నాయి. అబూజ్‌మడ్ అటవీ ప్రాంతంలో సెర్చ్ ఆపరేషన్ నిర్వహించిన క్రమంలో భద్రతా దళాలకు.. మావోయిస్టులు ఎదురుపడ్డారు.
దీంతో ఇరువురి మధ్య భీకర ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఆపరేషన్‌లో తొమ్మిది మంది మావోయిస్టులు మరణించినట్లు ప్రాథమిక సమాచారం అందుతోంది.
గత రెండు రోజులుగా నారాయణ్‌పూర్, బీజాపూర్ జిల్లాల సరిహద్దుల్లోని అటవీ ప్రాంతాల్లో భద్రతా బలగాలు గాలింపు చర్యలు చేపడుతున్నాయి. ఈ క్రమంలో మావోయిస్టులు తారసపడటంతో ఇరువర్గాల మధ్య కాల్పులు ప్రారంభమయ్యాయి.
కాగా ఈ ఎన్‌కౌంటర్‌లో తెలంగాణకు చెందిన ప్రముఖ మావోయిస్టు నేత సైతం ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం.

**ఐదు మృతదేహాలు:**

అబూజ్‌మడ్ అటవీ ప్రాంతంలో ఘటనా స్థలం నుంచి ఐదుగురు మావోయిస్టుల మృతదేహాలను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. అలాగే మిగిలిన వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఎన్‌కౌంటర్ స్థలంలో భారీగా ఆయుధాలు, పేలుడు పదార్థాలు, విప్లవ సాహిత్యాలను పోలీసులు గుర్తించారు.

ముఖ్యంగా 47 రైఫిల్, ఎస్ఎల్ఆర్ వంటి అత్యాధునిక ఆయుధాలు లభించడంతో మృతులలో కీలక మావోయిస్టు ఉండే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.కాగా ఎదురు కాల్పులలో ఒక కమాండో ప్రాణాలు కోల్పోగా మరో పోలీస్ అధికారి తీవ్రంగా గాయపడినట్లు పోలీసు అధికారులు చెబుతున్నారు. ఘటనా ప్రాంతంలో మావోయిస్టుల కోసం గాలింపు చర్యలు ఇంకా కొనసాగుతున్నాయి.

# దేశ పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకే

(మొదటి పేజీ తరువాయి)

ఆయన మాట్లాడుతూ, 'పార్టీ సొంతిల్లు, ప్రభుత్వం కిరాయి ఇల్లు అనే విషయాన్ని జీవితాంతం గుర్తుంచుకోవాలి. నాయకులు ఎంత ఎదిగినా, ఎన్ని ఇబ్బందులు వచ్చినా చివరకు మన దేవాలయం లాంటి టీడీపీ ఆఫీసుకే వస్తారు. పార్టీని బలోపేతం చేసేందుకు మనం అహర్నిశలు కష్టపడాలి' అని చంద్రబాబు చెప్పిన మాటలను గుర్తుచేశారు.'గ్రామస్థాయి నుంచి కాదు, బూత్ స్థాయి నుంచి పార్టీని పునర్నిర్మాణం చేయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం చేపట్టాం. బూత్ స్థాయిలో బలంగా ఉంటేనే టీడీపీ బలంగా ఉంటుంది' అని లోకేశ్ స్పష్టం చేశారు. 2019 ఎన్నికల తర్వాత కొన్ని బూత్లలో వేవ్ ఉన్నా ఎందుకు గెలవలేకపోయామనే కారణాలను అన్వేషించాలన్నారు. తన అనుభవాన్ని వివరిస్తూ, '1985 తర్వాత మంగళగిరిలో టీడీపీ జెండా ఎగరలేదు. 2019లో 5,300 ఓట్ల తేడాతో ఓడిపోయినప్పుడు కలిగిన బాధ, ఆవేదన నాలో కసి పెంచింది. ఓడిన చోటే గెలవాలని కార్యకర్తలతో కలిసి బూత్ల వారీగా సమీక్షించి, నాలుగేళ్లు తూచా తప్పకుండా పనిచేసి విజయం సాధించాం' అని తెలిపారు. సంస్థాగత నిర్మాణంపై నమ్మకంతోనే గెలిచానని, ఇప్పుడు అదే స్ఫూర్తితో రాష్ట్రవ్యాప్తంగా పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

**కూటమిలో విడాకులు ఉండవు...**

'రాష్ట్ర అభివృద్ధికి ప్రభుత్వ కొనసాగింపు చాలా అవసరం. కనీసం 15 ఏళ్లు కలిసికట్టుగా ముందుకు వెళితేనే అభివృద్ధి సాధ్యమని పవనన్న చెప్పారు. మన కూటమిలో విడాకులు, మిస్ ఫైర్లు, క్రాస్ ఫైర్లు ఉండవు. ఏవైనా సమస్యలుంటే మూడు పార్టీలు కూర్చొని చర్చించుకుంటాయి. వైసీపీ మన మధ్య విభేదాలు సృష్టించేందుకు ప్రయత్నిస్తుంది, అందరూ అప్రమత్తంగా ఉండాలి' అని లోకేశ్ హితవు పలికారు.

**కూటమి ప్రభుత్వ ఘనతలను వివరించాలి...**

'దేశానికి వస్తున్న పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకే వస్తున్నాయి. విశాఖ ఉక్కును లాభాల్లోకి తీసుకువచ్చిన ఘనత డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్ది. విశాఖ రైల్వే జోన్ సాధించుకున్నాం.

అమరావతి, పోలవరం పనులు వేగవంతం చేశాం. కర్నూలులో త్వరలోనే హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తాం,' అని లోకేశ్ తెలిపారు. రూ.4 వేల పింఛను, తల్లికి వందనం, అన్న క్యాంటీన్ల పునఃప్రారంభం, 16 వేల టీచర్ పోస్టుల భర్తీ వంటి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు.

# ట్రంప్ నోబెల్‌కు అనర్హుడు

(మొదటి పేజీ తరువాయి)

పార్లమెంటుకు ప్రతిపాదనలు వచ్చాయి. దీన్ని పోలండ్ స్పీకర్ తిరస్కరించారు. ''బలవంతపు రాజకీయాలు, విధానాలతో ట్రంప్ అంతర్జాతీయ సంస్థలను అస్థిరపరుస్తున్నారు. ఆయన నోబెల్కు అనర్హులు. ఈ ప్రతిపాదనను మేం తిరస్కరిస్తున్నాం' అని పోలండ్ స్పీకర్ తెలిపారు. ఈ చర్యను అమెరికా తీవ్రంగా పరిగణించింది.
దీనిపై పోలండ్లోని అమెరికా దౌత్యవేత్త టామ్ రోజ్ స్పందిస్తూ.. ''ఇది మా అధ్యక్షుడిని అవమానించడమే. దీనివల్ల ఇరుదేశాల మధ్య సంబంధాలు దెబ్బతినే ప్రమాదం ఉంది. పోలండ్ స్పీకర్‌ను మా దేశంలోకి రానివ్వకుండా బ్లాక్లిస్ట్ చేస్తాం' అని పేర్కొన్నారు. దీనిపై పోలండ్ ప్రధాని తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. 'మిత్ర దేశాలు పరస్పరం గౌరవించుకోవాలి. అంతేగానీ ఇలా మాకు పాఠాలు చెప్పే ప్రయత్నం చేయొద్దు. దౌత్య సంబంధాలు ఎలా నిర్వహించాలో మాకు తెలుసు' అని తిరిగి హితవు పలికారు. పెద్ద దేశాలు ట్రంపునకు భయపడుతున్న నేపథ్యంలో చిన్న దేశాలు ఆయనను బేఖాతరు చేయడం, ఆయన ఆదేశాలను లెక్క చేయకపోవడం ఈ సందర్భంగా గమనార్హం.

# ఐరాస ఏఐ కమిటీలో ఐఐటీ ప్రొఫెసర్

- **ఢిల్లీలో 19న ఏఐ ఇంటర్నేషనల్ సమ్మిట్**
- **హాజరుకానున్న గుటెర్రెస్**

న్యూయార్క్, ఫిబ్రవరి 6: ఢిల్లీ, ఫి అంతర్జాతీయ స్థాయిలో 40 మంది నిపుణులతో కృత్రిమ మేధపై ఐక్యరాజ్యసమితి కొత్తగా ఏర్పాటు చేయనున్న స్వతంత్ర శాస్త్రీయ కమిటీకి ఐఐటీ-మద్రాస్ ప్రొఫెసర్ ఎంపికయ్యారు. ఈ జాబితాలోని నిపుణులను ఐరాస సెక్రెటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్ స్వయంగా సిఫార్సు చేశారు. మూడేండ్ల పాటు ఈ కమిటీ కొనసాగుతుంది. ఐఐటీ మద్రాస్లో డేటా సైన్స్, కృత్రిమ మేధ విభాగం, 'సెంటర్ ఫర్ రెస్పాన్సిబుల్ ఏఐ' అధిపతిగా ఉన్న బలరామన్ రవీంద్రన్, అమెరికాలో ప్రొఫెసర్ గా పని చేస్తోన్న విపిన్ కుమార్ ఈ జాబితాలో ఉన్నారు. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ ఆమోదం తర్వాత నిపుణుల కమిటీ ఆచరణలోకి వస్తుంది. శాస్త్ర విజ్ఞానాన్ని మరింత ముందుకుతీసుకుపోవడానికి ఏఐని ఎలా ఉపయోగించాలో స్వతంత్ర కమిటీ సూచనలు చేస్తుంది.

**ఏఐ సమ్మిట్‌కు గుటెర్రెస్:** కృత్రిమ మేధ (ఏఐ)పై ఈ నెల 19-20 తేదీలలో ఢిల్లీలో అంతర్జాతీయ శిఖరాగ్ర సభను నిర్వహిస్తున్న భారతదేశాన్ని అభినందిస్తున్నట్లు ఐరాస సెక్రెటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్ తెలిపారు. తానూ ఆ సభలో పాల్గొంటున్నట్లు వెల్లడించారు.

# గులాబీ కోటలో గుబులు

## కేసీఆర్ విచారణతో 'కారు'లో కలవరం

పార్టీ శ్రేణుల్లో ట్యాపింగ్ టెంపరేచర్

ఎలక్టోరల్ బాండ్లపై సిట్ రహస్య దర్యాప్తు

పార్టీకి కప్పం కట్టిన వారిలోనూ కలవరం

సిట్ చర్యలపై పార్టీలో చర్చోపచర్చలు



హైదరాబాద్,ఫిబ్రవరి 6(మనం,ప్రత్యేక ప్రతినిధి): ఫోన్‌ట్యాపింగ్ కేసులో నిందితుల వాంగ్మూలాలన్నీ గులాబీ కోటవైపే చూపిస్తున్నాయి. ట్యాపింగ్ వ్యవహారంలో ఇంతకాలం గులాబీ నేతల పేర్లు వినిపించాయి. తాజాగా ఈ కేసులో పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ ఎంపీ సంతోష్‌రావు, పార్టీ ట్రబుల్ షూటర్ హరీష్‌రావులను సిట్ విచారించిన విషయం విదితమే. గులాబీ వనంలో ఒక్కసారిగా ట్యాపింగ్ మంటలు చెలరేగడంతో ఆ పార్టీలోని నేతలలో కలవరం మొదలైంది. ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ తదుపరి చేపట్టే చర్యలపై చర్చసాగుతోంది. ఈ కేసులో సిట్ దూకుడుగా వ్యవహరిస్తోండటంతో బీఆర్ఎస్ ప్రధాన నేతల భవితవ్యంపై పార్టీ శ్రేణులలో చర్చనీయాంశమైంది. ఈ కేసులోని కీలక నిందితులు మాజీ ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్‌రావు, మాజీ డీసీపీ రాధాకిషన్, భుజంగరావు, తిరుపతన్న, ప్రణీత్‌రావులు అప్పటి ప్రభుత్వంలోని పెద్దాయన ఆదేశాల మేరకే ట్యాపింగ్ చేశామని వాంగ్మూలాలు ఇచ్చారు. దీంతో గులాబీ కోటలో గులాంగిరి చేసిన పోలీసుల తీరుపై అటు పోలీసుశాఖ ఇటు ప్రతిపక్షాలకు చెందిన రాజకీయ నేతలు మండిపడుతున్న విషయం విదితమే. ముఖ్యంగా గులాబీ బాస్ ఆదేశాలతో ప్రతిపక్షాలను వెంటాడిన తీరుపై అటు న్యాయ నిపుణులు, ఇటు పోలీసు ఉన్నతాధికారులు ముక్కున వేలేసుకుంటున్నారు. ఫోన్ ట్యాపింగ్‌తో ప్రతిపక్షాల రహస్యాలను విన్న నాటి అధికార పార్టీకి చెందిన కీలక నేతలపై చర్యలు వేగవంతం చేసేందుకు సిట్ తనదైన శైలిలో పావులు కదుపుతోంది.

**ఏకధాటిగా ఎనిమిదేళ్లు :**

గులాబీ కోటలోని పెద్దలు ఎనిమిదేళ్ల పాటు (2014 నుంచి 2022) వరకు యథేచ్ఛగా ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడినట్లు సిట్ దర్యాప్తులో తేలింది. ఈక్రమంలో ఎనిమిదేళ్ల వ్యవధిలో దాదాపు 6వేల ఫోన్ నంబర్ల సంభాషణలను చాటుగా విని రికార్డు చేసినట్లు సిట్ గుర్తించింది. పోలీసు చట్టాలలోని లొసుగులను అవకాశంగా మార్చుకుని ముఖ్యంగా మావోయిస్టుల ముసుగులో నాటి ప్రతి పక్ష నేతలు, ప్రముఖుల ఫోన్ నంబర్లను ట్యాపింగ్‌కు పాల్పడినట్లు సిట్ విచారణలో వెలుగుచూసింది. కొందరు ఖాకీలు కోవర్టులుగా మార్చుకుని రాజకీయ ప్రత్యర్థులతో పాటు వ్యాపార, జర్నలిస్టుల, న్యాయ నిపుణుల ఫోన్‌లను ట్యాపింగ్ చేసినట్లు సిట్ విచారణ చేపట్టడంతో పాటు కీలక ఆధారాలు సేకరించింది. ఇందుకోసం కొందరు ఖాకీలను కోవర్టులుగా మార్చుకుని ట్యాపింగ్ కుట్రలకు తెగబడిన వైనం కుట్రలపై ప్రజలు సైతం బహిరంగంగా చర్చించుకుంటున్నారు. ఇటీవల కాలంలో చిన్నపాటి హోటల్ వద్ద నలుగురు గుమిగూడితే చాలు ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ నేతలు ఎవరెవరెవరు జైలుకు వెళతారన్న చర్చసాగుతోంది. ఇందులో భాగంగా ఫలానా నేతలు జైలుకు వెళ్లడం ఖాయమని బెట్టింగ్లు సైతం కాస్తున్నారు. ప్రతిపక్షాలను దెబ్బ కొట్టేందుకు పోలీసులనే నేరుగా రంగంలోకి దింపిన ఘనత గులాబీ పార్టీకే దక్కుతుందని తెలంగాణ రాష్ట్రంతో పాటు దేశవ్యాప్తంగా ఇదే తొలిసారి కావచ్చని రాజకీయ మేధావులు తేల్చిచెబుతున్నారు. కాగా గులాబీ కోటకు కాపుకాసిన ఖాకీల దండు సైతం తమ స్వంత అవసరాలకు ఫోన్ ట్యాపింగ్‌తో బెదిరింపులకు పాల్పడి వందలాది కోట్ల రూపాయాలు వెనకేసినట్లు సిట్ అనుమానించడంతో పాటు ఆ దిశగా విచారణ చేపడుతోంది.

**కప్పం కట్టించారు :**

ఫోన్ ట్యాపింగ్‌ను ఆయుధంగా చేసుకుని వందల కోట్ల రూపాయల కప్పం వసూలు చేసినట్లు సిట్ అనుమానిస్తున్నారు. ఈ క్రమంలో గులాబీ కోటలో పాలేరు పనిచేసిన పోలీసులు రాష్ట్రంలో రియాల్టర్లను, వ్యాపారులను, హవాల దందా చేసేవారిని వేధింపులకు గురిచేసి ఎలక్ట్రోరల్ బాండ్లకు పెద్ద ఎత్తున నగదు వసూలు చేసిన వైనంపై సిట్ రహస్యంగా విచారణ చేపడుతోంది. అలాగే 2018 ఎన్నికలు, దుబ్బాక, మునుగోడు ఉప ఎన్నికలు, 2023 ఎన్నికల్లో పట్టుబడిన నగదులో కొంత మొత్తాలు టీఆర్ఎస్ పార్టీకి తరలించినట్లు ఈ కేసులోని నిందితులు వాంగ్మూలంలో పేర్కొన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో 8 సార్లు టాస్క్ ఫోర్స్ వాహనాల్లో డబ్బులు తరలించినట్లు సిట్ పోలీసుల ఎదుట అంగీకరించారు. అప్పట్లో ప్రతిపక్ష పార్టీకి అనుకూలంగా వ్యవహరించిన వారిపై బెదిరింపులకు పాల్పడి ఒక పార్టీకి డబ్బులను (ఎలక్ట్రోరల్ బాండ్ల రూపంలో ) సమకూర్చినట్లు సిట్ దర్యాప్తు చేపడుతోంది. ఈ క్రమంలో 2023 ఎన్నికల సమయంలోనూ నగదు పట్టివేత కోసం కొందరు టాస్క్‌ఫోర్స్‌లో పనిచేసిన సిబ్బందిని వినియోగించిన అంశంపై సిట్ ప్రత్యేక దృష్టి సారిస్తోంది. కాగా గతంలో జరిగిన ఉప ఎన్నికల సమయంలో 8 సార్లు పట్టుకున్న డబ్బు మొత్తం ప్రతిపక్షాలకు చెందినదేనని విచారణలో ఈ కేసులోని నిందితులు చెప్పారు. 2018లో శేరిలింగంపల్లి టీడీపీ అభ్యర్థి భవ్య సిమెంట్ ఆనంద్ ప్రసాద్ నగదు ప్యారడైజ్ వద్ద రూ.70 లక్షలు సీజ్ చేసినట్లు తెలిపారు. 2020 దుబ్బాక ఉప ఎన్నికల సమయంలో అప్పటి బీజేపీ నేత,ప్రస్తుత ఎంపీ రఘునందన్ రావు, ఆయన బంధువులు నుంచి రూ. కోటి సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. ముడుగోడు ఉప ఎన్నికల్లో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహచరుల నుంచిరూ.3.50 కోట్లు స్వాధీనం చేసుకున్నామని రాధాకిషన్ రావు రిమాండ్ రిపోర్టులో సిట్ పోలీసులు పేర్కొన్నారు.

# తిరుమల ప్రసాదంలో కల్తీ జరిగిందని 4 నివేదికలు తేల్చాయి

(మొదటి పేజీ తరువాయి)

ముద్రించే సాక్షి కరపత్రం కాకుండా మరేదైనా నివేదిక వైకాపా వద్ద ఉందా అని ప్రశ్నించారు. టాయిలెట్ క్లీనింగ్‌కు వాడే 'లబ్సా' అనే రసాయనం వాడి మహా అపచారానికి ఒడిగట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాబాయ్ హత్యకు ముందు ఎలాంటి మైండ్ గేమ్ ఆడారో.. కల్తీ నెయ్యి వ్యవహారంలోనూ అలాంటి మైండ్ గేమ్ ఆడుతున్నారని ధ్వజమెత్తారు. హిందువుల మనోభావాలు దెబ్బతీస్తున్న ఇలాంటి వారిని రాజకీయాల్లో లేకుండా చేయాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని హోం మంత్రి అన్నారు.

# ఎట్టకేలకు పులి దొరికింది

(మొదటి పేజీ తరువాయి)

రాయవరం, రాజానగరం మండలాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. సుదీర్ఘ ఉత్కంఠకు తెరదించుతూ, మత్తు ఇంజెక్షన్ సహాయంతో పులిని సురక్షితంగా బంధించారు. వివరాల్లోకి వెళితే, గత ఆరు రోజులుగా తూర్పుగోదావరి జిల్లాలోని రఘునాథపురం, జి.యర్రంపాలెం, కూర్మాపురం వంటి గ్రామాల్లో ఈ పులి సంచరిస్తూ సుమారు తొమ్మిది పశువులను, దూడలను చంపేసింది. దీంతో స్థానికులు కంటి మీద కునుకు లేకుండా గడిపారు. శుక్రవారం ఉదయం మండపేట నియోజకవర్గంలోని కూర్మాపురంలో ఒక పాడుబడిన ఇంట్లో పులి గాండ్రింపులు వినిపించడంతో గ్రామస్థులు అటవీ శాఖకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు, రెవెన్యూ, అటవీ శాఖ సిబ్బంది అక్కడికి చేరుకుని ఆపరేషన్ ప్రారంభించారు. పుణే, ఢిల్లీల నుంచి వచ్చిన నిపుణుల బృందాలు రంగంలోకి దిగి, పులిని మత్తు ఇంజెక్షన్తో బంధించేందుకు ప్రయత్నించాయి. అయితే, మధ్యాహ్నం 1:30 గంటల సమయంలో ఆపరేషన్కు ఊహించని ట్విస్ట్ ఎదురైంది. అధికారుల కళ్లుగప్పి పులి ఒక్కసారిగా గోడ దూకి, సమీపంలోని పంట పొలాల్లోకి పారిపోయింది. వేలాది మంది



చూస్తుండగానే క్షణాల్లో అదృశ్యం కావడంతో తీవ్ర కలకలం రేగింది. అయినప్పటికీ, పట్టువదలని అటవీ శాఖ బృందాలు థర్మల్ డ్రోన్లు, ట్రాప్ కెమెరాల సహాయంతో దాని కదలికలను నిరంతరం గమనించాయి. చివరకు సాయంత్రం కొత్త చెరువు సమీపంలో పులిని గుర్తించి, చాకచక్యంగా మత్తు ఇంజెక్షన్ ప్రయోగించి బంధించారు. మహారాష్ట్ర నుంచి తెలంగాణ మీదుగా గోదావరి నది దాటి ఇక్కడికి వచ్చిన ఈ మగ పులిని ఇప్పుడు దాని సహజ ఆవాసానికి తరలించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

# రౌడీషీటర్పై పోలీసుల కాల్పులు

(మొదటి పేజీ తరువాయి)

తప్పించుకుని పారిపోతుండటంతో, ఆత్మరక్షణ కోసం సీఐ ఆంజనేయులు అతనిపై కాల్పులు జరిపినట్లు సమాచారం.

నిందితుడు నాగేంద్రపై ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో కలిపి సుమారు 90 కేసులు ఉన్నాయి. గతంలో హిందూపురంలో అత్తాకోడళ్లపై జరిగిన గ్యాంగ్రేప్ కేసులో కూడా ఇతను ప్రధాన నిందితుడిగా ఉన్నాడు. చాలాకాలంగా తప్పించుకు తిరుగుతున్న నాగేంద్ర కోసం పోలీసులు గాలిస్తున్నారు.

ఈ క్రమంలోనే తాజా ఘటన చోటుచేసుకుంది. బుల్లెట్ గాయంతో పట్టుబడిన నాగేంద్రను పోలీసులు అదుపులోకి తీసుకుని ఆసుపత్రికి తరలించారు.

# లడ్డూ నెయ్యి కల్తీపై నిజాలు బయటపడుతున్నాయి

- మొదట కల్తీ లేదన్న వైసీపీ, ఇప్పుడు సిట్ రిపోర్ట్ తర్వాత మాట మార్పు
- శాప్ ఛైర్మన్ రవి నాయుడు

**తిరుపతి, ఫిబ్రవరి 6(మనంన్యూస్) :** మొదట అసలు కల్తీనే జరగలేదు అని ప్రకటించిన వైసీపీ నాయకులు, పోలీసులపై నమ్మకం లేదంటూ సుప్రీం కోర్టు వరకు వెళ్లి, అక్కడ సీబీఐ ఆధ్వర్యంలో సిట్ ఏర్పాటు చేయించేలా పరిస్థితి తీసుకువెళ్లారని శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు అన్నారు. ఆయన శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో మాట్లాడుతూ గౌరవ న్యాయస్థానం ఆదేశాల మేరకు కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో సిట్ ఏర్పడిన తరువాత సమర్పించిన సప్లిమెంటరీ రిపోర్టును కోర్టులో ఫైల్ చేసిన ఐదు నిమిషాల్లోనే కల్తీ లేదు, అనిమల్ ఫ్యాట్ లేదు అంటూ వైసీపీ నేతలు ప్రకటించడం అనేక అనుమానాలకు తావిస్తోందన్నారు. ఎన్డీడీబీ రిపోర్టుల ఆధారంగానే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మాట్లాడారని, ఈ కల్తీ, వినియోగంపై కూడా వివరించారని తెలిపారు. అనంతరం ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ , బీజేపీ నేతలు మాట్లాడాలని.. చంద్రబాబు నాయుడు మాట్లాడిన మాటలపై వైసీపీ నేతలు రివర్స్ అటాక్ చేస్తున్నారని అన్నారు. ఎన్డీబీ రిపోర్ట్ను చదివి వినిపిస్తే చంద్రబాబు నాయుడుని దైవద్రోహిగా చిత్రీకరించే ప్రయత్నం చేశారని భక్తుల మనోభావాలు దెబ్బతీశారంటూ వైసిపి నేతలు ఆరోపణలు చేయడం అన్యాయమని పేర్కొన్నారు. గతంలో పరకామణి దొంగతనం సెటిల్మెంట్ విషయంలో అదే వైసీపీ నేతలు దొరకతనం చేసిన వ్యక్తిని పరమభక్తుడిగా కీర్తించిన విషయాన్ని రవి నాయుడు గుర్తు చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న విజయ్ భాస్కర్ రెడ్డి గారు కోర్టులో అప్రూవర్గా మారి, తనకు రూ.75 లక్షల లంచం వచ్చిందని, 8 గ్రాముల బంగారు నాణెం తీసుకున్నానని, అందులో రూ.30 లక్షలు తిరిగి విచ్చేస్తున్నానని ఒప్పుకున్నప్పటికీ నిజాలను దాచిపెట్టే ప్రయత్నం జరుగుతోందన్నారు. చంద్రబాబు నాయుడు తాను ఒక్కడే భక్తుడినని ఎక్కడా చెప్పలేదని, తాను సామాన్య భక్తుడిగా తిరుపతిలో పుట్టి పెరిగానని మాత్రమే చెప్పారని, అయినప్పటికీ ఆయన మాటలను వక్రీకరిస్తున్నారని విమర్శించారు.

బాంబ్ బ్లాస్ట్ ఘటనలో ప్రాణాలతో బయటపడినది స్వామివారి కృప వల్లేనని చంద్రబాబు నాయుడు స్వయంగా చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. టీటీడీ నిబంధనల ప్రకారం ఇతర మతస్తులు దర్శనానికి వచ్చినప్పుడు ఆచారాలను పాటించాలి సంతకం చేయాల్సి ఉంటుందని, జగన్మోహన్ రెడ్డి ఆ నిబంధనలు ఉల్లంఘించినప్పుడు పక్కనే ఉన్న కరుణాకర్ రెడ్డి ఎందుకు ప్రశ్నించలేదని ప్రశ్నించారు. మొదట కల్తీ జరగలేదని చెప్పిన సుబ్బారెడ్డి గారు, తాజాగా సిట్ రిపోర్ట్ ఆధారంగా కల్తీ జరిగిందని ఒప్పుకున్నారని తెలిపారు.




రిపోర్టులో పామ్ ఆయిల్, ఫిష్ ఆయిల్, వెజిటబుల్ ఆయిల్ కలిసినట్టు స్పష్టంగా ఉందని, అనిమల్ ఫ్యాట్ లేదంటున్నా ఎన్డీబీ రిపోర్ట్ ప్రకారం అనిమల్ ఫ్యాట్ కూడా ఉన్నట్టు వెల్లడైందన్నారు. అధికారులపై నెపం నెట్టడం సరికాదని, అప్పటి టీటీడీ చైర్మన్గా సుబ్బారెడ్డి, బోర్డు సభ్యులు, ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డి గారు బాధ్యత వహించాల్సిందేనని అన్నారు.. నిబంధనలను ఎందుకు సడలించారని ప్రశ్నించారు-4 లక్షల లీటర్ల పాల సామర్థ్యం ఉన్న డైరీ అర్హతను ఎందుకు తొలగించారు? టర్నోవర్ను రూ.250 కోట్ల నుంచి రూ.150 కోట్లకు ఎందుకు తగ్గించారు? అనుభవాన్ని మూడు సంవత్సరాల నుంచి ఒక సంవత్సరానికి ఎందుకు మార్చారు? దీనికి ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. 20 కోట్లకు పైగా లడ్డూలు భక్తులకు చేరిన ఈ ఘటన కేవలం అవినీతి కాకుండా, భక్తుల విశ్వాసాలపై దాడి, మహా పాపమని పేర్కొన్నారు.

ఇప్పటివరకు ఒక్క క్షమాపణ కూడా చెప్పకపోవడం బాధాకరమన్నారు. ఈ అంశాన్ని డైవర్ట్ చేయడానికి వ్యక్తిగత దూషణలు, ప్రెస్మీట్లు నిర్వహిస్తున్నారని, కానీ ఈ మహా పాపం నుండి ఎవ్వరూ తప్పించుకోలేరన్నారు అలాగే దేశవ్యాప్తంగా పీఠాధిపతులు, మఠాధిపతులు, భక్తులు స్పందించాలని పిలుపునిచ్చారు. ఇది ఒక్క తిరుమల సమస్య కాకుండా, ఇతర ప్రసిద్ధ ఆలయాల పవిత్రతకు సంబంధించిన పెద్ద అంశమన్నారు. స్వామివారి పవిత్రతను కాపాడటానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఎవరైనా తప్పు చేసినా చట్టప్రకారం చర్యలు తప్పవని, ఈ వ్యవహారాన్ని చివరి వరకు తీసుకెళ్లి నిజాలను బయటపెడతామని రవి నాయుడు స్పష్టం చేశారు. తప్పు చేసిన ఏ ఒక్కరిని వదిలిపెట్టమని తెలిపారు.



- ఎర్రచందనం ముద్దాయిలు ఇద్దరిపై పీడీ యాక్ట్
- ఎర్రచందనం అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్న టాస్క్ ఫోర్స్

**తిరుపతి, ఫిబ్రవరి 6 మనం న్యూస్ :** ఎర్రచందనం అక్రమ రవాణాకు చెందిన పలు కేసుల్లో ముద్దాయిలుగా ఉన్న కర్నాటక కు చెందిన నారాయణ స్వామి (48) తమిళనాడుకు చెందిన సయ్యద్ అబ్దుల్ లతీఫ్, ఎలియాస్ సేటు ఎలియాస్ సేటు బాయ్ (49)లపై టాస్క్ ఫోర్స్ అధికారులు పీడీ యాక్ట్ అమలు చేశారు. టాస్క్ ఫోర్స్ హెడ్ ఎల్. సుబ్బారాయుడు ప్రత్యేక కార్యాచరణ అములులో భాగంగా టాస్క్ ఫోర్స్ ఎస్పీ పీ శ్రీనివాస్ అధ్వర్యంలో ఏఎస్పీ జె. కులశేఖర్ మార్గ నిర్దేశకత్వంలో ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధించడమే కాకుండా, ఎక్కువ కేసుల్లో ఎర్రచందనం అక్రమ రవాణా వృత్తిగా చేసుకుని, ముఠాగా ఏర్పడి స్మగ్లింగ్ కు పాల్పడుతున్న వారిపై పీడీ యాక్ట్ లు అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఇద్దరు ముద్దాయిలు నారాయణ స్వామి, సయ్యద్ అబ్దుల్ లతీఫ్ ఎలియాస్ సేటు ఎలియాస్ సేటు బాయ్ లపై పీడీ యాక్ట్ అమలుకు టాస్క్ ఫోర్స్ హెడ్ ఎల్. సుబ్బారాయుడు సిఫారసు చేశారు. ఈ మేరకు తిరుపతి జిల్లా కలెక్టరు, జిల్లా మెజిస్ట్రేట్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్, వీరిపై పీడీ యాక్ట్ అమలుకు ఉత్తర్వులు జారీ చేశారు. వీరిద్దరూ ఎర్రచందనం కొల్లగొట్టడుతూ, వన్య మృగాల చట్టాలను ఉల్లంఘించి నేరాలు చేస్తూ ప్రజాజీవనానికి అటంకం కలిగిస్తున్నట్లు గుర్తించారు. పీడీ యాక్ట్ అమలులో భాగంగా నిందితులను కడప సెంట్రల్ జైలుకు తరలించారు. ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధకంలో భాగంగా పీడీ యాక్ట్ అమలు చేయడానికి వెనుకాడబోమని టాస్క్ ఫోర్సు ఎస్పీ పీ.శ్రీనివాస్ హెచ్చరించారు. ఎర్రచందనం కేసుల్లో ఇప్పటికే అనేక మందికి శిక్షలు పడ్డాయని గుర్తు చేశారు. యువత ఎర్రచందనం అక్రమ రవాణాకు ప్రయత్నించి వారి భవిష్యత్తును పాడు చేసుకోవద్దని చెప్పారు. స్మగ్లర్లకు శిక్ష పడటంతో పాటు వారి ఆస్తులు కూడా జప్తు చేసుకో పడతాయని తెలియజేసారు.

# ఇద్దరు ఎర్రచందనం స్మగ్లర్లకు ఐదేళ్ల జైలు శిక్ష

- రూ. 6లక్షల జరిమానా


తీర్పు వెల్లడించిన ఆర్ఎస్ఎస్ ఏడీజే కోర్టు న్యాయమూర్తి

**తిరుపతి, ఫిబ్రవరి 6 మనం న్యూస్ :** ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన ఇద్దరు స్మగ్లర్లకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ. 6లక్షలు జరిమానా విధిస్తూ ఆర్ఎస్ఎస్ ఏడీజే కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి శుక్రవారం తీర్పు నిచ్చారు. ఆంధ్రప్రదేశ్ శేషాచలం రిజర్వు అటవీ ప్రాంతంలో జరుగుతున్న ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టే లక్ష్యంతో ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక దళం కఠిన చర్యలు అమలు చేస్తోంది. ఆర్ఎస్ఎఎస్టీఎఫ్ హెడ్ ఎల్ సుబ్బారాయుడు రూపొందించిన ప్రత్యేక కార్యాచరణ మేరకు టాస్క్ ఫోర్సు ఎస్పీ పీ. శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎఎస్పీ జె. కులశేఖర్ పర్యవేక్షణలో గతంలో నమోదయ్యి, కోర్టులో విచారణ దశలో ఉన్న కేసులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అలుగూరి అమర నారాయణ ద్వారా తగిన సాక్ష్యాధారాలను నిరూపించి ముద్దాయిలకు శిక్షలు పడే విధంగా ప్రణాళికలు రూపొందించారు. ఇందులో భాగంగా క్రైమ్ నెంబరు 05/2016 కేసులో ఇద్దరు ముద్దాయిలు తిరుపతి జిల్లా కరకంబాడీ రిజర్వు ఫారెస్ట్ బీటు పరిధిలో అరెస్టయ్యారు. వీరు తమిళనాడు రాష్ట్రం, తిరువన్నామలై జిల్లా కు చెందిన శివమూర్తి సేతు, తిరుపతి శివమణి కాగా వీరి నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ఈ స్మగ్లర్లకు ఐదేళ్ల జైలు శిక్ష తో పాటు రూ. 6లక్షల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. తదుపరి కోర్టు ఆదేశాలు మేరకు వీరిని నెల్లూరు సెంట్రల్ జైలులో అప్పగించారు. ఆంధ్రప్రదేశ్ లోని శేషాచలం రిజర్వు ఫారెస్టులోని అతి విలువైన సహజ సంపద ఎర్రచందనం చెట్లను నరికి అక్రమ రవాణా చేయడం, అడవిలోకి అక్రమంగా ప్రవేశించే నేరస్తులకు ఇది ఒక హెచ్చరికగా పరిగణించబడుతుందని టాస్క్ ఫోర్సు ఎస్పీ పీ. శ్రీనివాస్ తెలిపారు. ముద్దాయిలకు శిక్షలు పడేలా సహకరిస్తున్న దర్యాప్తు అధికారులను, కోర్టు సిబ్బందిని ఆయన అభినందించారు.



# భక్తుల సేవే మహద్భాగ్యం

**టీటీడీ నూతన ఈవోగా బాధ్యతలు చేపట్టిన ముద్దాడ రవిచంద్ర**



**తిరుమల, ఫిబ్రవరి 6, మనం న్యూస్ :** శ్రీవారి భక్తులకు సేవ చేసుకునే మహద్భాగ్యం కలగడం చాలా ఆనందంగా ఉందని టీటీడీ నూతన ఈవో ముద్దాడ రవిచంద్ర తెలియజేశారు. తిరుమల శ్రీవారి ఆలయంలో ఆయన శుక్రవారం ఉదయం టీటీడీ ఈవోగా బాధ్యతలు తీసుకున్నారు .తరువాత టీటీడీ బోర్డు ఎక్స్ అఫిషియో సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. అంతకు ముందుగా ఆయన క్షేత్ర సాంప్రదాయం పాటిస్తూ శ్రీ వరాహ స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన వైకుంఠం క్యూ కాంప్లెక్స్ ద్వారా ఆలయం వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా నూతన ఈవోకు అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.

బాధ్యతలు స్వీకరణ అనంతరం ఆయనకు పండితులు వేదాశీర్వచనం అందించగా, అధికారులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ టీటీడీ బోర్డు, భక్తుల సలహాలు, సూచనలు తీసుకుని సమన్వయంతో భక్తులకు చక్కని సేవలు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

అటు తరువాత ఆయన తిరుమలలోని అన్నమయ్య భవన్ లో,తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనంలో వివిధ విభాగాల అధికారులతో సమీక్షలు నిర్వహించారు.

# పాకిస్థాన్లో భారీ పేలుడు..

30 మందికి పైగా మృతి



**ఇస్లామాబాద్, ఫిబ్రవరి 6::** పాకిస్థాన్లో భారీ ఆత్మాహుతి దాడి చోటుచేసుకుంది. రాజధాని ఇస్లామాబాద్లోని షియాలకు చెందిన ఓ ప్రార్థనా మందిరం దగ్గర జరిగిన ఈ ఘటనలో 30 మందికి పైగా మృతి చెందారు. మరో 160 మందికి పైగా గాయపడినట్లు సమాచారం. ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టిన రెస్క్యూ బృందాలు.. క్షతగాత్రులను స్థానిక ఆసుపత్రులకు తరలించారు. ఇస్లామాబాద్లోని షెహజాద్ ప్రాంతంలో ఉన్న ఓ ప్రార్థనా మందిరం గేటు దగ్గరకు చేరుకున్న ఓ సూసైడ్ బాంబర్.. ఈ దుశ్చర్యకు పాల్పడ్డాడు. శుక్రవారం ప్రార్థనల సమయంలో ఈ ఘటన జరగడంతో తీవ్రత ఎక్కువగా ఉన్నట్లు తెలిసింది. ఈ ఘటనకు పాల్పడింది ఎవరనే విషయం తెలియనప్పటికీ.. తెహ్రీక్-ఏ-తాలిబన్ పాకిస్థాన్ (టీటీపీ)తో సంబంధమున్న ఓ విదేశీ పౌరుడు ఈ దాడికి పాల్పడినట్లు స్థానిక పోలీసు అనుమానిస్తున్నారు. ఉజ్బెకిస్థాన్ అధ్యక్షుడు షవకత్ మిర్జియేయెవ్ పాకిస్థాన్లో పర్యటిస్తున్న సమయంలోనే ఈ ఘటన చోటుచేసుకుంది.

# ఇష్టం లేకుండా గర్భం కొనసాగించాలని మహిళను ఒత్తిడి చేయలేం: సుప్రీంకోర్టు



**ఢిల్లీ, ఫిబ్రవరి 6:** అవాంఛిత గర్భధారణకు సంబంధించి సర్వోన్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. ఇష్టం లేకుండా గర్భం కొనసాగించాలని ఏ మహిళను ఒత్తిడి చేయలేమని స్పష్టం చేసింది. మైనర్గా ఉన్నప్పుడు గర్భవతి అయిన ఓ అమ్మాయి 30 వారాల గర్భాన్ని వైద్యపరంగా తొలగించేందుకు అనుమతినిస్తూ కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. ఆమె కేసులో గర్భవిచ్ఛిత్తికి నిరాకరిస్తూ బాంబే హైకోరు ఇటీవల ఇచ్చిన ఆదేశాలను సుప్రీం ధర్మాసనం తాజాగా పక్కనపెట్టింది.

మహారాష్ట్రకు చెందిన ఓ మైనర్ అమ్మాయి.. స్నేహితుడితో సంబంధం కారణంగా కొన్ని నెలల క్రితం గర్భం దాల్చింది. అప్పుడు ఆమె వయసు 17ఏళ్లు కాగా.. ప్రస్తుతం ఆమె వయసు 18 సంవత్సరాల నాలుగు నెలలు. ఇప్పుడు ఆమె 30 వారాల గర్భిణి. ఈ క్రమంలో గర్భవిచ్ఛిత్తి కోసం అమ్మాయి తొలుత బాంబే హైకోర్టును ఆశ్రయించగా.. తొలగింపు నిబంధనల (మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ చట్టం) ప్రకారం గడువు మించిపోవడంతో కోర్టు అందుకు నిరాకరించింది. అనంతరం ఈ అంశం సుప్రీం కోర్టుకు చేరింది. ఈ పిటిషన్పై జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్తో కూడిన సుప్రీం ధర్మాసనం విచారణ చేపట్టింది. గర్భిణీ నిర్ణయానికి తగిన ప్రాధాన్యం ఇవ్వాలని, ముఖ్యంగా గర్భధారణ కొనసాగింపుపై అయిష్టత వ్యక్తం చేసిన పరిస్థితుల్లో ఆమె స్వేచ్ఛకు వదలివేయాలని సూచించింది. అయితే, ఈ కేసులో పిండం కూడా ఒక ప్రాణమే అయినప్పటికీ.. మరో మార్గం లేదని పేర్కొంది.

ఎంటీపీ చట్టం ప్రకారం గడువు ముగిసినప్పటికీ గర్భవిచ్ఛిత్తి జరుగుతున్న సందర్భాలు అనేకం ఉన్నాయని సుప్రీం ధర్మాసనం గుర్తుచేసింది. ఇటువంటి సందర్భాల్లో బాధితులు ఎక్కడికి వెళ్తారనే ప్రశ్నను ధర్మాసనం లేవనెత్తింది. నకిలీ, అనధికార వైద్యుల వద్దకు వెళ్తారని.. అది మరింత ప్రమాదకరమని అభిప్రాయపడింది. ఈ కేసులో గర్భవిచ్ఛిత్తికి అనుమతించినా అమ్మాయికి ఎటువంటి ప్రమాదం ఉండదని వైద్యులు ఇచ్చిన నివేదికను పరిగణనలోకి తీసుకొన్న ధర్మాసనం తీర్పు వెలువరించింది.

# వెంటనే ఇరాన్ వీడండి



**వాషింగ్టన్, ఫిబ్రవరి 6:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటనలతో పశ్చిమాసియాలో ఉద్రిక్త వాతావరణం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో అమెరికా విదేశాంగశాఖ జారీ చేసిన అడ్వైజరీ ఆందోళన కలిగిస్తోంది. 'వెంటనే ఇరాన్ను వీడండి' అంటూ యూఎస్ తన పౌరులను అప్రమత్తం చేసింది. ''వెంటనే వీడటం వీలుకాకపోతే.. సురక్షిత ప్రాంతానికి తరలివెళ్లండి. ఆహారం, నీరు, అత్యవసర ఔషధాలు అందుబాటులో ఉండేలా చూసుకోండి. మీ చుట్టుపక్కల ఏం జరుగుతుందో ఎప్పటికప్పుడు గమనించుకోండి'' అంటూ అడ్వైజరీ జారీ అయింది. అయితే నెటిజన్లు కొందరు ఇది కొత్త అడ్వైజరీ కాదంటూ పోస్టులు పెడుతున్నారు. ఆర్థిక అనిశ్చిత పరిస్థితులు ఎదుర్కొంటున్న ఇరాన్.. స్వదేశంలో జరిగిన భారీ నిరసనల నుంచి ఇంకా పూర్తిగా బయటపడలేదు. అడ్వైజరీకి ముందు ఆ దేశ సుప్రీం నేత అయతుల్లా అలీ ఖమేనీకి ట్రంప్ మరోసారి గట్టి హెచ్చరిక జారీ చేశారు. ఓ వార్తాసంస్థతో ముఖాముఖిలో ఆయన మాట్లాడుతూ.. ''ఖమేనీ చాలా కలత చెందక తప్పదు'' అని పేర్కొన్నారు. దీంతో అమెరికా దాడులు చేస్తుందా..? అనే ఆందోళన వ్యక్తమవుతోంది. రెండు దేశాల మధ్య అణు చర్చలు ప్రారంభం కానున్న తరుణంలో ఈ ప్రకటనలు రావడం గమనార్హం. ఒమన్లో జరగనున్న చర్చల్లో కేవలం అణు అంశాల పైనే కాకుండా, ఇతర విషయాల పైనా సమాలోచనలు జరపాలని ఇరాన్ భావిస్తున్నట్లు తెలుస్తోంది.


# 800 మంది మిస్సింగులు

## స్పందించిన ఢిల్లీ పోలీసులు




**ఢిల్లీ, ఫిబ్రవరి 6:** ఢిల్లీలో 800 మందికి పైగా మిస్ అయ్యారంటూ ఆంగ్ల మీడియాలో పెద్దఎత్తున కథనాలు వచ్చాయి. 15 రోజుల వ్యవధిలోనే వారంతా అదృశ్యమయ్యారని వాటి సారాంశం. ఆ వార్తలపై తాజాగా ఢిల్లీ పోలీసులు స్పందించారు. ''ఢిల్లీలో వ్యక్తులు తప్పిపోతున్నారనే వార్తలకు పెయిడ్ ప్రమోషన్స్ కారణమని మేం గుర్తించాం. స్వార్థ ప్రయోజనాల కోసం చేసే ఇలాంటి ప్రచారాలను ఎట్టి పరిస్థితుల్లోను సహించబోం. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం'' అని పోలీసులు ఎక్స్ వేదికగా ఓ పోస్టు పెట్టారు.

గత ఏడాదితో పోలిస్తే.. కనిపించకుండా పోయినవారి సంఖ్యలో ఎలాంటి పెరుగుదల లేదని పేర్కొన్నారు. 2026లో నమోదైన కేసుల సంఖ్యలో తగ్గుదల కనిపించిందని చెప్పారు. అలాగే తప్పుడు వార్తల విషయంలో అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. కానీ తాజా గణాంకాలను మాత్రం వెల్లడించలేదు. ఢిల్లీ పోలీసు విభాగం డేటాను ఉటంకిస్తూ కొన్ని జాతీయ మీడియాల్లో కథనాలు ప్రచురితమయ్యాయి. ఈ ఏడాది జనవరి 1 నుంచి 15 మధ్యలో సగటున రోజుకు 54 మంది కనిపించకుండా పోయారని ఆ కథనాలు పేర్కొన్నాయి. ఆ లెక్కన 800 మందికిపైగా మిస్ అయ్యారని.. అందులో 509 మంది మహిళలు ఉన్నట్లు వెల్లడించాయి. కొంతమందిని గుర్తించినట్లు తెలిపాయి. దీనిపై ఆమ్ఆద్మీపార్టీ విమర్శలు చేసింది. తప్పిపోయిన వ్యక్తుల నగరంగా ఢిల్లీ మారిందని అధికార బీజేపీని దుయ్యబట్టింది.




## ఓటు ఓ చైతన్య గీతం

ఓటంటే ఒట్టి మాటల కోట కాదోయి..
ఓటంటే ప్రజాస్వామ్య బాట సుమా

ఓటంటే ఇంకు చుక్క కాదోయి...
ఓటంటే వ్యవస్థనే
మార్చుకునే వెలుగు చుక్క సుమా
ఓటంటే చిత్తుకాగితం కాదోయి
ఓటంటే చైతన్యగీతం సుమా

ఓటంటే కీర్తి కిరీటం కాదోయి..
ఓటంటే స్ఫూర్తి పోరాటం సుమా!

ఓటంటే అసామాన్య స్వరబాణి కాదోయి
ఓటంటే సామాన్య జనవాణి సుమా..
ఓటంటే అమ్ముకునే సరుకు కాదోయి
ఓటంటే నీ అంబులపొదిలో శరము సుమా

ఓటంటే అపరిచిత పదం కాదోయి
ఓటంటే ఆత్మశుద్ధి వాక్యం సుమా..
ఓటంటే స్వార్థాల వ్యవహారం కాదోయి
ఓటంటే నిస్వార్థాల సమహారం సుమా..

ఓటంటే నిన్ను ఎత్తుకునే సంపతి కాదోయి
ఓటంటే నున్ను హత్తుకునే సొపతి సుమా
ఓటంటే రాచరికపు పీఠం కాదోయి
ఓటంటే రాజ్యాంగపు పాఠం సుమా.

పదకొండున పుర పోరు పండుగ
ఓటేయ్ ఓ అ'సామాన్యుడా' మెండుగా..!

- డా. కటుకోఝ్వల రమేష్
సెల్:9949083327

ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు manamlekhalu@gmail.com మెయిల్ అడ్రస్‌కు పంపగలరు.
- ఎడిటర్

# బడ్జెట్లో అభివృద్ధి లక్ష్యాల ప్రాధాన్యత ఉందా?



2026-27 సంవత్సరానికి, రుణాలు కాకుండా మొత్తం రాబడి రూ.36,51,547 కోట్లు, మొత్తం వ్యయం రూ.53,47,315 కోట్లుగా, ఆర్థికలోటు స్థూల దేశీయ ఉత్పత్తిలో 4.3 శాతంగా అంచనా వేయబడిందని ఆర్థిక మంత్రి ప్రకటించారు. ఐక్యరాజ్య సమితి మొత్తం 17 సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించే దిశగా ఈ బడ్జెట్ ఎంత దూరంలో ఉంది అనేది ఇప్పుడు ప్రశ్న. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలలో 2025 సంవత్సరానికి మొత్తం 67.0 స్కోర్‌తో 167 దేశాలలో భారత దేశం 99వ ర్యాంకును సాధించింది. దేశంలో ఈ లక్ష్యాలను సాధించడానికి నీతి ఆయోగ్(NITI AYOG) సంస్థ, సహకార,పోటీ సమాఖ్య స్ఫూర్తితో 2030 సుస్థిర అభివృద్ధి లక్ష్యాల ఎజెండాను నడిపిస్తుంది. భారత ప్రభుత్వ ఆర్థిక మంత్రిత్వ శాఖ, తన కేంద్ర బడ్జెట్లో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల విజయాలను ప్రభావితం చేసే వివిధ పథకాలు, కార్య క్రమాల కోసం మంత్రిత్వ శాఖలకు నిధులను కేటాయిస్తుంది. 17 సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించే దిశగా ఈ బడ్జెట్లో ఎంత నిధులను ప్రతిపాదించారో పరిశీలిద్దాం.

ఆహార భద్రత కోసం ప్రధాన మంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన (అర్హత కలిగిన పేద కుటుంబాలకు ఉచిత ఆహార ధాన్యాలు) కోసం 2,27,429 కోట్లు, తక్కువ ఆదాయ కుటుంబాలకు ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పక్కా గృహాలను అందించడానికి PMAY-అర్బన్ 2.0 కోసం 3,000 కోట్లు, జీవనోపాధికి హామీ ఇవ్వ డానికి కొత్త వికసిత్, భారత్-గ్యారంటీ కోసం 95,692 కోట్ల కేటాయింపులు చేసారు.

2025 ప్రపంచ ఆకలి సూచికలో 123 దేశాలలో భారతదేశం 102వ స్థానంలో ఉంది, ఇది తీవ్రమైన ఆకలిని సూచిస్తుంది. ఆహార సబ్సిడీల కోసం బడ్జెట్ కేటాయింపులు చూస్తే 2026-27 ఆర్థిక సంవత్సరానికి వ్యవసాయ రంగానికి బడ్జెట్ దాదాపు ₹1.63 లక్షల కోట్లు, కిసాన్ క్రెడిట్ కార్డ్ రుణ పరిమితులను 3 లక్షల నుండి 5 లక్షలకు సబ్సిడీ వడ్డీతో పెంచడం, ఉత్పాదకతను పెంచడానికి వాతావరణం, నేల ఆరోగ్యం మరియు పంట పద్ధతులపై రైతులకు నిజ-సమయ సలహా ఇవ్వడానికి ఆధారిత ప్లాట్‌ఫామ్‌లను ప్రారంభించడం జరుగుతుంది.

2026-27 కేంద్ర బడ్జెట్ ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ కేటాయింపును ₹1,05,530.42 కోట్లకు పెంచింది, ఇది గత సంవత్సరం కంటే 9-10% పెరుగుదల. ప్రాథమిక సంరక్షణ (NHM 39,390 కోట్లు), AIIMS (PMSSY11,307 కోట్లు) విస్తరించడం, వైద్య పరిశోధనలను 24% పెంచడం ద్వారా 4,821 కోట్లకు పెంచడం, డిజిటల్ హెల్త్ మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడంపై కీలక చర్యలు దృష్టి ఉంటుంది.

2026-27 కేంద్ర బడ్జెట్ భారత విద్యా రంగానికి ఒక చారిత్రాత్మక మైలురాయిని సూచిస్తుంది, 'యువ శక్తి' (యువశక్తి) ను దేశం యొక్క 'విక్షిత్ భారత్' దార్శనికతకు చోదకంగా నిలిపింది. రికార్డు స్థాయిలో 1.39 కోట్లు కేటాయించడం ద్వారా, గత సంవత్సరం బడ్జెట్ కంటే 14.22% గణనీయమైన పెరుగుదల, ఇది విద్య నాణ్యతను మరియు విద్యా పంపిణీ వ్యవస్థను మెరుగుపరుస్తుంది.

2026-27 కేంద్ర బడ్జెట్ లింగ-స్పందనాత్మక బడ్జెట్కు గణనీయమైన ప్రోత్సాహాన్ని అందిస్తుంది. మొత్తం కేంద్ర బడ్జెట్లో లింగ బడ్జెట్ వాటా 2026-27 ఆర్థిక సంవత్సరంలో 9.37 శాతానికి పెరిగింది. మహిళలు మరియు బాలికల సంక్షేమం కోసం 5.00 లక్షల కోట్ల కేటాయింపు ముఖ్యంగా ఆరోగ్యం, పోషకాహారం, విద్య, జీవనోపాధి, భద్రత నిర్ధారించడంపై ప్రభుత్వం యొక్క నిరంతర దృష్టిని ప్రతిబింబిస్తుంది.

జల్ జీవన్ మిషన్‌కు 2026-27 బడ్జెట్ అంచనాలలో దాదాపు 67,670 కోట్లు కేటాయించబడింది. అయితే పారిశుధ్యం పట్టణ నీటి మౌలిక సదుపాయాలు, స్వచ్ఛ భారత్ మిషన్ - అర్బన్ 2026-27లో దాని కేటాయింపులను దాదాపు 2,500 కోట్లకు




తగ్గించింది. అటల్ మిషన్ ఫర్ రిజువనేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్‌ఫర్మేషన్ కార్యక్రమం కూడా మునుపటి అంచనాలతో పోలిస్తే (సుమారు 8,000 కోట్లు) తగ్గించబడింది. నదుల శుభ్రపరచడం మరియు సంబంధిత పారిశుధ్యం/నీటి నాణ్యత చర్యలకు మద్దతు ఇచ్చే నమామి గంగే మిషన్-ఐఐ కింద, బడ్జెట్ 2026-27కి దాదాపు 3,100 కోట్లు అందించింది

2026-27 ఆర్థిక సంవత్సరానికి పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖ బడ్జెట్ కేటాయింపు దాదాపు 32,914.7 కోట్లు. ప్రధాన మంత్రి సూర్య ఘర్ పథకం (రూఫ్టాప్ సోలార్) గృహాలలో స్వచ్ఛమైన ఇంధన స్వీకరణ, వికేంద్రీకృత ఉత్పత్తిని పెంచడానికి 2026-27లో దాదాపు 22,000 కోట్లకు పెరిగింది. విద్యుత్ మంత్రిత్వ శాఖకు కూడా ₹29,900 కోట్లకు పైగా, ట్రాన్స్‌మిషన్ అప్‌గ్రేడ్లు మరియు స్మార్ట్ మీటరింగ్ పై గణనీయమైన ప్రాధాన్యతనిచ్చింది.

మౌలిక సదుపాయాల ఆధారిత వృద్ధిని వేగవంతం చేయడానికి, ఉద్యోగాలను సృష్టించడానికి, ఉపాధి మరియు వృద్ధికి 10,000 కోట్ల గ్రోత్ ఫండ్‌ను ప్రవేశపెట్టారు. స్వయం-నిరంతర భారత నిధిక్ష్ 2,000 కోట్లు, శ్రామిక శక్తి సంసిద్ధతను మెరుగుపరచడానికి బడ్జెట్ నైపుణ్య అభివృద్ధి వ్యవస్థాపకత మంత్రిత్వ శాఖ కేటాయింపును 9,886 కోట్లకు పెంచింది.

దేశవ్యాప్తంగా మౌలిక సదుపాయాలు, లాజిస్టిక్స్ మరియు కనెక్టివిటీని బలోపేతం చేయడానికి, ప్రభుత్వ మూలధన వ్యయాన్ని 12.2 లక్షల కోట్లకు పెంచుతుంది. దేశీయ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తి, సరఫరా గొలుసులను విస్తరించడానికి 40,000 కోట్లతో అధునా తన తయారీపై ప్రధాన దృష్టి ఉంది. ఐదు సంవత్సరాలలో10,000 కోట్ల వ్యయంతో బయోఫార్మా శక్తి కార్యక్రమం భారతదేశాన్ని బయోఫార్మాస్యూటికల్ హైటెక్ పరిశ్రమ వృద్ధిని భద్రపరచడానికి ఇండియా సెమీకండక్టర్ మిషన్‌కు 1,000 కోట్లు.

బడ్జెట్ సామాజిక రంగ వ్యయాన్ని సుమారు 2.60 లక్షల కోట్లకు పెంచింది, ఇది అణగారిన వర్గాలకు సమ్మిళిత సేవలకు మద్దతు ఇవ్వడానికి 12.7% ,మహిళా శిశు అభివృద్ధికి 28,183 కోట్లు, లింగ బడ్జెట్ వాటా 9.37% పెరిగింది. దివ్యాంగన్ కౌశల్ యోజన 200 కోట్లు, దివ్యాంగ్ సహారా యోజన 100 కోట్లు వైకల్యాలున్న వ్యక్తుల నైపుణ్యాలను, ఆర్థిక భాగస్వామ్యాన్ని పెంచడానికి ప్రవేశపెట్టబడ్డాయి.

2026-27 కేంద్ర బడ్జెట్లో, సమతుల్య పట్టణ వృద్ధి స్థిరమైన నగరాలు, సమాజాలు లక్ష్యంగా చిన్న పట్టణ కేంద్రాలలో మౌలిక సదుపాయాలు, ప్రాథమిక సేవలు ,ఆర్థిక సామర్థ్యాన్ని పెంచడానికి ఐదు సంవత్సరాలలో టైర్-2 మరియు టైర్-3 నగరాల్లో నగర ఆర్థిక ప్రాంతాలనుఅభివృద్ధి చేయడానికి 5,000 కోట్ల నిధిని కేటాయించారు. గృహనిర్మాణం, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ పట్టణ అభివృద్ధి కార్యక్రమాల కోసం ₹85,522.39 కోట్లు కేటాయించబడింది.

భారతదేశ కేంద్ర బడ్జెట్ 2026-27లో, బాధ్యతాయుతమైన వినియోగం మరియు ఉత్పత్తికి సంబంధించి పర్యావరణం, అటవీ మరియు వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖకు 3,759.46 కోట్లు కేటాయించారు. కార్బన్ సంగ్రహణ, వినియోగం మరియు నిల్వ సాంకేతికతలకు కొత్త 20,000 కోట్ల బహుళ-సంవత్సరాల ప్రోత్సాహకం 2026-27లో దాదాపు 500 కోట్లు అంచనా వేయబడింది. 2026-27 బడ్జెట్ పత్రాలలో భారతదేశం ఏకీకృత అంశాన్ని ప్రదర్శించనప్పటికీ, ఈ లక్ష్య కేటాయింపులు కీలక రంగాలలో స్థిరమైన వినియోగం, ఉత్పత్తి సామర్థ్యం మరియు తగ్గిన పర్యావరణ ప్రభావం వైపు క్రమంగా మార్పును సూచిస్తాయి.

2026-27 కేంద్ర బడ్జెట్లో, సముద్ర పర్యావరణ వ్యవస్థలు, మత్స్య స్థిరత్వం మరియు జల జీవవైవిధ్యంతో సహా లైఫ్ బిలో వాటర్‌కు ప్రభుత్వం ఇప్పటివరకు ఎన్నడూ లేని విధంగా 2,761.80 కోట్ల వార్షిక కేటాయింపును ప్రతిపాదించింది.

2026-27 కేంద్ర బడ్జెట్లో, 'భూమిపై జీవితం' అడవులు, జీవవైవిధ్యం, వన్యప్రాణుల సంరక్షణ మరియు పర్యావరణ వ్యవస్థ రక్షణకు ప్రభుత్వం అందించే మద్దతు పర్యావరణం, అడవులు మరియు వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ కింద కేటాయింపుల ద్వారా ప్రతిబింబిస్తుంది., ఇది 2026-27 సంవత్సరానికి 3,759.46 కోట్లు. కాలుష్య నియంత్రణ కార్యక్రమాలకు నిధులు 1,091 కోట్లకు పెరుగుతాయి. నేషనల్ మిషన్ ఫర్ ఎ గ్రీన్ ఇండియాకు దాదాపు 212.5 కోట్లు కేటాయించబడ్డాయి. ప్రాజెక్ట్ టైగర్ మరియు ప్రాజెక్ట్ ఎలిఫెంట్ ద్వారా వన్యప్రాణుల సంరక్షణ దాదాపు 290 కోట్ల కేటాయింపుతో సహాయపడుతుంది.

2026-27 కేంద్ర బడ్జెట్లో, శాంతి, న్యాయం మరియు బలమైన సంస్థలకు అనుసంధానించబడిన కేటాయింపులు చట్ట అమలు, న్యాయం అందించడం ,సంస్థాగత సామర్థ్యాన్ని బలోపేతం చేయడంపై దృష్టి సారించాయి, న్యాయ మంత్రిత్వ శాఖకు ₹4,509 కోట్లు, న్యాయవ్యవస్థను డిజిటలైజ్ చేయడానికి 1,200 కోట్లు, అంతర్గత భద్రత, పోలీసింగ్ విధులను బలోపేతం చేయడానికి 1.73 లక్షల కోట్ల ప్రాధాన్యత నిస్తూనే న్యాయం మరియు సంస్థాగత డిజిటలైజేషన్‌ను పొందడంలో అవసరమైన పెట్టుబడిని కొనసాగిస్తుంది.

2026-27 కేంద్ర బడ్జెట్లో, అంతర్జాతీయ సహకారం, ప్రపంచ భాగస్వామ్యాలు, అభివృద్ధి సహకారానికి మద్దతు ఇచ్చే లక్ష్యాల కోసం భాగస్వామ్యాలకి నిధులు ప్రధానంగా స్నేహపూర్వక దేశాలకు విదేశీ గ్రాంట్లు-ఇన్-ఎయిడ్‌గా 5,685.56 కోట్లు కేటాయించింది, నిర్దిష్ట ద్వైపాక్షిక సహాయంలో 2026-27లో భూటాన్‌కు2,288 కోట్లు, నేపాల్‌కు800 కోట్లు, మాల్దీవులకు 550 కోట్లు మరియు శ్రీలంకకు 400 కోట్లు ఉన్నాయి. ఈ అంతర్జాతీయ మరియు సహకార ఆర్థిక చర్యలు స్థిరమైన అభివృద్ధి కోసం బహుళ-స్థాయి భాగస్వామ్యాలను బలోపేతం చేయడానికి భారతదేశం యొక్క నిబద్ధతను నొక్కి చెబుతున్నాయి. ఈ వ్యూహాలు వ్యక్తులు, కమ్యూనిటీలు, ప్రభుత్వాలు సమిష్టిగా స్థిరమైన అభివృద్ధి కోసం పని చేయడానికి మార్గాలు అందిస్తాయి. రోజువారీ అలవాట్లలో మార్పులు, మనం చేసే ఎంపికలు విధానాల స్థాయిలో కార్యక్రమాలు రాబోయే తరాలకు మరింత స్థిరమైన భవిష్యత్తును సృష్టించడంపై తీవ్ర ప్రభావం చూపుతాయి. ఈ సూత్రాలను స్వీకరించడం ద్వారా, మనం మరింత సమతుల్యమైన, స్థిరమైన జీవన శైలి కోసం దోహదం చేయవచ్చు.

- డాక్టర్. పి.ఎస్. చారి
8309082823

# రామభాయి త్యాగం మరువలేనిది



భారతదేశ సామాజిక చరిత్రలో బీఆర్ అంబేద్కర్ పేరు ఎంతటి విప్లవాత్మకమో, ఆయనకు నీడలా నిలిచిన మహిళ రామభాయి అంబేడ్కర్ పాత్ర అంతే గొప్పది. నేడు (07.02.2026) ఆమె జయంతి సందర్భంగా రమాబాయి జీవితాన్ని కేవలం అంబేద్కర్ భార్య అనే పరిధిలో కాకుండా, ఒక త్యాగమూర్తి, అవగాహన గల భార్య, సామాజిక మార్పుకు మౌన సైనికురాలుగా చూడాల్సిన అవసరం ఉంది. రామభాయి ఒక సాధారణ మహిళ కాదు, చదువులు లేని గ్రామీణ నేపథ్యానికి చెందిన మహిళ. చిన్న వయసులోనే వివాహం, పేదరికం, కుటుంబ బాధ్యతలు ఇవన్నీ ఆమె జీవితాన్ని కఠినతరం చేశాయి. కానీ ఆమెకు ఉన్న గొప్పతనం ఏమిటంటే, తన జీవితాన్ని భర్త లక్ష్యంతో ఏకం చేసుకోవడం. అంబేడ్కర్ పోరాటం వ్యక్తిగతం కాదు. అది సమాజ విముక్తి పోరాటం. ఆ పోరాటాన్ని అర్థం చేసుకున్న భార్యగా రామభాయి గారు నిలిచారు.

సామాజిక రాజకీయ సందర్భంలో రమాబాయి పాత్ర అంబేడ్కర్ కులవ్యవస్థ, అసమాన తలపై పోరాడుతున్న కాలంలో కుటుంబ జీవితం చాలా కష్టసాధ్యమైనది. నిరంతర ప్రయాణాలు, విదేశీ చదువులు, ఆర్థికఇబ్బందులు ఇవన్నీ రమాబాయి భుజాల మీదే పడ్డాయి. భర్త ఆలోచ నలకు భరోసాగా నిలిచింది.

రాజకీయంగా ఆమె వేదికలపై మాట్లాడలేదు. కానీ అంబేడ్కర్ గారు మాట్లాడే ప్రతి మాట వెనుక ఆమె చేసిన త్యాగం ఉంది. సామాజిక విప్లవాలు సాధారణంగా ప్రసంగాల వల్ల కాదు, కుటుంబాలలోని మౌన సహకారంతో సాధ్యమవుతాయన్న సత్యానికి రమాబాయిగారు సాక్ష్యం. అంబేడ్కర్ రమాబాయిమధ్య ప్రేమ,కమ్యూనికేషన్ వారి ప్రేమ



సినిమా ప్రేమ కాదు, అది త్యాగంతో నిండిన అవగాహన ప్రేమ. అంబేడ్కర్ గారు విదేశాల్లో ఉన్నప్పుడు రమాబాయిగారు ఎదుర్కొన్న ఒంటరితనం, పేదరికం, పిల్లల మరణం వంటి బాధలు అసాధారణమైనవి. ఆమె భర్త లక్ష్యాన్ని ఎప్పుడూ ప్రశ్నించలేదు.నువ్వు ప్రజల కోసం బతకాలి అనే భావనతో ఆమె అంబేడ్కర్ గారిని ముందుకు నెట్టింది. అంబేడ్కర్ కూడా రమాబాయి త్యాగాన్ని జీవితాంతం గుర్తుంచు కున్నారు. ఆమె మరణం ఆయనను తీవ్రంగా కుదిపేసింది. సాంస్కృతికంగా రమాబాయి ప్రాధాన్యత పురుషాధిపత్య సమాజంలో భార్య పాత్రను సేవకు రాలిగా మాత్రమే చూసే ధోరణి ఉంది. కానీ రమాబాయి సేవకురాలు కాదు, సహచరిణి. ఆమె అంబేడ్కర్ గారి వ్యక్తిత్వాన్ని నిర్మించిన శక్తి. ఆమె జీవితం బహుజన మహిళలకు ఒక సందేశం. చదువు లేకపోయినా, అవగాహన ఉంటే చరిత్రను మార్చవచ్చని నేటి ఆధునిక సమాజానికి తెలియచెప్పిన ఆదర్శ దంపతులు వారు.

నేటి సమాజంలో భార్య భర్తల మధ్య సంబంధం ఎక్కువగా అహంకారం, అధికారం, అనుమానాల చుట్టూ తిరుగుతోంది. కానీ అంబేడ్కర్ రమాబాయి దంపతులు మనకు చెప్పే పాఠం వేరే. భార్య భర్తలు ఒకరి లక్ష్యాన్ని మరొకరు గౌరవించాలి.. ప్రేమ అంటే అధికారం కాదు, అవగాహనకుటుంబం అంటే వ్యక్తిగత సుఖం మాత్రమే కాదు, సామాజిక బాధ్యత కూడా భర్త విజయం వెనుక భార్య త్యాగాన్ని గుర్తించాలి భార్యను బలహీనురాలిగా కాదు, సహచరిణిగా చూడాలి ..ఈ విలువలు నేటి ఆధునిక సమాజంలో అత్యవసరం. రమాబాయి డా.అంబేడ్కర్‌ని భౌతికంగా కాకుండా తన లక్ష్యాన్ని చూసి ఎంతగా ఇష్టపడి సామాజికంగా గౌరవించింది. తాను సంపాదించిన డబ్బులని అంబేద్కర్ చదువుల ఖర్చుల కోసం వెచ్చించింది. సామాజిక లక్ష్యం కోసం తమ బిడ్డల ఆరోగ్యం కోసం దాచుకున్న కొద్దిపాటి డబ్బుని కూడా అంబేద్కర్ అవసరాల కోసం వెచ్చించి, భారత రాజ్యాంగాన్ని అంబేద్కర్ రాసే ప్రక్రియలో ప్రత్యక్షంగా, పరోక్షంగా రమాబాయి చేసిన త్యాగం మరువలేనిది. అంతిమంగా రమాబాయి అంబేడ్కర్ చరిత్రలో పెద్దగా మాట్లాడబడని గొప్ప మహిళ.

ఆమె జీవితం మనకు చెప్పేది ఒక్కటే మహానుభావుల వెనుక మౌనంగా నిలిచే మహానుభావురాలు ఎప్పుడూ ఉంటారు. డా. అంబేడ్కర్ సామాజిక రాజకీయ సాంస్కృతిక విప్లవానికి రమాబాయి త్యాగమే బలమైన పునాది. ఆమె జయంతి సందర్భంగా, ఆమెను స్మరించుకోవడం అంటే కేవలం పూలు వేయడం కాదు, ఆమె విలువలను మన జీవితాల్లో అమలు చేయడమే నిజమైన నివాళి.

- పుల్లెంల గణేష్
9553041549

# సహ చట్టానికి చాప చుట్టే యత్నాలు



అవినీతి రహిత సమాజమే లక్ష్యంగా జన హితం కోరుతూ ప్రభుత్వ పథకాల్లో పారదర్శకత కార్యాలయాల్లో అవినీతి నియంత్రించడానికి రెండు దశాబ్దాల క్రితం అమల్లోకి వచ్చిన సమాచార హక్కు చట్టానికి చాపచుట్టే ప్రయత్నాలు ఆది నుండి జరుగుతూనే ఉన్నాయి. ప్రజలకు నిజం చెప్పడానికి పరిపాలనలో నీతి నియమాలను పరిరక్షించడానికి ఉద్దేశించబడిన ఈ చట్టాన్ని అణచడానికి కేంద్ర ప్రభుత్వం గత దశాబ్ద కాలంగా ఎన్నో కుట్రలు కుహకాలు చేస్తూనే ఉంది. కేంద్ర ప్రభుత్వం ఇటీవల అమల్లోకి తెచ్చిన డేటా ప్రొటెక్షన్ బిల్లులోని సెక్షన్ 30 (2) ద్వారా సమాచార హక్కు చట్టం లోని సెక్షన్ 8ని సవరించాలని ప్రతిపాదించింది. తాజాగా కేంద్ర ఆర్థిక సర్వే సమాచార హక్కు చట్టాన్ని పున సమీక్షించాలని గోప్యమైన నివేదికలకు మినహాయింపులు ఇవ్వాలని చట్టం పరిధిని కుదించాలని పేర్కొనడం వల్ల సమాచార హక్కు చట్టం లక్ష్యం దెబ్బతిని ఉనికి కోల్పోయే ప్రమాదం ఉంది.

ఆర్థిక సర్వే సూచనలతో సహ చట్టం సమాధి. కేంద్ర ప్రభుత్వం జనవరి 29న పార్లమెంట్లో ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వే సమాచార హక్కు చట్టాన్ని బలమైన ప్రజాస్వామ్య సంస్కరణగా పేర్కొంటూనే పున సమీక్షించాలనీ సూచించినది. దేశంలో ప్రవేశపెట్టిన చట్టాలలో పౌర సమాజం ఎక్కువగా వినియోగించుకుంటున్న చట్టం సమాచార హక్కు చట్టం. అవినీతిపై యుద్ధం చేయడంలో ఇంతటి ప్రజాదారణ పొందిన ఈ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం గత దశాబ్ద కాలంగా కోరలు పీకే ప్రయత్నం చేస్తుంది. తాజాగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వే సమాచార హక్కు చట్టంపై కొన్ని సూచనలు చేస్తూ గోప్యమైన సిబ్బంది నివేదికలకు మినయింపు ఇవ్వాలని పాలనపై ప్రభావం చూపే కీలకమైన పత్రాల వెల్లడి విషయంలో నిరోధించడానికి పార్లమెంటరీ



పర్యవేక్షణతో కూడిన మినిస్టీరియల్ వీటోను పరిశీలించాలని పేర్కొంది. అలాగే సిబ్బంది బదిలీలు గోప్య నివేదికలు వంటి సేవా రికార్డులను సమాచార హక్కు చట్టం నుండి వినాయించాలని నుండి సూచించింది.

తుది నిర్ణయం తీసుకునే వరకు అంతర్గత చర్చల నోట్స్ ముసాయిదా నివేదికలను మరియు పత్రాలను ఇవ్వవద్దని సమాచార హక్కు చట్టం పరిధిని కుదించాలని పేర్కొంది. ఈ సూచనలపై కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపితే సమాచార హక్కు చట్టం దరఖాస్తులను అధికారులు చాలా తేలిగ్గా తిరస్కరించే అవకాశం ఉంది. సాధారణ సమాచారం కూడా పౌర సమాజానికి అందడం గగనంగా మారుతుంది.

వ్యక్తిగత గోప్యత చట్టంతో ఇబ్బందే.. ఇటీవల కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన వ్యక్తిగత గోప్యత చట్టంలోని సెక్షన్ 30(2) ఆర్టిఐ చట్టానికి సవరణను ప్రతిపాదించింది. వ్యక్తిగత సమాచారానికి మినహాయింపు ఇచ్చే విధంగాసెక్షన్ 8(1)ను పూర్తిగా మార్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇది కార్యరూపం దాలిస్తే సమాచార హక్కు చట్టం స్ఫూర్తి లక్ష్యం, ప్రజాప్రయోజనాలు దెబ్బ తింటాయి. సమాచార హక్కు చట్టం అమలు ప్రశ్నార్థకంగా మారుతుంది. సమాచార హక్కు చట్టంలోని సెక్షన్ 8లో ఉన్నటువంటి ప్రధాన నిబంధన విశాల ప్రజాప్రయోజనాల దృష్ట్యా ఇవ్వవలసిన సమాచారం ఇవ్వకుండా అధికారులు అడ్డుకునే అవకాశం ఉంది.

కేంద్ర ఆర్థిక సర్వే సమాచార హక్కు చట్టం నిర్వీర్యం అయ్యే విధంగా ఇచ్చిన సూచనలు మరియు సమాచార హక్కు చట్టాన్ని నిర్వీర్యం చేసే విధంగా వ్యక్తిగత గోప్పత చట్టంలోని ఉన్న నిబంధనలపై పౌర సమాజం ఉద్యమకారులు ఉద్యమిస్తేనే ఆర్టిఐ చట్టానికి మనుగడ మరియు అక్రమార్కుల పట్ల వజ్రాయుధంగా మారిన బ్రహ్మాస్త్రానికి బలం చేకూరుతుంది.

- అంకం నరేష్
6301650324

# మాడభూషి జీవితం... నేటికి ఆదర్శం

మాడభూషి అనంత శయనం అయ్యంగార్ ప్రముఖ న్యాయవాదిగా, సామాజిక కార్యకర్తగా, స్వాతంత్ర్య సమర యోధుడుగా, అత్యుత్తమ పార్లమెంటు సభ్యుడిగా, వక్తగా, లోకసభ స్పీకర్‌గా,జాతీయ నాయకులలో విశిష్ట స్థానం దక్కించు కున్నారు. అయ్యంగార్ 1891 ఫిబ్రవరి 4న ఆంధ్రప్రదేశ్ లోని ఆధ్యాత్మిక పట్టణం తిరుపతి సమీపంలో తిరుచానూరులో జన్మించారు. తిరుపతి లోని దేవస్థానం ఉన్నత పాఠశాలలో ప్రారంభ విద్యను పూర్తి చేసి, ఉన్నత చదువుల కోసం మద్రాసుకు వెళ్లారు. మద్రాసులోని పచయ్యప్ప కళాశాల నుండి బిఎ పట్టా పొందిన తరువాత, 1913లో మద్రాస్ లా కాలేజీ నుండి పట్టా పొందారు. 1915లో న్యాయవాద వృత్తిలోకి ప్రవేశించారు. ఒక ప్రొఫెషనల్ న్యాయవాదిగా, అసాధారణ సామర్థ్యంతో ఖ్యాతిని పొందారు. జీవనోపాధిని సంపాదించే సాధనంగా మాత్రమే న్యాయవాద వృత్తిని చూడక, భారత ప్రజల అవసరాలకు అనుగుణంగా దేశ న్యాయ వ్యవస్థను మెరుగు పరచడంలో ఆసక్తి చూపారు. అయ్యంగార్ చిన్న వయస్సులోనే స్వాతంత్ర్య ఉద్యమం లోకి ప్రవేశించారు.

బ్రిటిష్ వలస వాదానికి వ్యతిరేకంగా జాతీయ ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్న ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ ప్రముఖ వ్యక్తులలో ఒకరిగా ఎదిగారు. కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వంలో ఉండి, పోరాడటమే లక్ష్యంగా, 1934 లో కేంద్ర శాసన సభ ఎన్నికలలో పోటీ చేయాలని నిర్ణయించు కున్నప్పుడు,అయ్యంగార్ అధికమెజారిటీతో సభకుఎన్నిక య్యారు. అయ్యంగార్ అసెంబ్లీలో తన వాదనా పటిమతో తనదైన ముద్ర వేశారు. 1942 'క్విట్ ఇండియా'లో పాల్గొన్నందుకు 1940, 1944 మధ్య అయ్యం గార్ మూడు సంవత్స రాలు జైలు శిక్ష అనుభవించారు.

రాజకీయ స్వేచ్ఛ కోసం ఉద్యమంలో చురుకుగా పాల్గొనడమే కాకుండా, సమాజం లోని అణగారిన వర్గాల, సామాజిక విముక్తి దిశగా, నిర్దేశించిన వివిధ కార్య కలాపాలలో అయ్యంగార్ పాల్గొన్నారు. అంటరాని సామర్థ్యం వంటి సామాజిక చెడులతో పోరాడటానికి గాంధీజీ నిర్మాణాత్మక కార్యక్రమాల నుండి ప్రేరణ పొందిన అయ్యంగార్, హరిజనులకు ఆలయ ప్రవేశం, అంటరాని తనం నిర్మూలన కోసం ఉద్యమాలలో ముందంజలో ఉన్నారు. హరిజన్ సేవక్ సంఘ అధ్యక్షుడిగా తమ సామర్థ్యంలో, హరిజనుల ఆర్థిక, సామాజిక అభ్యున్నతి కోసం అనేక కార్యక్రమాలను చేపట్టారు.

ఆయన మొట్టమొదటి సారిగా చిత్తూరు మున్సిపల్ కౌన్సిల్‌కు ఎన్నిక అయ్యారు. తరువాత, చిత్తూరు కో-ఆపరేటివ్ డిస్ట్రిక్ట్ బ్యాంక్ డైరెక్టర్‌గా ఎన్నికయ్యారు. చిత్తూరు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా పనిచేశారు. అనంతరం ఆంధ్ర ప్రావిన్షియల్ కాంగ్రెస్ కమిటీ, అఖిల భారత కాంగ్రెస్ కమిటీకి ఎంపిక అయినారు. 1946-47 మధ్య కాలంలో కాంగ్రెస్ పార్టీ కార్యదర్శిగా కూడా పని చేశారు. రాజ్యాంగ అసెంబ్లీ సభ్యునిగా పని చేశారు. జి.వి.మవలంకర్‌ను రాజ్యాంగ అసెంబ్లీ (శాసనసభ) స్పీకర్‌గా ఎన్నుకున్న నేపథ్యంలో, అయ్యం గార్ను దాని డిప్యూటీ స్పీకర్గా ఎంపిక చేశారు. రాజ్యాంగ అసెంబ్లీ స్టీరింగ్ కమిటీలో కూడా పని చేశారు. 1950-52 మధ్య కాలంలో అయ్యంగార్ తాత్కాలిక పార్ల మెంటు డిప్యూటీ స్పీకర్‌గా కొనసాగారు. 1950 లో తాత్కాలిక పార్లమెంట్ మొదటి అంచనా కమిటీకి ఛైర్మన్‌గా ఎంపిక య్యారు. అయ్యంగార్ గొప్ప, సమర్థ వంతమైన పార్ల మెంటు సభ్యుడని నిరూపించు కున్నారు. పార్లమెంటరీ నిబంధన లను నిలబెట్టడానికి కట్టుబడి ఉన్నారు.

1957 లో రెండవ లోక్‌సభ ఏర్పడి నప్పుడు, అయ్యంగార్ ఐదేళ్ల పాటు ఆయనను స్పీకర్‌గాఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వాయిదా తీర్మానాలు, బిల్లులు, తీర్మానాలు, స్టాండింగ్ కమిటీలు, కాలింగ్ అటెన్షన్ నోటీసులు మొదలైన వాటిపై అయ్యంగార్ పద్ధతి అనుసరణీయంగా మారింది.

1960లో టోక్యోలో జరిగిన 49 వ ఇంటర్ పార్లమెంటరీ సమావేశానికి భారత పార్లమెంటరీ ప్రతినిధి బృందానికి నాయకుడిగా పనిచేసిన ఆయన, దేశంలోని శాసన సభల ప్రిసైడింగ్ అధికారుల సమావేశాల నిర్వహణలో ఆసక్తి చూపారు. 1962 సార్వత్రిక ఎన్నికలలో అయ్యంగార్ మూడవసారి లోక్‌సభకు ఎన్నికైనా, బీహార్ గవర్నర్‌గా పని చేయడానికి వీలుగా ఆయన సభ్యత్వానికి రాజీనామా చేశారు. దాదాపు మూడు దశాబ్దాల విశిష్ట పార్లమెంటరీ జీవితంలో ప్రత్యేక గుర్తింపు పొందారు. రాజకీయ జీవితాన్ని విడిచిపెట్టిన తరువాత, హరిజన్ సేవక్ సంఘ్, రామ్ విలాస్ సభ, చిత్తూరు డ్రామా టిక్ అసోసియేషన్స్, కాన్స్టిట్యూషన్ క్లబ్, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ వరల్ ఫెడరల్ గవర్నమెంట్ తదితర సామాజిక-సాంస్కృతిక, విద్యాసంస్థలతో సంబంధం కొనసాగించారు. పార్లమెంటరీ జీవితం తరువాత, తన జీవితాంతం అయ్యంగార్ ఫిలాసఫీ, సంస్కృత సాహిత్యం, భారతీయ సంస్కృతి అధ్యయనం ప్రచారం పట్ల ఆయన ఎంతో ఆసక్తి చూపారు. కొంతకాలం సెంట్రల్ అడ్వైజరీ బోర్డ్ ఆఫ్ ఎడ్యుకేషన్ సభ్యుడిగా, రిషికుల్ విశ్వ విద్యాలయ ఛాన్సలర్‌గా పని చేశారు. భారత పార్లమెంటుపై ఒక పుస్తకాన్ని కూడా రాశారు.

మతాలు ప్రధానంగా మనిషికి, మనిషికి మధ్య ఉన్న తేడాలను తొలగించడానికి, మనిషిలో సోదర భావనను పెంపొందించ డానికి తద్వారా అతన్ని ఉద్ధరించడానికి సహాయపడతాయని నమ్మారు. అయ్యంగార్ ప్రకారం, ఉన్నత కులం లేదా తక్కువ కులం వంటివి ఏవీ లేవు, కానీ ఉన్నత చైతన్యం, తక్కువ చైతన్యం మాత్రమే ఉన్నాయి, ఈ రెండింటికి పుట్టుకతో సంబంధం లేదు. పుట్టుక ప్రాతిపదికన ఆరాధన హక్కును తిరస్కరించడం దైవత్వానికి వ్యతిరేకంగా చేసిన నేరం అని నమ్మారు. ఈ నమ్మకమే హిందూ దేవాలయాల లోకి ప్రవేశించాలన్న దళితుల వాదనకు మద్దతు ఇవ్వడానికి ఆయన్ని ప్రేరేపించింది.

బీహార్ గవర్నర్‌గా పూర్తి కాలం పనిచేసిన తరువాత, శేష జీవితం గడపడానికి తన స్వగ్రామమైన తిరుపతికి తిరిగి వచ్చి, అయ్యంగార్ 1978 మార్చి 19న తన 87వ ఏట చివరి శ్వాస తీసుకునే వరకు సేవలు అందించారు. నిబద్ధత కలిగిన వ్యక్తిగా చరిత్రలో నిలిచారు.

- రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

# అడవిలో బందీల విముక్తి ఆపరేషన్ విన్యాసం నిర్వహణ



విశాఖపట్నం,ఫిబ్రవరి 6 : నేషనల్ సెక్యూరిటీ గార్డ్ ఆంధ్రప్రదేశ్లోని విశాఖపట్నంలో ఫిబ్రవరి 2 నుండి 5 మధ్య (3 రోజులు) విన్యాసాన్ని కంబాల కొండ రిజర్వ్ ఫారెస్ట్ వద్ద , ఇఖు పాలెం వద్ద విజయవంతంగా నిర్వహించిందని ఐఖ్ గ్రేహౌండ్స్ గ్రూప్ కమాండర్ (ఆపరేషన్స్) డా. సుమిత్ గరుడ్ తెలిపారు.ఈ విన్యాసంలో వాస్తవ యుద్ధ పరిస్థితులను అనుకరించి, నక్సల్స్ ప్రస్తుత కార్యకలాప విధానానికి అనుగుణంగా వివిధ నైపుణ్యాలు, ఆపరేషనల్ వ్యూహాలు మరియు తంత్రాలను సమన్వయం చేస్తూ, యథార్థమైన శిక్షణ వాతావరణాన్ని సృష్టించారు. ఈ విన్యాసం లక్ష్యం అకస్మాత్తుగా సంభవించే ముప్పులను ముందుగా అంచనా వేయడం, ప్రాంతంలో దృఢమైన భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేయడానికి సమన్వయ ప్రక్రియలను సాధన చేయడం . ఈ విన్యాసంలో ఆంధ్రప్రదేశ్ పోలీస్, గ్రేహౌండ్స్, ఆక్టోపస్ విభాగాలు ప్రథమ స్పందన దళాలుగా పాల్గొనగా, ఇఖ్కఊ, ఐఖీఆ, ఖృఖఊ, అటవీ శాఖ, అగ్నిమాపక, వైద్య మరియు గూఢచారి సంస్థల నుండి గణనీయమైన మద్దతు లభించిందన్నారు . అత్యవసర పరిస్థితుల్లో వేగవంతమైన మరియు ప్రభావవంతమైన స్పందనకు అంతర ఏజెన్సీ సమన్వయం మరియు పరస్పర అనుసంధాన సామర్థ్యాన్ని ఈ విన్యాసం స్పష్టంగా చాటిందనీ తెలిపారు.

**ఈ విన్యాసంలో ప్రధానంగా కింది ఆపరేషనల్ అంశాలపై దృష్టి సారించారు:**

బందీల విముక్తి మిషన్ కౌంటర్ ఐఉ (తాత్కాలికంగా తయారు చేసిన పేలుడు పరికరాలు) విధానాలు, అడవి యుద్ధ తంత్రాలు విన్యాసం పూర్తయిన అనంతరం, ఏఖ్జ పరిస్థితుల్లో ఉపయోగించిన ఆయుధాలు మరియు పరికరాల ప్రదర్శనను ఏర్పాటు చేసి, ఆధునిక ఆపరేషనల్ సాధనాలు మరియు వ్యూహాల వినియోగ సామర్థ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రేహౌండ్స్ గ్రూప్ కమాండర్ (ఆపరేషన్స్) డా. సుమిత్ గరుడ్, ఐపీఎస్ మాట్లాడుతూ, ౖఖిఎ బృందం చేపట్టిన సమన్వయపూర్వక ప్రయత్నాలను ప్రశంసిస్తూ, ఈ విన్యాసం ద్వారా ౖఖిఎ మరియు రాష్ట్ర పోలీస్ బలగాల మధ్య సమన్వయం మరింత బలోపేతం అయి, వాస్తవ కాల ముప్పులను ఎదుర్కొనే ఏకీకృత మరియు సమర్థమైన స్పందన వ్యవస్థ ఏర్పడిందని తెలిపారు. ఇలాంటి విన్యాసాలు ఆపరేషనల్ సిద్ధతను మెరుగుపరచడమే కాకుండా, కీలక దశల్లో వేగవంతమైన మరియు సమగ్ర నిర్ణయాలు తీసుకునేలా స్పందన దళాలను శక్తివంతం చేస్తాయని ౖఖిఎ పునరుద్ఘాటించింది. ఈ విన్యాసం ద్వారా ౖఖిఎ, గ్రేహౌండ్స్ మరియు ఆక్టోపస్ మధ్య సహకార సామర్థ్యం గణనీయంగా బలపడుతుందని, నక్సల్స్ లేదా ఉగ్రవాద సంబంధిత అత్యవసర పరిస్థితుల్లో మరింత దృఢమైన మరియు ప్రభావవంతమైన స్పందనకు ఇది దోహదపడుతుందని, సంక్షోభ సమయాల్లో ప్రజల భద్రతను నిర్ధారించడంలో కీలక పాత్ర పోషిస్తుందని భావిస్తున్నామన్నారు.

# తిరుపతి లడ్డూ ప్రసాదాన్ని కల్తీ చేసిన వైసిపికి శిక్ష తప్పదు



- వైసిపి నాయకులకు దేవుడంటే భక్తి కన్నా దోచుకోవడం పైనే మక్కువ
- దొంగే దొంగ అన్న చందంగా వైసీపీ తీరు
- కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్ ధ్వజం

కాకినాడ, ఫిబ్రవరి 6: హిందువులు పరమ పవిత్రంగా భావించే కలియుగ దైవం వెంకటేశ్వరస్వామి లడ్డు ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడి అపవిత్రం చేసిన వైసీపీకి శిక్ష తప్పదని, వైసీపీ నాయకులకు దేవుడంటే భక్తికన్నా, దోచుకోవడం పైనే మక్కువని కాకినాడ పార్లమెంటు సభ్యులు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం లో కమిషన్లకు కక్కుర్తి పడి తాడేపల్లి ప్యాలెస్ నుండి వచ్చిన ఆదేశాలతో నిబంధనలను తుంగలోకి తొక్కి అర్హత లేని కంపెనీలకు నెయ్యి సరఫరా కాంట్రాక్టులు కట్టబెట్టి వేలకోట్లు దోచుకున్నారని విమర్శించారు.ఎన్డీడీబీ నివేదికలో నెయ్యిలో జంతువుల కొవ్వు కలిపారని ప్రాథమికంగా నివేదిక ఇవ్వగా, తాజాగా సిట్ నివేదికలో అసలు పాలే లేకుండా కేవలం రసాయనలతో నెయ్యి తయారు చేశారని నివేదిక ఇచ్చిందన్నారు. కల్తీ జరిగిందని నివేదికలు ఇచ్చినా వైసిపి నాయకులు తప్పుడు ప్రచారం చేయడం హాస్యాస్పదమన్నారు. వైసీపీ నాయకులకు దమ్ముంటే నెయ్యి కల్తీ జరగలేదని అలిపిరి మెట్లు వద్ద వెంకన్న సాక్షిగా ప్రమాణం చేయాలని సవాల్ విసిరారు. గత వైసిపి ఐదేళ్ల పాలనలో 1.61 కోట్ల కిలోల నెయ్యి కొనుగోలు చేస్తే అందులో 60 లక్షల కిలోల నెయ్యి కల్తీ అయ్యిందన్నారు. ఈ కల్తీ నెయ్యితో 20 కోట్ల శ్రీవారి లడ్డులు తయారుచేసి వైసీపీ ప్రభుత్వం ఘోర అపచరానికి పాల్పడిందని దుయ్యబట్టారు. ఈ వాస్తవాలు బయటకు వస్తాయని భయంతోనే వైసీపీ నాయకులు ఎదురుదాడికి దిగుతూ ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. ఇప్పటికైనా వైసీపీ నాయకులు చేసిన పాపానికి ప్రాయశ్చిత్తం చేసుకుని ప్రజలకు క్షమాపణ చెప్పాలని ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ హెచ్చరించారు.

# జనసేన కార్యాలయంలో ప్రజాదర్బార్



నరసాపురం, ఫిబ్రవరి 6 (మనం న్యూస్): ప్రజల యొక్క సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పని చేస్తుందని దీనిలో భాగంగానే ప్రసాద్ దర్బార్ కార్యక్రమం నిర్వహించి ప్రజల యొక్క సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకోవడం జరుగుతుందని రాష్ట్ర ప్రభుత్వ విప్, నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ పేర్కొన్నారు. స్థానిక నియోజకవర్గ జనసేన పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ పాల్గొని నియోజకవర్గ ప్రజల నుండి సమస్యలపై వినతి పత్రాలను స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకుని అక్కడికక్కడే సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి అనేక సమస్యలకు తక్షణ పరిష్కారం అందించారు. తక్షణ పరిష్కారం సాధ్యం కాని సమస్యల పరిష్కారం కొరకు సంబంధిత ఉన్నతాధికారు లకు స్పష్టమైన సూచనలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం



భీమవరం, ఫిబ్రవరి 6 (మనం న్యూస్): ప్రజా దర్బార్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో తెదేపా నాయకులు ప్రజల నుండి వినతి పత్రాలు స్వీకరించారు. ఈకార్యక్రమం లో పాల్గొన్న ఏఎంసీ మాజీ చైర్మన్ ఇందుకూరి రామలింగ రాజు మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రజల కష్టాలు, ఇబ్బందులను తెలుసుకునేందుకే ఎమ్మెల్యేలు, ఇన్చార్జిల ద్వారా ప్రతి శుక్రవారం ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో భాగంగా ప్రజలు తమ సమస్యలపై సుమారు 80 వినతి పత్రాలు అందించారని ప్రతి ఒక్క సమస్య పరిష్కారానికి స్థానిక ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, నియోజకవర్గ ఇన్చార్జ్ తోట సీతా రామలక్ష్మి సహకారంతో సంబంధిత అధికారులతో కలిసి పరిష్కరిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గంటా త్రిమూర్తులు, పామర్తి వెంకటరామయ్య, ఉప్పులూరి చంద్రశేఖర్, ఎండి షబీనా, మద్దుల రాము, కొయ్యలగడ్డ గణపతి, కోళ్ల సీతారాం కోళ్ల నాగబాబు, గొలగాని రమేష్, చెరుకు తిరుపతిరావు, కౌరు పృధ్వీ శంకర్, సయ్యద్ నసీమా బేగం, గంధం రాధ, గుల్లంకి శ్రీలక్ష్మి, షేక్ రజియా బేగం, వలవల ఆదిలక్ష్మి, యలమంచిలి శ్రీనివాస్, విన్నకోట వినాయక్, మల్లుల పరమేశ్వరరావు, జల్లా వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

# మాకు మొదటగా కేటాయించిన ఆర్ అండ్ ఆర్ కాలనీ మాకు ఇప్పించండి



- కివ్వక గ్రామ నిర్వసితులు ఎమ్మెల్యే చిర్రి బాలరాజు కు వినతి

కుక్కునూరు, ఫిబ్రవరి 06 (మనం న్యూస్): మండలంలో గల కివ్వక గ్రామం పోలవరం నిర్వసిత మొదటి కాంటూరు లో పునరావాసం కల్పించే గ్రామం.నిర్వసిత గ్రామల ప్రజలకు జంగారెడ్డిగూడెం లొ తాడ్వాయి పంచాయతీ లో పోలవరం నిర్వసితులకు భారీ ఎత్తున అన్నీ గ్రామాలకి అక్కడ పునవరావాస కాలనీలు నిర్మిస్తున్నారు.అందులో భాగంగా కివ్వక గ్రామానికి మొదటిగా తాడ్వాయి కాలనీ లొ ప్రధాన రహదారి పక్కన ఎత్తు అయిన మెరువ సమీపంలో కేటాయించి ఆ గ్రామ వాసులకి ఇదే మీ కాలనీ అని కట్టిన గృహాలు చూపారు. దానికి కివ్వక గ్రామ నిర్వసితులు కూడా బావుంది అని ఒప్పుకొని సంతకాలు కూడా పెట్టారు. కానీ ఆ తరవాత గత వైసీపీ ప్రభుత్వం హయంలొ కివ్వక కి మొదటగా కేటాయించిన కాలనీను మార్చి వేరే గ్రామాలకి అప్పగించారు. ఈ నిర్ణయంతో కివ్వక గ్రామ నిర్వసితులు అప్పట్లోనే వ్యతిరేకం నిరసనలు చెప్పట్టిన వైసీపీ హయంలో అప్పటి వైసీపీ నాయకులు, అధికారులు వారి మోర ఆలకించలేదు.ఇప్పటికి వారి ప్రయత్నం ఆపకుండా ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలొ కూడ శుక్రవారం నాడు స్థానిక ఎమ్మెల్యే చిర్రి బాలరాజు క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే చిర్రి ని కలిసి వారు మాకు కేటాయించిన కాలనీ మాకె కావాలి అని ప్రస్తుతం ఇస్తున్న కాలనీ వద్దు అని అది పూర్తిగా ప్రధాన రహదారికి దూరంగా ఉండి, బాగా పల్లంగా ఉండటం వల్ల చినుకు పడితే అన్నీ కాలనీల నీరు అక్కడికి చేరి చెరువును తలపిస్తుంది, అని అందుకే మాకు మొదటిగా చూపిన మా కాలనీ మాకే కావాలి అని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ముందు గోడు వెళ్ళబోసుకున్నారు. సమస్య విన్న ఎమ్మెల్యే చిర్రి బాలరాజు స్పందిస్తూ మీ నిర్వసితులకు ఎంత ఇచ్చిన అది తక్కువ అవుతుంది అని మీ కివ్వాక గ్రామ నిర్వసితులకు నివాసయోగ్యమైన మంచి కాలనీ ఇప్పించటానికి కృషి చేస్తాను అని కివ్వక గ్రామ నిర్వసితులకు ఎమ్మెల్యే చిర్రి బాలరాజు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం లొ జనసేన ఉపాధ్యక్షులు మంత్రి గోపాల కృష్ణ, జనసేన నాయకులు చల్ల కోటి,టీడీపీ గ్రామ కన్వీనర్ దండబత్తుల నరసింహ రావు,గ్రామస్థులు చిలకల మల్లయ్య, కొల్లు సూర్యారావు, కానేని దుర్గయ్య, లక్షణారావు, శ్రీను, ఆవుల వెంకటేశ్వర రావు,ఇనుమల గోపరాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారం

- ఏఎంసీ చైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ



నరసాపురం, ఫిబ్రవరి 6 (మనం న్యూస్): ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుండి సమస్యలపై అందిన ప్రతి ఫిర్యాదును సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని ఏఎంసీ చైర్మన్, నరసాపురం పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు జక్కం శ్రీమన్నారాయణ పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కొరకు శుక్రవారం స్థానిక నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జక్కం శ్రీమన్నారాయణ పార్టీ నాయకులతో కలిసి పాల్గొని సమస్యలపై నియోజకవర్గ ప్రజల నుండి అందిన వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. ఈ వేదిక ద్వారా ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై ముఖ్యంగా పింఛన్లు, రేషన్ కార్డులు, రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్, తాగునీటి సమస్యలపై ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించడం జరిగిందని ప్రతి సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి తగిన పరిష్కారం చూపడం జరుగుతుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు కొప్పాడ రవీంద్రనాథ్ ఠాగూర్, సంకు భాస్కర నాయుడు, డాక్టర్ శిరిగినీడి రాజలక్ష్మి, వాతాడి ఉమామహేశ్వరరావు, బాలం ప్రతాప్, పట్నాల జగన్, తమరాపు వెంకటేశ్వరరావు, దొంగ మురళి, పొన్నాల నాగ బాబు, బొర్రా చిన్నయమ్మ, నాట్ర నరేష్ కుమార్, పడవల సత్యనారాయణ, జట్ల నాగేశ్వరావు, దేశంశెట్టి సత్య నారాయణ, చీకట్ల కనకదుర్గ, కడలి నాగేశ్వరావు, బొమ్మడి అర్జునరావు, కొప్పాడి ఉమామహేశ్వర రావు, ఎండి మౌలాలి ఖాన్, మల్లాడి మూర్తి, నల్లూరి సూర్య నారాయణ, ఆకుల భుజింగరావు, వేపూరి వాసు, హుసేన్, దొంగ శ్రీను, అలివేలు మంగతాయారు, నాగిడి రాంబాబు తదితర నాయకులు పాల్గొన్నారు

# 13 న సర్వసభ్య సమావేశం

కాట్రేనికోన, ఫిబ్రవరి 6(మనం ప్రతినిధి): కాట్రేనికోన మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం ఎంపీపీ కోలాటి సత్యవతి అధ్యక్షతన ఈ నెల 13 వ తేదీ శుక్రవారం ఉదయం పది గంటలకు ఏర్పాటు చేయడం జరిగిందని ఎంపీడీఓ బి రాజేశ్వరరావు తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్ లు, అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు. సమావేశానికి హాజరు కానీ అధికారులు వివరాలు జిల్లా కలెక్టర్ వారికి రిపోర్ట్ సమర్పించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

# రావిపాడులో 354 మంది రైతులకు పట్టాదార పాస్ పుస్తకాల పంపిణీ



పోడూరు, ఫిబ్రవరి 6 మనం న్యూస్: పోడూరు మండలం రావిపాడు గ్రామంలో గురువారం నిర్వహించిన పట్టాదార పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో తహసిల్దార్ ఎస్.ఎం. ఫాజిల్ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతుల భూహక్కులను పక్కాగా భద్రపరచడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు.రావిపాడు గ్రామంలో అర్హులైన రైతులకు మొత్తం 354 కొత్త పట్టాదార పాస్ పుస్తకాలను పంపిణీ చేయడం జరిగిందని ఆయన వెల్లడించారు. పట్టాదార పాస్ పుస్తకాల ద్వారా రైతులు భూ హక్కుల నమోదు, పంట రుణాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి వంటి అనేక ప్రయోజనాలు పొందవచ్చని తాసిల్దార్ వివరించారు.భూ సమస్యల పరిష్కారంలో పారదర్శకతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, రైతులకు ఇబ్బందులు కలగకుండా రెవెన్యూ వ్యవస్థ నిరంతరం కృషి చేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ పెనుమత్స రామభద్ర రాజు,కూటమి నాయకులు,రావిపాడు సర్పంచ్ పెనుమత్స విజయలక్ష్మి, వద్దిపర్రు ఎంపీటీసీ విప్పర్తి శారద చిట్టిబాబు,రావిపాడు కూటమి నాయకులు, టిడిపి పోడూరు మండలం ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీటీసీ శీలం వాసు,ఆర్ఐ, వీఆర్వోలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఇకపై క్వాంటం వేగంతో అమరావతి అభివృద్ధికి నాంది

- నవ్యాంధ్ర యువతకు సరికొత్త టెక్నాలజీ భవిష్యత్
- సీఎం చంద్రబాబు నాయకత్వంలో క్వాంటం వ్యాలీ శంకుస్థాపనతో చరిత్రాత్మక ఘట్టం



అమరావతి, ఫిబ్రవరి 6(మనంన్యూస్): అమరావతి రాజధానిగా ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి క్వాంటం వేగంతో ముందుకు సాగుతోందని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి దూరదృష్టి గల నాయకత్వంలో అమరావతి కేవలం పరిపాలనా రాజధానిగా కాకుండా, ప్రపంచ స్థాయి టెక్నాలజీ హబ్గా రూపుదిద్దుకుంటోందన్నారు. రేపు, 7 ఫిబ్రవరి 2026న క్వాంటం వ్యాలీకి శంకుస్థాపన జరగడం రాష్ట్ర చరిత్రలో కీలక మైలురాయిగా నిలుస్తుందని తెలిపారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా క్వాంటం టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, హైఎండ్ రీసెర్చ్ రంగాల్లో ఆంధ్రప్రదేశ్ దేశానికే మార్గదర్శకంగా నిలవబోతుందన్నారు. నవ్యాంధ్ర యువతకు ప్రపంచ స్థాయి అవకాశాలు, ఉద్యోగాలు, పరిశోధన వేదికలు లభించేలా ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తోందని మంత్రి తెలిపారు. క్వాంటం అమరావతి గ్లోబల్ ఆంధ్రప్రదేశ్ అన్న నినాదంతో రాష్ట్రాన్ని భవిష్యత్తు సాంకేతికతకు కేంద్రంగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి స్పష్టం చేశారు.

# ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు



- రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా

పెద్దపల్లి, ఫిబ్రవరి 6 (మనం ప్రతినిధి): మున్సిపల్ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. శుక్రవారం పెద్దపల్లి మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పెద్దపల్లి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, శాంతినగర్లోని పోలింగ్ కేంద్రాల పరిసరాల్లో చేపట్టిన భద్రతా ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. అనంతరం ఎస్సైలు, సీఐలు,ఏసీపీలు, డీసీపీతో సమావేశమై ఎన్నికల నిర్వహణపై చర్చించి అవసరమైన ఆదేశాలు,సూచనలు జారీ చేశారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికలు అత్యంత కీలకమైనవని,ప్రతి ఓటరు ఎలాంటి భయం,ఒత్తిడి లేదా ప్రలోభాలకు లోనుకాకుండా స్వేచ్ఛగా తన ఓటు హక్కును వినియోగించుకునేలా పోలీస్ యంత్రాంగం పూర్తి స్థాయిలో భద్రతా చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద పటిష్టమైన భద్రత ఏర్పాటు చేయాలని, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో కట్టుదిట్టమైన బందోబస్తు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.ప్రజలు శాంతియుత వాతావరణంలో నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పోలీసులు అన్ని విధాలుగా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి, పెద్దపల్లి ఏసీపీ జి.కష్ణ, పెద్దపల్లి సీఐ ప్రవీణ్ కుమార్,ఎస్సై లక్ష్మణ్ రావు పాల్గొన్నారు.



# తపాల్పూర్లో దొంగల హల్ చల్

జన్నారం, ఫిబ్రవరి 6(మనం న్యూస్): జన్నారం మండలం లోని తపాల్ గ్రామంలో గురువారం దొంగలు హల్ చల్ చేశారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తపాల్ పూర్ గ్రామానికి చెందిన రామటెంకీ లావణ్య ఆమె భర్త రాజన్న కూతురు ఆరాధ్య తో కలిసి రాత్రి నిద్ర పోతున్న సమయంలో సుమారు మూడు నుంచి నాలుగు గంటల ప్రాంతంలో ఎవ్వరో కొంతమంది తమ ఇంటి ముందు వున్న రేకులను గట్టిగా కొట్టడంతో శబ్దం విని తలుపులు తీసి బయటకు వెళ్లటంతోనే ముకాలకు మాస్క లు పెట్టుకొని కళ్ళలో కారం కొట్టి మెడలో ఉన్న రెండు తులాల బంగారు గొలుసు లాక్కొని పారిపోయారని జరిగిందని బాధితురాలి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జన్నారం ఎస్ఐ గొల్లపల్లి అనూష తెలిపారు.

# మహాశివరాత్రి ఏర్పాట్లు పరిశీలన చేసిన జిల్లా ఎస్పీ



కాట్రేనికోన, ఫిబ్రవరి 6(మనం ప్రతినిధి): మండల పరిధిలో ని బ్రహ్మ సమేధ్యం పంచాయతీ బ్రహ్మ సమేధ్యం గ్రామం నందు మహా శివరాత్రి సందర్భంగా ఈ నెల 15 న జరగనున్న తీర్థ మహోత్సవం సందర్భంగా తీసుకోవాల్సిన ముందు జాగ్రత్త చర్యలో భాగంగా శుక్రవారం డా. బిఆర్ అంబేద్కర్ కొనసీమ జిల్లా ఎస్పీ ముఖేష్ కుమార్ మీనా పరిశీలించారు. బలుసు తిప్ప నుండి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బోటులో ప్రయాణించి మగసాని తిప్ప చేరుకొని తీర్థం జరిగే ప్రదేశాన్ని పరిశీలన చేశారు. ఈ సందర్భంగా స్థానిక పరిస్థితి ని ఎస్ ఐ అవినాష్ తెలియజేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, బొట్లు పై ప్రయాణం చేయు సందర్భంలో తప్పనిసరిగా లైఫ్ జాకెట్లు ధరించాలని, సామర్థ్యం మేరకు మాత్రమే ప్రయాణికులను చేరవేయాలని ఆ విధంగా తగిన చర్యలు తీసుకోవాని సూచనలు చేశారు.కార్యక్రమం లో అమలాపురం డి.ఎస్.పి టి ఎస్ ఆర్ కే ప్రసాద్, ముమ్మిడివరం సిఐ మోహన్ కుమార్, తాసిల్దార్ రవి కిరణ్, ఎంపీడీవో బి రాజేశ్వరరావు, స్థానిక ఎస్త్రై అవినాష్ పోలీస్ సిబ్బందిరెవిన్యూ సిబ్బంది స్థానిక పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# 18వ వార్డులో బిజెపి అభ్యర్థిని గెలిపించాలి



బెల్లంపల్లి, ఫిబ్రవరి 6, (మనం న్యూస్): బెల్లంపల్లి పట్టణంలో 18వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి రచ్చ స్వప్న గెలవాలని బిజెపి జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ అన్నారు. శుక్రవారం గడపగడపకి ప్రచారం చేయడం జరిగింది ఈ ప్రచారానికి జిల్లా ఎలక్షన్ ఇన్చార్జ్ కన్నెబోయిన ఓదేలు, మాజీ ఎమ్మెల్యే అము రాజుల శ్రీదేవి, బెల్లంపల్లి ఎలక్షన్ ఇంచార్జ్ రావుల రాజేందర్ గారు ఎలక్షన్ కన్వీనర్ కేశవ రెడ్డి, బెల్లంపల్లి పట్టణ అధ్యక్షులు దార కళ్యాణి, జిల్లా కార్యదర్శి రాచర్ల సంతోష్, 18వ వార్డులో స్వప్న అధిక మెజార్టీతో ఘనవిజయం సాధించాలని అభ్యర్థించడం జరిగింది.

# జిల్లాకే తలమానికం పోలీస్ క్రీడా మైదానం

## గుట్టను గ్రౌండ్ గా మార్చిన సిఐ అభినందనీయులు

## యువత క్రీడలవైపు దృష్టి సారించాలి

## రెండవ సిఎం కప్ క్రీడా పోటీలను ప్రారంబించిన కలెక్టర్

## పాల్గొన్న జిల్లా ఎస్ పి, ఏఎస్పి





**చర్ల, ఫిబ్రవరి 6 (మనం న్యూస్)**: చర్ల మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని లెనిన్ కాలనీ గ్రామ సమీపంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన పోలీస్ క్రీడా మైదానం జిల్లాకే తలమానికమని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏడున్నర ఎకరాల విస్తీర్ణంలో 400 మీటర్ల ట్రాక్ కలిగిన నూతన క్రీడా మైదానంలో శుక్రవారం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ తో కలిసి రెండవ నియోజకవర్గ స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలను జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ప్రారంభించారు. ముందుగా నూతనంగా నిర్మించిన పోలీస్ గ్రౌండ్ మైదానాన్ని ఎస్పీతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. అనంతరం ఫుట్బాల్, వాలీబాల్ క్రీడా పోటీలను ప్రారంభించారు. కొద్దిసేపు క్రీడాకారులతో కలిసి వాలీబాల్ పాడారు. అనంతరం జిల్లా క్రీడల అధికారి పరందామరెడ్డి అధ్యక్షతన జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో క్రీడాకారులు, విద్యార్థులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడారు. పనిచేయాలన్న తపన ఉంటే అసాధ్యాన్ని సుసాధ్యం చేయవచ్చని చర్ల క్రీడా మైదానం నిరూపించిందని పేర్కొన్నారు. ప్రజలకు ఉపయోగపడే అద్భుతమైన మైదానాన్ని నిర్మించిన ఘణత సీఐ రాజువర్మ ఎస్ఐ లు నర్సిరెడ్డి, కేశవ్ లదేనని వారు అభినందనీయులని ప్రశంసించారు. జిల్లాలో ఎక్కడా లేని విధంగా 400 మీటర్ల ట్రాక్ తో కూడిన మైదానం నిర్మించడం గర్వకారణమని పేర్కొన్నారు. చర్ల సిఐ లాగా జిల్లాలో ఇంజనీరింగ్ అది అధికారులు పనిచేస్తే అద్భుతాలు సృష్టించవచ్చని పేర్కొన్నారు. పంచాయతీరాజ్, ఐటీడీఏ, ఆర్ అండ్ బి తదితర ఇంజనీరింగ్ విభాగాల ఇంజనీర్లు సీఐ నుండి నేర్చుకోవాల్సిన విషయం ఎంతో ఉందన్నారు. ఆయన నిస్వార్థంగా పనిచేసే నాణ్యమైన క్రీడా మైదానాన్ని నిర్మించారని, ఈ గౌరవం ఆయనకే దక్కుతుందని పేర్కొన్నారు. క్రీడా మైదానాన్ని యువతీ, యువకులు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అవకాశం ఉన్నప్పుడల్లా ఉదయం, సాయంత్రం వేళల్లో మైదానానికి వచ్చి ఆటలాడుకోవాలని సూచించారు. ప్రతి మండలం నుండి అన్ని క్రీడా అంశాలలో ఒక ఉత్తమ టీం ను తయారు చేయాలని, ఇందులో వ్యాయామ ఉపాధ్యాయులు ప్రముఖ పాత్ర పోషించాలని కోరారు. తనను మైదానం ఎంతో ఆకట్టుకున్నదని, ఇకపై చర్లకు వచ్చిన ప్రతిసారి గ్రౌండ్ ను సందర్శించి రన్నింగ్ ప్రాక్టీస్ చేస్తానని పేర్కొన్నారు. మైదానంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను చేపడతామని వెల్లడించారు.

ముందుగా క్రీడాకారులకు ఉపయోగపడేలా టాయిలెట్స్, నీటి వసతి, విద్యుత్ దీపాలను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. అనంతరం విడతలవారీగా మైదానాన్ని అభివృద్ధి పరుస్తామని తెలిపారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ మాట్లాడుతూ చర్లకు వస్తే తన సొంత ఇంటికి వచ్చినట్లు ఉంటుందని, భద్రాచలం ఏఎస్పీగా పనిచేసిన సందర్భంలో ఈ మండలంతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని తెలిపారు. యువత చెడు వ్యసనాలు, మావోయిస్ట్ ల వైప దృష్టి మరల్చకుండా వారి మనసును క్రీడల వైపు మల్లించేందుకు ఈ మైదానాన్ని నిర్మించినట్లు పేర్కొన్నారు. సిఐ రాజు వర్మ గుట్టను మైదానంగా మలచిన తీరు అద్భుతమని, ఇంతటి మహత్తర కార్యక్రమం చేపట్టిన ఘనత ఆయనకే దక్కుతుందని ప్రశంసించారు. కాంట్రాక్టర్లు సంతోష్, శరత్ లు అగ్రిమెంట్ కాకుండా, ఒక రూపాయి కూడా తీసుకోకుండా గ్రౌండ్ నిర్మాణాన్ని పూర్తి చేయడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. యువతీ, యువకులు చెడు అలవాట్లకు ఆకర్షితులు కాకుండా చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించి రాష్ట్ర జాతీయస్థాయిలో ప్రతిభ కనపరచడం ద్వారా మండలానికి పేరు ప్రతిష్టలను తీసుకురావాలని ఆకాంక్షించారు. భద్రాచలం ఏ ఎస్ వికే సింగ్ మాట్లాడుతూ క్రీడాకారులు ఇటువంటి అవకాశాన్ని సద్వినియోగం పరుచుకోవాలని, తద్వారా జాతీయస్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. సిఐ రాజు వర్మ మాట్లాడుతూ దుమ్ముగూడెం మండలం నుండి ఇద్దరు క్రీడాకారులు జాతీయస్థాయి క్రీడా పోటీలలో పాల్గొనడాన్ని స్ఫూర్తిగా తీసుకొని మారుమూల ప్రాంతాల్లోని యువతకు క్రీడా ప్రాంగణం ఉండాలని, తద్వారా చెడు మార్గం వైపు పయనించకుండా చూడాలన్న ఉద్దేశంతో ఇక్కడ నిర్మాణాన్ని చేపట్టినట్లు వెల్లడించారు.

గుట్టను గ్రౌండ్ గా మార్చే సందర్భంలో అనేక మంది ఇది సాధ్యమా అని ప్రశ్నించారని అన్నారు. అసాధ్యాన్ని సుసాధ్యం చేసి చూపించామని సభికుల హర్షద్వానాల నడుమ వెల్లడించారు. క్రీడాకారులు గెలుపు ఓటములను క్రీడా స్ఫూర్తితో తీసుకోవాలని, అటువంటి వారు జీవితంలో రాణిస్తారని పేర్కొన్నారు. పరీక్షలలో ఫెయిల్ అయినంత మాత్రాన ఆత్మహత్యలకు పాల్పడవద్దని అన్నారు. ఆటలపై దృష్టి పెడితే మానసిన దృఢత్వం లభిస్తుందని తద్వారా మనోస్థైర్యం పెరిగుతుందని తెలిపారు. స్థానికులకు కలకాలం ఉపయోగపడేలా మైదానాన్ని తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఈ క్రీడా ప్రాంగణాన్ని నిర్మించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా క్రీడా మైదానానికి సహకరించిన కాంట్రాక్టర్లు సంతోష్, శ్రీకాంత్, స్థానికులు ధనికొండ వెంకటేశ్వరరావు (చిన్నారి), మల్లాది శ్రీరామ్ మూర్తి, వేణు లను సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి కనపర్తి ఈదయ్య, మండల విద్యాశాఖ అధికారి పరిటాల వెంకటరమణ, మేజర్ పంచాయతీ సర్పంచ్ పూజారి సామ్రాజ్యం, అధికారులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు, స్థానికులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ సదుపాయం




- జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్
- 07, 08 తేదీల్లో ఫెసిలిటేషన్ సెంటర్లలో ఓటు హక్కు వినియోగం

**భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 06 (మనంప్రతినిధి)**: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అశ్వారావుపేట, ఇల్లందు మరియు కొత్తగూడెం మున్సిపాలిటీల పరిధిలో నిర్వహించనున్న మున్సిపల్ ఎన్నికల సందర్భంగా, ఎన్నికల విధుల్లో నియమితులైన అధికారులు, ఉద్యోగులు, పోలింగ్ సిబ్బంది మరియు సహాయక సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునే సదుపాయం కల్పిస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి మరియు జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు. ఎన్నికల విధుల్లో ఉండటం వలన పోలింగ్ రోజున తమ స్వంత పోలింగ్ స్టేషన్లో ఓటు వేయలేని సిబ్బంది ప్రజాస్వామ్య హక్కును కోల్పోకుండా ఉండేందుకు, కండక్ట్ ఆఫ్ ఎలక్షన్ రూల్స్ 1961 లోని రూల్ 27 ఎ, రూల్ 28 మరియు, రిప్రజెంటేషన్ ఆఫ్ ది పీపుల్ యాక్ట్ 1951 లోని సెక్షన్ 60 ప్రకారం ఈ పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కల్పిస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ మేరకు అశ్వారావుపేట, ఇల్లందు మరియు కొత్తగూడెం మున్సిపాలిటీలలో పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఓటు హక్కు కలిగిన ఎన్నికల సిబ్బంది కొత్తగూడెం మరియు పాల్వంచ మున్సిపాలిటీ కార్యాలయాలలో, ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలోని ఓటర్లు ఇల్లందు మున్సిపాలిటీ కార్యాలయంలో, అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలో ఓటు హక్కు కలిగిన వారు అశ్వారావుపేట మున్సిపాలిటీ కార్యాలయంలో ఈ నెల 07 మరియు 08 తేదీల్లో ఉదయం 10.00 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకో వచ్చని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ఇందుకోసం ఎన్నికల విధుల ఉత్తర్వు ప్రతిలిపి, ఉద్యోగ గుర్తింపు కార్డు, ఓటర్ గుర్తింపు కార్డు (ఎపిక్) మరియు ఒక పాస్పోర్ట్ సైజు ఫోటో తప్పనిసరిగా వెంట తీసుకురావాలని సూచించారు. ఈ మొత్తం ప్రక్రియ పూర్తిగా గోప్యతతో, ఎన్నికల నిబంధనల ప్రకారం నిర్వహించబడుతు ందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఎన్నికల విధుల్లో ఉన్న ప్రతి అధికారి మరియు సిబ్బంది తమ ప్రజాస్వామ్య హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని, ఇందుకు పోస్టల్ బ్యాలెట్ సదుపాయం ప్రత్యేకంగా ఏర్పాటు చేయబడినదని జిల్లా ఎన్నికల అధికారి విజ్ఞప్తి చేశారు. నిర్ణీత తేదీల్లో అందరూ వ్యక్తిగతంగా హాజరై తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.



# మహారాష్ట్రలో ఎన్ కౌంటర్

- ముగ్గురు మావోయిస్టుల మృతి
- సి 60 జవాన్ మృతి, మరొకరికి గాయాలు

**చర్ల, ఫిబ్రవరి 6 (మనం న్యూస్)** : మహారాష్ట్ర లోని గడ్చిరోలీ జిల్లాలో భద్రతా బలగాలు మావోయిస్టుల మధ్య గురువారం రాత్రి జరిగిన ఎదురుకాల్పులలో ముగ్గురు మావోయిస్టులు మృతిచెందగా సి 60 జవాన్ దీపక్ చిన్న మాండవి మృతిచెందారు. మరొక జనాన్ జోగా మడివికి తీవ్రగాయాలయ్యాయి. మావోయిస్టుల కొరకు గడ్చిరోలి జిల్లా లహేరి తాలుకా దమ్రాంచ అటవీప్రాంతంలో ల సి 60 కమాండోలు గాలింపు చేపడుతుండగా మావోయిస్టులు తారసపడటంతో ఇరువైపులా కాల్పులు చోటుచేసుకున్నాయి. ఎన్ కౌంటర్ లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందగా వారిలో ఒక మహిళ ఉన్నారు. వీరిని గుర్తించాల్సి ఉంది. ఎన్ కౌంటర్ లో జవాన్ దీపక్ చిన్న మాండవి, జోగా మాండవిలు గాయపడ్డారు. వీరిని చికిత్స కొరకు హెలికాప్టర్ ద్వారా భమ్రాగడ్ లోని ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. వీరిలో చికిత్స పొందుతూ దీపక్ మృతి చెందగా జోగాను మెరుగైన చికిత్స కొరకు గడ్చిరోలీ జిల్లా వైద్యశాలకు తరలించగా ప్రస్తుతం కోలుకుటుం న్నారు. సంఘటనా ప్రాంతం నుండి భద్రతా బలగాలు ఏకే 47, ఎస్ ఎల్ ఆర్ లను స్వాదీన పరుచుకున్నారు.

# పోలింగ్ అధికారులు పూర్తి అవగాహనతో విధులు నిర్వర్తించాలి

## స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన



**భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 06 (మనంప్రతినిధి)**: జిల్లాలో నిర్వహించనున్న మున్సిపల్ ఎన్నికలను ఎటువంటి లోటుపాట్లకు తావు లేకుండా పూర్తిస్థాయిలో పకడ్బందీగా నిర్వహించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన తెలిపారు. శుక్రవారం పాల్వంచలోని అనుబోస్ కళాశాలలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు నియమితులైన పిఓ లు, ఏపీవోలు కు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల ప్రక్రియలో చిన్నపాటి తప్పిదం కూడా పెద్ద సమస్యలకు దారితీయవచ్చని అన్నారు. అందువల్ల ప్రతి పోలింగ్ అధికారి పూర్తి అవగాహనతో, బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. పోలింగ్ ప్రారంభం నుంచి ముగింపు వరకు, అలాగే ఓట్ల లెక్కింపు వరకు ప్రతి దశను రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన నిబంధనలు, మార్గదర్శకాల ప్రకారం కచ్చితంగా అమలు చేయాలని తెలిపారు. ఓటింగ్ సామగ్రి నిర్వహణ, పోలింగ్ కేంద్రాల్లో శాంతిభద్రతలు, ఓటర్లకు కల్పించాల్సిన సౌకర్యాలు వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఎన్నికల విధుల్లో పారదర్శకత, నిష్పక్షపాతత్వం అత్యంత కీలకమని , ఎన్నికల కోడ్ను కఠినంగా పాటించాలని, ఎటువంటి అక్రమాలు లేదా అవకతవకలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. శిక్షణ కార్యక్రమంలో వివరించిన అంశాలను పూర్తిగా అవగాహన చేసుకుని క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని ఆమె తెలిపారు.

శిక్షణ సందర్భంగా పోలింగ్ అధికారులు (పీ.ఓలు), అసిస్టెంట్ పోలింగ్ అధికారులు (ఏ.పి.ఓలు) వ్యక్తం చేసిన సందేహాలను జిల్లా ఎన్నికల మాస్టర్ ట్రైనర్ పూసపాటి సాయి కృష్ణ సవివరంగా నివృత్తి చేసి, ఎన్నికల నిర్వహణపై స్పష్టత కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల శిక్షణ నోడల్ అధికారి శ్రీరామ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# కొత్తగూడెంలో ఆర్ఎల్డీ సమావేశం

## ఫుట్‌బాల్ గుర్తుకే ఓటు వేయాలని నేతల విజ్ఞప్తి

## పాల్గొన్న ఎక్స్ ఎమ్మెల్సీ ఆర్ ఎల్ డి పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కపిలవాయి దిలీప్ కుమార్



**చుంచుపల్లి, ఫిబ్రవరి 6 (మనం న్యూస్)**: కొత్తగూడెం లో రాష్ట్రీయ లోక్ దళ్ కార్యాలయం లో, దిలీప్ కుమార్ కపిలవాయి ఎక్స్ ఎంఎల్సీ రాష్ట్రీయ లోక్ దళ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మరియు కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి, కట్టా సతీష్ జిల్లా అధ్యక్షులు ఇతర రాష్ట్రీయ లోక్ దళ్ నేతలు స్థానిక చుంచుపల్లి లో గల ఆర్ఎల్డీ పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా దిలీప్ కుమార్ ఎక్స్ ఎమ్మెల్సీ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రీయ లోక్ దళ్ 15 స్థానాలలో స్థానిక సంస్థలలో పోటీ చేస్తోందని, ఆర్.ఎల్.డీ కి ఎన్నికల చిహ్నంగా ఫుట్బాల్ కేటాయించబడిందని తెలిపారు. ముఖ్యంగా కొత్తగూడెంలో ముగ్గురు అభ్యర్థులు బరి లో ఉన్నారు అని ఇక్కడి ప్రజలు ఫుట్బాల్ గుర్తుకే ఓటు వేసి ఆర్.ఎల్.డి అభ్యర్థులను గెలిపించవలసిందిగా విజ్ఞప్తి చేశారు. ఇంకా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతిలో బి ఆర్ ఎస్ను మించి పోయిందని, శ్రీ రేవంత్ రెడ్డి లాంటి అసమర్ధ ముఖ్యమంత్రిని తన సుదీర్ఘ అధికార మరియు రాజకీయ జీవితంలో ఎప్పుడూ చూడలేదన్నారు. ప్రభుత్వం దెగ్గర సక్షేమ పథకాలకు ఒక్క రూపాయి లేదని వచ్చే డబ్బు అంత స్థానిక సంస్థలకు కేంద్ర ప్రభుత్వానిదే అని ఈ స్థానిక ఎన్నికలలో ప్రజలు రేవంత్ రెడ్డి అహంకారంపై దెబ్బకొట్టాల్సిన అవసరం ఉందని చెప్పారు. సింగరేణి సంస్థను మూసి వేయాలని తద్వారా పర్యావరణం అడవులు వన్య ప్రాణులు కాపాడబడతాయని లేకపోతే కొత్తగూడెం మణుగూరు భద్రాచలం రాజస్థాన్ ఎడారి లాగా మారతాయి అని అన్నారు. సంస్థను నడపదలుచుకుంటే 51% వాటా సింగరేణి కార్మికులకు ఇవ్వాలని మిగిలిన 49% కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వాటా తీసుకోవాలని డిమాండ్ చేశారు. కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి, ఆర్ ఎల్డీ ఉపాధ్యకులు మాట్లాడుతూ బి ఆర్ ఎస్ తరువాత కాంగ్రెస్ హయాంలో విద్య, వైద్య, ఉపాధి రంగాలు దారుణంగా దెబ్బతిన్నాయని, కొత్తగూడెం మణుగూరు భద్రాచలం లాంటి ట్రైబల్ ఏరియా లో అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా కేటాయింపులు లేవని, బొగ్గు వాటాల పంచాయితీలతో మంత్రులు బహిరంగంగా తన్నుకుంటున్నారని ఈ సంధు2) అభ్వరుడి('మంచి - ఈశసంపల్లి మౌనిక (5 ఎన్ ఓ పి ఆర్ ఓ టి ఓ)సంధర్భంగా ఈ సమావేశంలో ఆర్ ఎల్డీ యువత అధ్యకుడు రారీ కువ 3 రాజ్ కుమార్ రెడ్డి, మీడియా , మీడియా కోఆర్డినేటర్ గౌర బీరప్ప, ఆర్ ఎల్డీ రాష్ట్ర ట్రెజరర్ గిరి కుండే, కట్టా సతీష్ ఆర్ ఎల్డీ జిల్లా అధ్యక్షులు, ప్రసాద్ యాగంపూడి స్టేట్ జనరల్ సెక్రటరీ, తదితరులు పాల్గొన్నారు. మరియు సందర్భంగా మాట్లాడుతూ స్థానిక కొత్తగూడెం కార్పొరేషన్ ఎన్నికల్లో ఆర్ఎల్డీ పార్టీ తరపున పోటీ చేస్తున్న అభ్యర్థులు ఈసంపల్లి మౌనిక 56 వ వార్డు మరియు పింజారా బ్రహ్మానందరావు 42వ వార్డు లో ఆర్ ఎల్ డి పార్టీ తరపున పోటీ చేస్తున్నారని ఫుట్బాల్ గుర్తుని కేటాయించడం జరిగిందని స్థానిక కొత్తగూడెం ప్రజలు ఈ రెండు డివిజన్లో పోటీ చేస్తున్న కార్పొరేటర్ లను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని సమావేశంలో తెలిపారు.

# మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో మద్యం దుకాణాలు బంద్

- పోలీస్ కమిషనర్

**ఖమ్మం, ఫిబ్రవరి 6(మనం న్యూస్)**: ఫిబ్రవరి11 తేదీన జరిగే మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఖమ్మం కమిషనరేట్ పరిధిలోని ఆయా మున్సిపాలిటీ ప్రాంతాలలో మద్యం విక్రయాలను నిలిపివేయాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. ఫిబ్రవరి 11న జరిగే ఎన్నికలకు ఫిబ్రవరి 9 వ తేదీన సాయంత్రం 5:00 గంటల నుండి ఫిబ్రవరి 11 న ఎన్నికలు ముగిసే వరకు మద్యం విక్రయాలను నిలిపివేయాలని ఆదేశించారు. అదేవిదంగా ఫిబ్రవరి 13 న జరిగే ఓట్ల లెక్కింపు సందర్భంగా ఉదయం 8:00 గంటల నుండి ఓట్ల లెక్కింపు పూర్తి అయ్యేవరకు ఖమ్మం జిల్లా పరిధిలోని ఏదులాపురం, మధిర, వైరా, సత్తుపల్లి, కల్లూరు మునిసిపాలిటీ కౌంటింగ్ సెంటర్ పరిధిలో వైన్ షాపులు, బార్లు, మద్యం సరఫరా చేసే రెస్టారెంట్లు, మూసివేయాలని ఆదేశించారు. ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకుండా పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా ముందస్తు చర్యలలో భాగంగా మూసివేయాలని సూచించారు. నిబంధనలు అతిక్రమించి ఎవరైనా మద్యం దుకాణాలు ఓపెన్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నిబంధనలు పాటిస్తూ ప్రశాంతంగా పోలింగ్ జరిగేలా సహకరించాలని కోరారు.

# ప్రజా సేవకుడు...తలుగు అనిల్

## ప్యూన్ బస్తీ అభివృద్ధికి కేరాఫ్ తలుగు అనిల్

## సమస్య ఉందంటే చాలు వెంటనే పరిష్కారం

## చేసే అభివృద్ధిని తట్టుకోలేక...పలువురు బురదజల్లే ప్రయత్నం



**కొత్తగూడెం టౌన్, ఫిబ్రవరి 06 (మనం న్యూస్ )**: ఎన్నికల్లో ఇండిపెండెంట్ గా పోటీచేసి గెలిసి కౌన్సిలర్ అనే పదవికి పూర్తిగా న్యాయం చేసాడనే చెప్పుకోవచ్చు ప్యూన్ బస్తీ ప్రజల సమస్యల పై నిరంతరం కృషి చేస్తూ ఆయన ప్రత్యార్థులు ఎన్నో అవమానాలను సైతం లెక్కచేయకుండా ప్రజా శ్రేయస్సు కోసం ప్రజల సమస్యలను పరిస్కరిస్తున్న 'ప్రజా సేవకుడై' ప్రజల వెంటనడుస్తు ప్యూన్ బస్తీ ప్రజల సమస్యల పై పోరాటాలు చేసి ప్రజలకు అండగా నిలుస్తున్న తాజ మాజీ కౌన్సిలర్ తలుగు అనిల్...

కొత్తగూడెం మున్సిపాలిటీ కార్పొరేషన్ పరిధిలోని 13వ డివిజన్ ప్యూన్ బస్తీని అభివృద్ధికి కేరాఫ్ గ మారుస్తున్న మాజీ కౌన్సిలర్ తలుగు అనిల్ అని బస్తీ ప్రజలు తెలిపారు. బస్తీలో ఉంటున్న కుటుంబాలకు ఏదైనా సమస్య ఉందంటే వెంటనే పరిష్కరిస్తూ ఒక పెద్ద అన్నలా ధైర్యం చెప్తున్నాడని బస్తీ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చేసే అభివృద్ధి తట్టుకోలేక అనిల్ ప్రత్యార్థుల్లో కొంతమంది ఆయను టార్గెట్ చేసి బురదచాల్లే ప్రయత్నం చేస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బస్తీలో అనిల్ చేసే అభివృద్ధి కార్యక్రమాలు ఇలా ఉన్నాయి. బస్తీలో నెల రోజులుగా కిన్నెరసాని పంపు రావడం లేదని ఎవరికి చెప్పిన పట్టించుకోవడంతో బస్తి ప్రజలు నీళ్ల సమస్య పరిష్కారం కోసం మాజీ కౌన్సిలర్ అనిల్ దృష్టికి తీసుకు వెళ్లారు.

ఆయన వెంటనే స్పందించి సమస్యను మున్సిపల్ అధికారుల దృష్టిలో తీసుకువెళ్లి మున్సిపల్ సిబ్బంది సహకారం సాయిబాబా ఆలయం ముందున్న కిన్నెరసాని పైప్ లైన్ లో పేరుకుపోయిన చెత్తను తొలగించి బస్తీ ప్రజల సమస్య పరిష్కరించాడని అక్కడి ప్రజలు హర్షం వ్యక్తం చేసారు. జీవో నెంబర్ 76 ద్వారా 204 అర్హులైన కుటుంబాలకు ఇళ్ల పట్టాలు ఇప్పించి వాళ్ళ గుండెల్లో దేవుడిగా నిలిచాడు. రూ 70లక్షలతో వార్డు లో కొత్త డ్రైన్ లు నిర్మించి డ్రైనేజి సమస్యలు లేకుండా చేసారు. రూ 1.40 లక్షల తో బస్తీలో మట్టిరోడ్లు లేకుండా నూతన సిమెంట్ రోడ్లను నిర్మించి ప్రజల నమ్మకాన్ని నిలబెట్టాడు. 25 నూతన కరెంటు పోల్లు స్థాపించి బస్తీలో వెలుగులు నింపారు. సమాజంలో జరుగుతున్న దొంగతనాలను దృష్టిలో పెట్టుకొని ముందు జాగ్రత్తగా బస్తీ కూడలిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించి ఇటువంటి ప్రమాదపు ఘటనలు జరగకుండా భద్రతను నెలకొల్పాడు.

### మా అమ్మకి ఒక్క అవకాశం కల్పించండి : ఎన్నికల ప్రచారంలో మాజీ కౌన్సిలర్ అనిల్

పార్టీలు మోసం చేసి టికెట్ రాకుండా చాలా జాగ్రత్తగా తోడేళ్ల వ్యూహం రచించారు మన 13వ డివిజన్ అందరికీ సేవ చేయడానికి మరోసారి స్వతంత్ర అభ్యర్థిని గా మా అమ్మ తలుగు శాంతను స్వాతంత్ర అభ్యర్థిగా మీ ముందుకు తీసుకొస్తున్నాను నేను చేసిన ఈ ఆరు సంవత్సరాల అభివృద్ధికి సంక్షేమాని డివిజన్ ప్రజలు గుర్తించి పార్టీతో సంబంధం లేకుండా మరోసారి భారీ మెజార్టీతో ఉంగరం గుర్తుకే ఓటు వేసిఅత్యధిక మెజార్టీతో గెలిపించి మిగతా పార్టీ లకు తగిన గుణపాఠం చెప్తారని ఆశిస్తున్నాను. ప్రచారంలో తలగు అనిల్ మాట్లాడుతూ పార్టీలను చూసి ఓటు వేయడం కాదు కానీ అభివృద్ధి ఎవరి ద్వారా జరుగుతుందో వారికే అందలమెక్కించాలని అన్నారు. ఏ పార్టీ మద్దతు లేకుండానే ఓటర్ల తరుపున ఆదరిస్తారని నమ్మకంతోనే బరిలో ఉన్నానని ప్రజలు స్వాతంత్ర అభ్యర్థి గా నిలుచున్న తలుగు శాంత (సీరియల్ నెంబర్ 06) ఉంగరం గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీని ఇచ్చి గెలిపించాల్సిందిగా అనిల్ అభ్యర్థించారు.13వ డివిజన్ మున్సిపాలిటీ లో మోడల్ గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రచార కార్యక్రమంలో స్వాతంత్ర ప్రచార అభ్యర్థితో పాటు స్థానిక మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం నారా చంద్రబాబును కలిసిన జిల్లా గ్రంథాలయ చైర్మన్



తుగ్గలి ఫిబ్రవరి 06(మనం న్యూస్ ): కర్నూలు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ను మర్యాదపూర్వకంగా కలిశారు.ఎమ్మిగనూరు మండలం కలుగొట్లలో జరుగుతున్న మీ భూమి -మీ హక్కు కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన అయన ను హెలిప్యాడ్ వద్దకు చేరుకొని పుష్పగుచ్చం అందించి స్వాగతం పలికారు.జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవి నియమించినందుకు సీఎంకు కృతజ్ఞతలు తెలిపినట్లు అయన పేర్కొన్నారు.

# పాస్పుస్తకం పాస్ పోర్టుతో సమానం

- రాష్ట్ర మంత్రి టీజీ భరత్



కర్నూలు ఫిబ్రవరి 06మనం న్యూస్: రైతులకు అందిస్తున్న పట్టాదారు పాసు పుస్తకం పాస్ పోర్టుతో సమానమని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని కలుగొట్ల గ్రామంలో మీభూమి.. మీహక్కు పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ముందుగా హెలిప్యాడ్ వద్ద పార్టీ నాయకులతో కలిసి ఆయన సీఎంకు ఘన స్వాగతం పలికారు. అనంతరం సభా ప్రాంగణం వద్ద ఏర్పాటుచేసిన స్టాల్స్ను పరిశీలించారు. సభలో మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ మీ భూమి మీ హక్కు అని గుర్తించారు కాబట్టే సీఎం చంద్రబాబు నాయుడు పాస్ పుస్తకాలు అందిస్తున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వం కొనసాగిఉంటే భూములన్నీ కొట్టేసేవారన్నారు. సీఎం చంద్రబాబు విజనరీ ఆలోచనతో రాష్ట్రానికి పెట్టుబడులు వస్తున్నాయన్నారు. యువతకు ఉద్యోగాలు రావడమే కాకుండా రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందుతోందన్నారు. ఇక ఓర్వకల్లు పారిశ్రామిక వాడకు భారీగా పెట్టుబడులు తీసుకొస్తున్నామని, మార్చిలో రిలయన్స్ సంస్థల అధినేత ముకేష్ అంబానీ కర్నూలుకు వస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలు, దేశాల్లో ఒకే ప్రభుత్వం కొనసాగుతోందన్నారు. ఇక్కడ కూడా కూటమి ప్రభుత్వంపై ప్రజల ఆశీస్సులు ఎప్పటికీ ఉండాలని టీజీ భరత్ కోరారు.



## మ్యాలిగనూర్ గ్రామంలో గడ్డి వాము దగ్ధం

కౌతాళం, ఫిబ్రవరి 06 మనం న్యూస్: శుక్రవారం తెల్లవారు జామున మ్యాలిగనూర్ గ్రామంలో గడ్డివాము కాలిపోవడం జరిగింది. ఫైర్ ఇంజన్ తో మంటను కొంత మేరకు అదుపు చెయ్యడం జరిగిందనీ పశువులకు కూడా పెట్టిన గడ్డి కాలిపోవడం జరిగింది దాదాపు 1 లక్ష రూపాయలు వరకు నష్టపోవడం జరిగింది. కుటుంబం అంత కన్నీరు మున్నీరు అయ్యారు. కావున శరణ అనే రైతును ప్రభుత్వం వెంటనే ఆదుకోవలసిందిగా కోరుతున్నారు

# అనారోగ్యంతో దేవస్థానం ఉద్యోగి మృతి



మహానంది, ఫిబ్రవరి 6(మనంన్యూస్): మహానంది దేవస్థానంలో రికార్డు అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్న ఎర్రమల మదన్ కుమార్ (36)శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయనను గత రెండు రోజుల క్రితం నంద్యాల లోని ఒక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక తెల్లవారుజామున మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కుటుంబ సభ్యుల సమాచారం మేరకు ఈఓ శ్రీనివాసరెడ్డి, వేదపండితులు రవిశంకర్ అవధాని, ప్రధాన అర్చకులు అర్జున్ శర్మ, ఆలయ ఉద్యోగులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.అంత్యక్రియల నిమిత్తం కుటుంబ సభ్యులకు 25 వేల రూపాయల చెక్కు ను అందజేశారు.వారి వెంట సూపర్డెన్స్ శశిధర్ రెడ్డి, సుబ్బారెడ్డి, నీలకంటేశ్వర రాజు,టెంపుల్ ఇన్స్పెక్టర్ మల్లయ్య,తదితరులు పాల్గొన్నారు.

# నేడు బొంది మడుగులకు ఎస్సీ కమిషన్ చైర్మన్ రాక




తుగ్గలి ఫిబ్రవరి 06(మనం న్యూస్): రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కేఎస్ జవహర్ తుగ్గలి మండలం బొందిమడుగుల గ్రామానికి శనివారము వస్తున్నట్లు అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో పాత్రికేయులకు తెలిపారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ టీఎం రమేష్ హత్యకు గురి కావడంతో వారి కుటుంబాన్ని పరామర్శించడానికి రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కేఎస్ జవహర్ వస్తున్నట్లు వారు తెలిపారు.

# లేబర్ కోడ్స్ను తిప్పికొడుదాం సమ్మెను జయప్రదం చేద్దాం



జూపాడుబంగ్లా, ఫిబ్రవరి 6 (మనం న్యూస్): కేంద్ర బిజెపి ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్ అమలు జరపడానికి సిద్ధపడింది వాటిని రద్దు చేసేందుకై ఈనెల 12వ తారీకున దేశవ్యాప్తంగా సమ్మె నిర్వహించడం జరుగుతుందని ఈ సమ్మెను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఎం కర్ణ శ్రీనివాసులు.సిఐటియు మండల కార్యదర్శి ఆకుల రాము పిలుపునిచ్చారు. జూపాడు బంగ్లా మండలం ఎంపీడీవో గారికి శుక్రవారం రోజు పారిశుద్ధ కార్మికులతో కలిసి సమ్మె నోటీస్ ఇవ్వడం జరిగినది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో అధికారం చేపట్టిన నాటి నుంచి నేటి వరకు బిజెపి ప్రభుత్వం కార్మికులపై రైతులపై కక్ష సాధించే చట్టాలు తీసుకురావడం జరుగుతుందని అందుకు నాలుగు లేబర్ కోడ్స్ ను తీసుకు రావడం జరిగిందని వారు విమర్శించారు. బ్రిటిష్ పాలనలో కార్మిక కర్షకులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను నేడు బిజెపి ప్రభుత్వము కాలరాస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. 29కార్మిక చట్టాలను ప్రతిష్టవంతముగా అమలు చేయాలని కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని ఉద్యోగ భద్రత కల్పించాలని మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని యధావిధిగా కొనసాగించి వలసలు నివారించాలని జాబ్ కార్డు ఉన్న కుటుంబానికి రెండు వందల రోజులు పని దినాలు కల్పించి రోజు వేతనం పెరిగిన ధరలకు అనుకూలంగా ఏడు వందలు ఇవ్వాలని రైతులకు గిట్టుబాటు ధర పార్లమెంటులో చట్టం చేయాలని ఈ అంశాలు సాధించుకోవడానికి 12వ తారీకు జరిగే సమ్మెలో రైతులు కార్మికులు శ్రామికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా నాయకులు రంగమ్మ పారిశుద్ధ కార్మికులు పాల్గొన్నారు.

# ప్రైవేటు విద్యాసంస్థల్లో 25శాతం ఉచిత విద్య



- సిఎస్సి.ఏపీ.జిఓ వి.ఇన్ వెబ్సైట్లో దరఖాస్తు చేసుకోండి
- ఎంఈవోలు మాలతి, రమా వెంకటేశ్వర్లు

తుగ్గలి, ఫిబ్రవరి 06(మనం న్యూస్ ): పేద, బడుగు, బలహీనవర్గాల కుటుంబాల్లోని పిల్లలకు అన్ని ప్రైవేటు అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 25శాతం సీట్లకు ఉచిత అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాధికారులు మాలతి, రమా వెంకటేశ్వర్ల గౌడ్ తెలిపారు.ఈ సందర్భంగా ఎంఈవో లు మాట్లాడుతూ విద్యా హక్కుచట్టం-2009 సెక్షన్ 12(1)సీ నిబంధనల మేరకు అన్ని ప్రైవేటు విద్యాసంస్థల్లో ఒకటో తరగతికి 25 శాతం సీట్లను ప్రభుత్వం కేటాయించిందన్నారు. అర్హులైన వారు ఈనెల 20 నుంచి మార్చి 10 వరకు ఆన్లైన్ ఆధార్ వివరాలతో ఎస్ సి. ఏపీ. జి ఓ వి.ఇన్ వెబ్సైట్లోకి వెళ్లి దరఖాస్తు చేసుకోవచ్చని వారు పేర్కొన్నారు.

# ఘనంగా డ్రైవర్స్ దినోత్సవం వేడుకలు

- జెండా ఆవిష్కరణ చేసిన ఆర్టీవో




జూపాడుబంగ్లా, ఫిబ్రవరి 6 (మనం న్యూస్): జూపాడు బంగ్లా మండల కేంద్రంలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు ఎదురుగా ఉన్న డ్రైవర్స్ యూనియన్ కార్యాలయం నందు, డ్రైవర్స్ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించడం ఈ కార్యక్రమానికి ఆత్మకూర్ ఆర్టీవో ఏ సత్యనారాయణ రెడ్డి, ముఖ్య అతిథులుగా పాల్గొని జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆర్టీవో మాట్లాడుతూ డ్రైవర్ చేసే పనిలో గుర్తింపు రావాలనీ అందువల్ల గౌరవం ఉంటుందనీ. ఆకారంతో కాదు నేను చేస్తాలే అని నిర్లక్ష్యం చేయకూడదు. ఏకాగ్రత ఉండాలి ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదు తద్వారా ప్రమాదాలు జరుగుతాయి. మద్యం సేవించి వాహనాలు నడపకూడదని. డ్రైవింగ్ ను ఇష్టపడి చేయాలి మనస్ఫూర్తిగా చేయాలన్నారు. డాక్టర్ తర్వాత డ్రైవరే ముఖ్యమని ప్రతి ఒక్క డ్రైవర్ కు లైసెన్సులు తప్పనిసరిగా ఉండాలని. వాహనాలకు బీమా చేయించుకోవాలి రహదారి నిబంధనలు పాటించాలి ఓవర్ లోడు వేసుకోకూడదు. ప్రయాణికులు పరిమితముగా ఉండాలి. అప్పుడే ప్రజలు సుఖసంతోషాలతో ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో షేక్ సైఫుద్దీన్ సిపిఐ ఎం రమేష్ బాబు డ్రైవర్స్ అసోసియేషన్ లీడర్స్ కాజా గణేష్ చాంద్ భాష మండలంలోని డ్రైవర్లంతా పాల్గొన్నారు.

# పుణ్య దంపతుల వివాహ వార్షికోత్సవం

- హృదయానేస్తాలుగా తొలి అడుగు
- 17వ వివాహ వార్షికోత్సవం ఘనంగా జరిగిన వైఎస్ఆర్సిపి యువనేత




తుగ్గలి, ఫిబ్రవరి 06(మనం న్యూస్ ): ఆదర్శ దాంపత్యానికి నిలువెత్తు రూపమైన చక్కా వారి 17వ వివాహ వార్షికోత్సవం ఘనంగా జరిగాయి. తుగ్గలి మండల చిన్నజొన్నగిరి గ్రామంలో భార్య భర్తల అపురూప బంధానికి.. ఆదర్శ దాంపత్యానికి నిలువెత్తు రూపం ఆ సీతారామచంద్రులైన వైసీపీ యువ నేత చక్కా శ్రీను, చక్కా అరుణ దంపతులు 17వ వివాహ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగాయి. అనంతరం దంపతులు కేకు కట్ చేశారు. హృదయానేస్తాలుగా 2009లో తొలి అడుగు వేశారు. చక్కా శ్రీను మాట్లాడుతూ అభిమానులు, సన్నిహితులు మధ్య వివాహ వార్షికోత్సవం వేడుకలు నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. సీతారాముల్లాంటి ఈ దంపతులు ఆయురారోగ్యాలతో, ప్రేమతో, సుఖసంతోషాలతో మరెన్నో ఏళ్లు జరుపుకోవాలని కుటుంబ సభ్యులు ఆకాంక్షించారు.

# నివాళులు అర్పించిన సర్పంచ్ పంపాపతి గౌడ్



కౌతాళం, ఫిబ్రవరి 06 మనం న్యూస్: మండలంలోని వల్లూరు గ్రామంలోని వడ్డే కుండ నరసయ్య అనారోగ్యంతో మృతి చెందారని తెలిసిన వెంటనే తెదేపా రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి అడివప్ప గౌడ్ ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ పంపాపతి గౌడ్ పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆది బసవరాజు గౌడ్,మేటి బసవరాజ్ గౌడ,వడ్డే సిద్ధ, నర్సప్ప మూకన్న తదితరులు పాల్గొన్నారు.

# మహాశివరాత్రి ఏర్పాట్లపై శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో మంత్రి ఆనం సమీక్ష



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 06,మనం న్యూస్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాదాయ శాఖ మాత్యులు ఆనం రామనారాయణరెడ్డి, దేవాదాయ శాఖ సెక్రెటరీ డాక్టర్.జవహర్ లాల్, దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్ శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి మహాశివరాత్రి బ్రహ్మోత్సవం అధికారుల సమీక్ష సమావేశానికి విచ్చేసినారు. ఈ కార్యక్రమము బ్రహ్మగుడి ఆవరణంలో జరిగినది. ఈ కార్యక్రమంలో అన్ని ప్రభుత్వ రంగాల అధికారులు పాల్గొన్నారు. తదుపరి శ్రీకాళహస్తీశ్వరుని దర్శించుకున్నారు.వారికి శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి, ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్,ఆలయ కార్యనిర్వాహణాధికారి టి. బాపిరెడ్డి,అధికారులు సాదరంగా దక్షిణ గోపురం వద్ద పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఆహ్వానించారు. వారికి అంతరాలయ దర్శనము, వేద ఆశీర్వచనం ఏర్పాటు చేయడమైనది.సదరు కార్యక్రమంలో శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్, ట్రస్టు బోర్డు సభ్యులు వాకచర్ల గురప్ప శెట్టి,జి.గోపీనాథ్, కొమ్మనబోయిన రజిని, పి.హేమావతి,డి.లక్ష్మమ్మ, కళ్ళే సావిత్రి, డిప్యూటీ ఈవో ఏన్ఆర్ కృష్ణారెడ్డి, ఆలయ ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి, ప్రోటోకాల్ ఏఈఓ మోహన్, ఆలయ పర్యవేక్షకులు నాగభూషణం, ఏపిర్వో రవి పాల్గొన్నారు.

# ప్రజలే మిమ్మల్ని వద్దనుకున్నారు..

## ప్రశాంత్ కిశోర్కు సుప్రీం చురకలు



ఢిల్లీ, ఫిబ్రవరి 6: ప్రశాంత్ కిశోర్కు చెందిన జన్ సురాజ్ పార్టీకి సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. గతేడాది బిహార్లో జరిగిన ఎన్నికల ఫలితాన్ని సవాల్ చేస్తూ ఆ పార్టీ వేసిన పిటిషన్ను అత్యున్నత న్యాయస్థానం తోసిపుచ్చింది. ఈ సందర్భంగా ప్రజలే మీ పార్టీని వద్దనుకున్నారంటూ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ చురకలంటించారు. ఇప్పుడు ఈ న్యాయవేదికను ప్రచారానికి వాడుకుంటున్నారా అని ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికల్లో 238 స్థానాల్లో పోటీకి దిగిన ప్రశాంత్ కిశోర్ పార్టీ.. ఒక్క సీటు కూడా దక్కించుకోలేకపోయింది. ఇందులో ఎన్డీయే కూటమి ఘన విజయాన్ని సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. అయితే, గెలిచిన కూటమి సభ్యులు ఎన్నికల్లో ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించి.. ఒక్కో మహిళకు రూ.10వేలు పంపిణీ చేశారని జన్ సురాజ్ పార్టీ పిటిషన్లో ఆరోపించింది. ఈ క్రమంలో కూటమి గెలుపు చెల్లదని ప్రకటించాలని ఆ పార్టీ కోరింది. అయితే జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ పిటిషన్ను విచారించేందుకు నిరాకరించింది. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ.. 'మేము ఇలాంటి నోటీసులు జారీ చేయలేం. ఎన్నికల్లో ఓడిపోయారు కాబట్టి.. మొత్తం ఫలితాన్ని పక్కన పెట్టాలని మీరు కోరుతున్నారు. ఇలాంటి అంశాలపై రాజకీయ పార్టీలు కాకుండా.. సామాన్యులు కోర్టుకు రావడాన్ని మేం స్వాగతిస్తాం. ఒకవేళ.. మీ పార్టీ అధికారంలోకి వచ్చినా మీరూ అదే చేస్తారు' అని వ్యాఖ్యానించారు. ఇంకా ఏమైనా ఫిర్యాదులు ఉంటే బిహార్ హైకోర్టును ఆశ్రయించాలని ధర్మాసనం సూచించింది.


# జనంలోకి జనసేన

హైదరాబాద్, మనం ప్రతినిధి : తెలంగాణ రాష్ట్రంలో మరోసారీ జనంలోకి జనసేన రానుంది. ఈ నెల 11న జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో జనసేన పార్టీ తరపునా రాష్ట్ర వ్యాప్తంగా 336 వార్డుల్లో పోటీ చేయనుంది. ఈ మేరకు జనసేన తెలంగాణ పార్టీ శుక్రవారంనాడు పత్రికా ప్రకటనను విడుదల చేసింది. ఇక, జిల్లాల వారీగా తమ పార్టీ అభ్యర్థులు ఎక్కడా పోటి చేస్తున్నారు? ఎంత మంది పోటీ చేస్తున్నారో? తాజాగా వారి వివరాలను సైతం పేర్కొంది. అయితే, అత్యధికంగా కరీంనగర్ జిల్లాలో 56 వార్డుల్లో, అత్యల్పంగా మహబూబాబాద్ జిల్లాలో 5 వార్డుల్లో పోటీ చేస్తోంది. అయితే, 11న జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో తెలంగాణ వ్యాప్తంగా 336 వార్డుల్లో పార్టీ అభ్యర్థులు పోటీ చేస్తున్నారని, వారి నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారులు ఆమోదించారని తెలిపింది. జనసైనికులు, వీర మహిళలు పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేసింది.

### ఏయే జిల్లాలు.. ఎన్ని వార్డులంటే?..

కరీంనగర్లో 56, నిజామాబాద్లో 48, నల్గొండలో 46, మహబూబ్ నగర్లో 44, ఆదిలాబాద్లో 39, కొత్తగూడెంలో 22, రంగారెడ్డిలో 21, వరంగల్లో 20, మెదక్లో 18, ఖమ్మంలో 17, మహబూబాబాద్ లో 5 వార్డుల్లో మున్సిపాల్ ఎన్నికలలో జనసేన అభ్యర్థులు పోటీ చేస్తున్నట్లు పార్టీ ప్రకటించింది.

# అబుధాబీలో రష్యా-ఉక్రెయిన్ చర్చలు



కీవ్, ఫిబ్రవరి 6: దాదాపు నాలుగేళ్లుగా సాగుతున్న యుద్ధానికి తెరదించే ప్రయత్నాల్లో భాగంగా.. యూఏఈ రాజధాని అబుధాబీ వేదికగా రష్యా, ఉక్రెయిన్ల చర్చలు రెండో రోజు కూడా కొనసాగించాయి. అమెరికా మధ్యవర్తిత్వంతో జరుగుతున్న ఈ రెండో రౌండ్ చర్చల్లో ఇప్పటివరకూ ఏయే అంశాలపై ఏకాభిప్రాయం కుదిరిందన్నది అధికారికంగా వెల్లడి కాలేదు. అమెరికా ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్కాఫ్, ఆ దేశాధ్యక్షుడు ట్రంప్ అల్లుడు జేర్డ్ కుష్నర్, ఐరోపాలో నాటో సుప్రీం అలైడ్ కమాండర్ జనరల్ అలెక్సస్ గ్రింకెవిచ్ తదితరులు తాజా చర్చల్లో పాల్గొన్నారు. అబుధాబీలోనే గత నెల్లో జరిగిన తొలి రౌండ్ సమాలోచనల్లోనూ విట్కాఫ్, కుష్నర్ పాల్గొన్న సంగతి గమనార్హం. మరోవైపు- రష్యాతో జరుగుతున్న యుద్ధంలో ఇప్పటివరకూ తమ సైనికులు 55 వేల మంది అమరులయ్యారని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ తెలిపారు. ఇంకా చాలామంది సైనికుల జాడ తెలియరావడం లేదని కూడా పేర్కొన్నారు. తమ రెండు దేశాల మధ్య ఉన్నత స్థాయి మిలిటరీ-మిలిటరీ కమ్యూనికేషన్ను పునరుద్ధరించుకోవాలని రష్యా, అమెరికా తాజాగా నిర్ణయించుకున్నాయి. అబుధాబీలో రష్యా, అమెరికా, ఉక్రెయిన్ సైనిక ఉన్నతాధికారుల మధ్య జరిగిన చర్చల్లో ఈ కీలక అంగీకారం కుదిరింది. అమెరికా ఐరోపా కమాండ్ ప్రకటన విడుదల చేసింది. దీర్ఘకాలిక శాంతి కోసం పనిచేసేందుకు ఇది దోహదపడుతుందని తెలిపింది. ఉక్రెయిన్పై రష్యా యుద్ధం ప్రారంభానికి ముందు 2021లో రష్యా, అమెరికా తమ మధ్య ఉన్నత స్థాయి మిలిటరీ-మిలిటరీ కమ్యూనికేషన్ను సస్పెండ్ చేసుకున్న సంగతి గమనార్హం.

# వరల్డ్ ఛాంపియన్స్‌గా భారత్





అండర్-19 ప్రపంచకప్ 2026 విజేతగా భారత్ నిలిచింది. జింబాబ్వేలోని హరారే స్పోర్ట్స్ క్లబ్ వేదికగా జరిగిన ఫైనల్ మ్యాచ్ లో ఇంగ్లండ్ ను 100 పరుగుల తేడాతో ఓడించిన యువ భారత్.. ఆరో వరల్డ్ కప్ టైటిల్ ను సొంతం చేసుకుంది. ఈ తుది పోరులో మొదట బ్యాటింగ్ చేసిన టీమిండియా నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 411 పరుగుల భారీ స్కోర్ సాధించింది.

భారత యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ ఈ టోర్నీ చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచిపోయే ఇన్నింగ్స్ ఆడాడు. 14 ఏళ్ల వైభవ్ తన బ్యాటింగ్ తో విధ్వంసం సృష్టించాడు. కేవలం 80 బంతుల్లో 175 పరుగులు (15 ఫోర్లు, 15 సిక్సర్లు) చేసి ఫైనల్ మ్యాచ్ చరిత్రలోనే అత్యధిక వ్యక్తిగత స్కోరు సాధించిన ఆటగాడిగా నిలిచాడు. అతడితో పాటు కెప్టెన్ అయూశ్ మాత్రే(53), కనిష్క్ చౌహాన్ (37) రాణించారు. ఇంగ్లండ్ బౌలర్లలో జేమ్స్ మింటో మూడు వికెట్లు పడగొట్టగా.. సెబాస్టియన్ మోర్గాన్, అలెక్స్ గ్రీన్ తలా రెండు వికెట్లు సాధించారు.

**ఫాల్కనర్ వీరోచిత పోరాటం..**

అనంతరం భారీ లక్ష్య ఛేధించేందుకు బరిలోకి దిగిన ఇంగ్లండ్ 40.2 ఓవర్లలో 311 పరుగులకు ఆలౌటైంది. ఇంగ్లండ్ బ్యాటర్లలో కాలేబ్ ఫాల్కనర్ వీరోచిత పోరాటం కనబరిచాడు. ఓవైపు క్రమం తప్పుకొండా వికెట్లు పడుతున్నప్పటికీ ఫాల్కనర్ మాత్రం తన ప్రయత్నం ఆపలేదు. ఫాల్కనర్ బంతుల్లో 115 పరుగులు చేసి చివరి వికెట్ గా వెనుదిరిగాడు.

అతడితో పాటు బెన్ డాకిన్స్ (66),థామస్ రెవ్(31) తమ వంతు ప్రయత్నం చేశారు. మిగితా బ్యాటర్లు మొత్తం దారుణంగా విఫలమయ్యారు. భారత బౌలర్లలో ఆర్ఎస్ అంబరీష్ మూడు వికెట్లు పడగొట్టగా.. కనిష్క్ చౌహాన్, దీపేష్ దేవేంద్రన్ తలా రెండు వికెట్లు సాధించారు. ఫైనల్లో భారీ సెంచరీతో చెలరేగిన వైభవ్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్గా నిలిచాడు.

## హర్షిత్ రాణా పొట్టి ప్రపంచకప్‌నకు దూరం!

భారత పేసర్ హర్షిత్ రాణా గాయం కారణంగా టీ20 వరల్ కప్ 2026 నుంచి వైదొలిగినట్లు సమాచారం. బుధవారం దక్షిణాఫ్రికాతో జరిగిన వార్మప్ మ్యాచ్ లో హర్షిత్ మైదానాన్ని వీడాడు. అతడు ఆ మ్యాచ్ లో ఒక ఓవర్ మాత్రమే బౌలింగ్ వేసి 16 పరుగులు ఇచ్చాడు. ఆ సమయంలోనూ రెండు సార్లు తన రనప్పు ఆపాడు. మోకాలి నొప్పితో బాధపడ్డట్లు కనిపించాడు.

అతడి కుడి మోకాలి జాయింట్ లో సమస్య ఉన్నట్లు తెలుస్తోంది. స్కాన్లలోనూ ఆ విషయం వెల్లడైనట్లు సమాచారం. డాక్టర్ల సూచన మేరకు హర్షిత్ రాణా మెగాటోర్నీ నుంచి వైదొలిగినట్లు వార్తలు వస్తున్నాయి. ఇదే జరిగితే టీమ్ఇండియా కూర్పులో మార్పులు చేర్పులు జరిగే అవకాశముంది. ఈ విషయాన్ని పొట్టి ప్రపంచకప్ నకు ముందు నిర్వహించిన ప్రెస్ కాన్ఫరెన్స్ లో విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా సూర్యకుమార్ యాదవ్ తెలిపాడు.

'హర్షిత్ రాణా ఇబ్బంది పడుతున్నాడు. ఆ విషయం మాకు ఈ రోజు తెలిసింది. ఒక వేళ హర్షిత్ రాణా జట్టుకు దూరమైతే, అది మాకు పెద్ద నష్టం. మేం వేరే కాంబినేషన్లు ప్రయత్నిస్తాం. అయితే మా రిజర్వ్ బెంచ్ బలంగా ఉంది' అని సూర్య అన్నాడు.



## విజయ్‌కు మద్రాసు హైకోర్టులో చుక్కెదురు

మద్రాసు హైకోర్టులో నటుడు, టీవీకే అధినేత విజయ్ కు చుక్కెదురైంది. ఆదాయపన్ను శాఖ విధించిన పెనాల్టీకి వ్యతిరేకంగా హైకోర్టును ఆశ్రయించగా.. విచారించిన న్యాయస్థానం విజయ్ పిటిషన్ ను కొట్టేసింది. 2015-16 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి విజయ్ రూ.1.50 కోట్ల జరిమానా చెల్లించాలని ఐటీ శాఖ నోటీసులు ఇచ్చింది. దీనిపై 2022లో విజయ్ హైకోర్టును ఆశ్రయించారు. గత నెలలో తీర్పును రిజర్వ్ చేసిన హైకోర్టు.. ఇప్పుడు పిటిషన్ ను కొట్టివేస్తూ తీర్పునిచ్చింది.

అందుకే జరిమానా..

2015-16 ఆర్థిక సంవత్సరానికి గానూ ఆదాయపన్ను రిటర్ను దాఖలు చేసినప్పుడు ఆ ఏడాది విజయ్ రూ.35 కోట్లు ఆదాయం పొందినట్లు ఆదాయ పన్ను శాఖ మద్రాసు హైకోర్టులో నివేదిక దాఖలు చేసింది. అందుకు సంబంధించి మదింపు చేపట్టిన ఆదాయపన్ను శాఖ విజయ్ ఇంట్లో జరిపిన సోదాల్లో స్వాధీనం చేసుకున్న పత్రాలను సరిచూడగా 'పులి' సినిమాకు తీసుకున్న రూ.15 కోట్ల ఆదాయాన్ని లెక్కల్లో చూపలేదని తేలింది. ఆ ఆదాయాన్ని దాచినందుకు రూ.1.50 కోట్ల జరిమానా విధిస్తూ ఆదాయపన్ను శాఖ ఉత్తర్వులు ఇచ్చింది. దీనిని సవాలు చేస్తూ విజయ్.. మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు.

విజయ్ నటించిన కొత్త సినిమా 'జన నాయగన్' వివాదంలో చిక్కుకున్న సంగతి తెలిసిందే. జనవరి 9న విడుదల కావాల్సిన ఈ సినిమా సెన్సార్ సమస్య కారణంగా వాయిదా పడింది. కొత్త విడుదల తేదీ ఎప్పుడనే ఉత్కంఠ ఇంకా వీడలేదు.





## యాక్షన్‌తో అదరగొట్టనున్న మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్

మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ మరియు సెన్సేషనల్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాంబినేషన్ లో తెరకెక్కుతున్న హై-వోల్టేజ్ యాక్షన్ ఎంటర్టైనర్ 'డ్రాగన్' శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. ఈ చిత్ర నెక్స్ట్ షెడ్యూల్ జోర్డాన్ లో షూటింగ్ జరుపుకోనుంది. దీనికోసం చిత్ర యూనిట్ ఇప్పటికే అక్కడ లొకేషన్స్ ఫైనల్ చేశారు. ఫిబ్రవరి నెలలో జరగబోయే ఈ షెడ్యూల్లో ఎన్టీఆర్ పై మూడు




అత్యంత భారీ యాక్షన్ సీక్వెన్స్ లను చిత్రీకరించడానికి ప్రశాంత్ నీల్ ప్లాన్ చేస్తున్నాడు.

ఈ సినిమాలో తారక్ ను మరింత పవర్ ఫుల్ గా చూపించేందుకు ప్రశాంత్ నీల్ రెడీ అవుతున్నాడు. ఈ సినిమా కోసం ఎన్టీఆర్ బాడీ లాంగ్వేజ్ మరియు ఫిజిక్ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. జోర్డాన్ షెడ్యూల్ లో చిత్రీకరించబోయే యాక్షన్ సీక్వెన్స్ లు సినిమాకే హైలైట్ గా ఉండనున్నాయట.

ఇక ఈ సినిమాలో ఎన్టీఆర్ సరసన కన్నడ బ్యూటీ రుక్మిణీ వసంత్ హీరోయిన్ గా నటిస్తుండగా, బాలీవుడ్ సీనియర్ స్టార్ అనిల్ కపూర్ కీలక పాత్రలో కనిపించబోతున్నారు. మలయాళ నటుడు టోవినో థామస్ కూడా ఈ ప్రాజెక్టు లో భాగమైనట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ మరియు ఎన్టీఆర్ ఆరట్స్ సంయుక్తంగా భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు.

## కిరణ్ అబ్బవరం క్రేజీ సీక్వెల్ చిత్రం.. మార్పు ఖాయమా..?



యంగ్ హీరో కిరణ్ అబ్బవరం కెరీర్ లో బిగ్గెస్ట్ హిట్ గా నిలిచిన సస్పెన్స్ థ్రిల్లర్ 'క' (ఓఅ) సీక్వెల్ కు సంబంధించి ఒక ఆసక్తికరమైన వార్త ఫిలిం నగర్ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. 2024 దీపావళి కానుకగా విడుదలై రూ.50 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసిన ఈ చిత్రం, వరుస ఫ్లాపుల్లో ఉన్న కిరణ్ కు సాలిడ్ హిట్ ఇచ్చింది. అయితే, ఈ సినిమా రెండో భాగంలో కిరణ్ అబ్బవరం నటిస్తాడా లేదా అనే దానిపై ప్రస్తుతం అయోమయం నెలకొంది.

ఈ చిత్ర నిర్మాత చింతా గోపాలకృష్ణారెడ్డి ఇటీవల తన తాజా చిత్రం 'శ్రీ చిదంబరం గారు' ప్రమోషన్స్ లో భాగంగా 'క' సీక్వెల్ గురించి కొన్ని కీలక విషయాలు వెల్లడించారు. 'క-2' చిత్రాన్ని 2027 జనవరిలో విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నామని, దీనికి కూడా సుజీత్-సందీప్ ద్వయమే దర్శకత్వం వహిస్తారని ఆయన స్పష్టం చేశారు. అయితే, హీరో విషయంలో మాత్రం దర్శకులే తుది నిర్ణయం తీసుకుంటారని పేర్కొంటూ, కథ డిమాండ్ చేస్తే హీరో మారే అవకాశం ఉందని సంకేతాలిచ్చారు. ఇది కిరణ్ అబ్బవరం అభిమానులను కాస్త ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

ప్రస్తుతం ఈ సీక్వెల్ కు సంబంధించిన ప్రీ-ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మొదటి భాగం ముగింపులోనే సీక్వెల్ కు సంబంధించిన హింట్ ఇచ్చినప్పటికీ, అది అదే పాత్ర యొక్క కొనసాగింపా లేక సరికొత్త ప్లాట్ తో రాబోతుందా అనేది తెలియాల్సి ఉంది. కిరణ్ అబ్బవరం ఈ ప్రాజెక్టులో కొనసాగుతారా లేదా అన్న దానిపై స్పష్టత రావాలంటే మరికొన్ని రోజులు వేచి చూడాల్సిందే.

## నోరా ఫతేహికి ఆ విషయంలో కలిసిరాని లక్!

నోరా ఫతేహి ఐటం సాంగ్ స్పెషలిస్ట్. దిల్‌బర్ సాంగ్ తో సెన్సేషన్ సృష్టించింది. శరీరాన్ని రబ్బర్ లా సాగదీస్తూ, విల్లులా వంచుతూ స్టెప్పులేయడంలో ఆమె దిట్ట. తన ఎనర్జీకి, అందానికి చాలామంది ఫ్యాన్స్ ఉన్నారు. నేడు (ఫిబ్రవరి 6న) ఆమె 34వ పుట్టినరోజు. ఈ సందర్భంగా ఆమె గురించి కొన్ని విషయాలు తెలుసుకుందాం..

**కెరీర్**

నోరా ఫతేహి కెనడా నటి. కెనడాలోని టోర్నటోలో పుట్టిపెరగడంతోపాటు అక్కడే చదువుకుంది. రోర్ (2014) సినిమాతో నటిగా బాలీవుడ్ లో అడుగుపెట్టింది. ఆ మరుసటి ఏడాది టెంపర్ సినిమాలో ఇట్టాగే రెచ్చిపోదాం పిల్లా.. అనే ప్రత్యేక పాటలో అదరగొట్టింది. అక్కడినుంచే తన ఐటం సాంగ్స్ జర్నీ మొదలైంది. బాహుబలి మూవీలో 'మనోహరి..' అంటూ ప్రభాస్ ను చుట్టుముట్టేసే సాంగ్ తో మరింత ఆదరణ పొందింది.

**నటిగా కలిసిరాని అదృష్టం**

తెలుగులోనే కాకుండా తమిళ, హిందీ, మలయాళ భాషల్లోనూ ఐటం సాంగ్స్ చేసింది. అయితే తనకు నటిగా కనిపించాలన్న కోరిక ఎక్కువ. అలా రెండేళ్లుగా ఐటం సాంగ్స్ పై ఫోకస్ తగ్గించేసి యాక్ట్రెస్ గా సినిమాలు చేస్తోంది. తెలుగులో మట్కా సినిమా చేయగా ఇది అట్టర్ ఫ్లాప్ అయింది. ఇక్కడే కాదు హిందీలోనూ తను నటించిన సినిమాలు పెద్దగా విజయవంతం కాకపోవడంతో నటిగా బ్రేక్ రావడం లేదు. దీంతో మళ్లీ గతేడాది చివర్లో థామా మూవీలో స్పెషల్ సాంగ్ లో కాలు కదిపింది.

**బిగ్ బాస్ షోలోనూ..**

నోరా డ్యాన్సర్, నటి మాత్రమే కాదు, సింగర్ కూడా! ప్రస్తుతం నోరా ఫతేహి.. కన్నడలో కేడీ: ద డెవిల్, తమిళంలో కాంచన 4 సినిమాలు చేస్తోంది. మరి వీటితోనైనా బ్రేక్ వస్తుందేమో చూడాలి! నోరా ఫతేహి.. హిందీ బిగ్బాస్ 9వ సీజన్ లోనూ పార్టిసిపేట్ చేసింది. డ్యాన్స్ ఐకాన్ గా పేరు తెచ్చుకున్న ఈ బ్యూటీ జలక్ దిక్లాజా 9వ సీజన్ లో కంటెస్టెంట్ గా అడుగుపెట్టింది. ఆ తర్వాత ఇదే షోకి జడ్జిగా వ్యవహరించడం విశేషం.

## బాలీవుడ్‌లో 90శాతం పెళ్లిళ్లు ఫేక్.. 'హిట్3' విలన్ ఆసక్తికర వ్యాఖ్యలు

బాలీవుడ్ లో 90శాతం పెళ్లిళ్లు ఫేక్ అని అంటున్నారు నటుడు ప్రతీక్ స్మిత పాటిల్. నటుడు రాజ్ బబ్బర్ తనయుడిగా ఇండస్ట్రీలోకి వచ్చినా.. కుటుంబంలో నెలకొన్న సమస్యల కారణంగా తండ్రికి దూరంగా ఉంటున్నారు. గతేడాది ప్రియా బెనర్జీతో ప్రతీక్ వివాహం జరిగినా తండ్రిని ఆహ్వానించలేదు. తాజాగా సతీమణితో కలిసి ప్రతీక్ ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలీవుడ్ లో బంధాలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

''ప్రజలకు చాలా వరకూ వాస్తవాలు తెలియవు. ఇండస్ట్రీలో ఉన్న కొంతమందికే అవి తెలుస్తాయి. కానీ, ఏదో ఒక రోజు అందరికీ నిజం తెలిసి తీరుతుంది. అది ఓ కథ, పుస్తకం, ఇంటర్వ్యూ, లేదా సినిమాగా రావచ్చు'' అని అన్నారు. తమ పెళ్లికి ముందు జీవితం ఎన్నో పరీక్షలు పెట్టిందని ప్రియా బెనర్జీ అన్నారు. ఎవరి స్థాయికి తగినట్లు వారికి సమస్యలు ఎదురవుతూ ఉంటాయన్నారు. అలా వచ్చిన ప్రతి సమస్యకు స్పందించాల్సిన అవసరం లేదని.. ఆ సమయంలో ఒకరికి ఒకరు తోడుగా ఉన్నామని తెలిపారు.

''బాలీవుడ్ లో 90శాతం వివాహ బంధాలు ముసుగుతోనే ఉంటాయి. మేము ఇండస్ట్రీలో ఉన్నాం కాబట్టి మాకు తెలుసు. పెళ్లయిన వాళ్లే.. 'రాత్రి అయిపోతే, విషయం అయిపోయినట్టే' అంటున్నారంటే పరిస్థితి ఏంటో అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుతం ఒకరినొకరు మోసగించుకోవడం ఫ్యాషన్ అయిపోయింది. అది ఒక్కరితో ఆగడం లేదు. మన సంస్కృతి గొప్పది. కానీ, ఇక్కడ (బాలీవుడ్) చాలా మంది పెళ్లిని ఒక జోక్ లా చూస్తున్నారు'' అంటూ అటు ప్రతీక్, ఇటు ప్రియా బెనర్జీ చెప్పుకొచ్చారు. ప్రతీక్ 'బచన్ పాండే,' 'సికిందర్' సహా పలు బాలీవుడ్ చిత్రాల్లో నటించారు. తెలుగులో నాని నటించిన 'హిట్3'లో విలన్గా చేశారు.




Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises D.No:3-88, Gosala village, Penamaluru Mandal, Krishna District 521151(AP), And Published at H.No.23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidupet Guntur(District) AP-522002. EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939.